
శ్రీమాత్రేనమః

# ప్రపంచ జీవ వినోద యాత్ర

1-2-3-భాగములు




గ్రంథకర్త:

విద్వాన్ : డా. రాణి నరసింహ చ[illegible]నులు

కాపీరైట్]　　1981　　[వెల : రు. 10-00

వరుస సంఖ్య | పేజి


24) ఊరిలోని వివాహము - ఊరిలోనివారికి ఉత్సాహదాయకము - ఏల కన్యా లక్షణము, 34

25) పెండ్లి యాడరాని కన్య, వరలక్షణము, 35

26) వధూవరుల వయః ప్రమాణము 36

27) గర్భాదాన యోగ్యవయః కాలము
గర్భాదాన యోగ్య కాలము 37

28) ఋతు కాల నిర్ణయములు 38

29) స్త్రీ పురుష సంతానము కలుగుటకు కారణము 39

30) పుంసవనము 40

31) ఏ రోజు కలసిన ఎట్టి సంతానము కలుగును 41

32) స్త్రీ పురుషులు కలియుటకు ఉండవలసిన నియమములు 42

33) ఎట్టి స్త్రీని కూడరాదు
గర్భాదానమునకు శుభనక్షత్రావశ్యకత, స్త్రీకి అలంకారాదుల ఆవశ్యకత. 43

34) సంసర్గ కాల నియమములు 44

35) షండ (పేడివాని) లక్షణము, అస్థి వివాహేన గర్భోత్పత్తి 46

36) కలలము పుట్టుటకు హేతువు, దుష్ట సంతానమునకు హేతువు 47

37) మంచి సంతానమునకు హేతువు, నియమ ప్రాధాన్యము 48

38) బాల్య వివాహ ప్రాధాన్యము, రజస్వలానంతర వివాహ నిషేధము 49

39) స్త్రీ పునర్వివాహము వలన పుట్టిన సంతాన లక్షణము 50

40) పునర్వివాహ నిషేధము 51

41) సగోత్ర వివాహ నిషేధము 52

42) సాపిండ్య నివృత్తి 53

43) స్త్రీ దూషణ హేతువులు. 54

44) స్త్రీ నియమములు, స్త్రీ రక్షణావశ్యకత 55

45) సంస్కారములు వాటి ఆవశ్యకత 57

46) ఈ నియమము లెవరికి? 58


O2:4
35N81.2

— o — o —

# ప్రపంచ జీవ వినోద యాత్ర

## ( రెండవ భాగము )

### :- మోక్షము - ఋణత్రయ విముక్తి :-

శ్లో॥ ఋణానిత్రీణ్యపాకృత్య - మనః మోక్షే - నివేశయేత్ ।
అనపాకృత్య - మోక్షంతు - సేవమానః పతత్యధః ॥

ప్రతి ఒక్కరు "శ్రు॥ జాయమానోహవై బ్రాహ్మణః
త్రిభిః - ఋణ వాజాయతే"

అని చెప్పినట్లు పుట్టుకతోనే ఋషి - దేవ - పితృ - ఋణములతో పుట్టుదురు.

ఏ మానవుడు "బ్రహ్మత్వమి హైవచ - ఆప్నోతి" అనినట్లు ఈ లోకము నందే "బ్రహ్మత్వాన్ని" పొంది దేవయానము (అర్చిరాది - మార్గము) గుండా పయనించి బ్రహ్మపథాన్ని పొంద కోరుతాడో, అతడు తొలుత "ఋషి - దేవ - పితృ ఋణముల నుండి విముక్తుడై ఋణత్రయ విశుద్ధి పత్రాన్ని (క్లియరింగ్ సర్టిఫికెటు) సంపాదించిన పిమ్మట బ్రహ్మత్వాన్ని సాధించియు, పితృకర్మల ద్వారా ప్రేతత్వాన్ని పోగొట్టుకొని పరలోక యాత్రార్హత పత్రమును (పాస్‌పోర్టును) సంపాదించినచో దేవయానము గుండా పయనించి "బ్రహ్మ పథాన్ని" పొందగలుగుతాడు. ఋణత్రయ విముక్తుడు కానిచో మొదట బ్రహ్మత్వ సాధనార్హతనే కోల్పోతాడు. ఒకవేళ ఋణత్రయ విముక్తి ద్వారా "బ్రహ్మత్వాన్ని" సంపాదించినను ప్రేతత్వనిరాస ద్వారా పరలోక యాత్రార్హత పత్రాన్ని "పాస్‌పోర్టును" సంపాదించనిచో దేవయానముగుండా పయనించుటకు అర్హత లేనివాడై ఈ లోకమునందే ప్రేతగా ఉండిపోతాడు.

ఈ విషయమే :

శ్లో॥ యస్మైతాని నదత్తాని ప్రేతకర్మాణి షోడశ।
పిశాచత్వం స్థిరంతస్య ప్రేతత్వం నైవ ముంచతి॥
అని చెప్పబడినది.

కాన బ్రహ్మత్వాన్ని పొందగోరు ప్రతి యాత్రికుడు తొలుత ఋణత్రయ విముక్తుడగుట; పిమ్మట ప్రేతత్వనిరాస ద్వారా పరలోకయాత్రార్హతను సంపాదించుటయు ఎంతో అవసరము.

1) ఋషి రుణము:- 'బ్రహ్మచర్యేణ ఋషిభ్యః' లోకంలో మార్కోని, రైటు సోదరులు, ఎడిసను మొదలగు శాస్త్రజ్ఞులు తమ జీవితాలను ధారపోసి క్రొత్త విషయాలను కనుగొన్నారు. ఎవరి కొరకు ? వారి కొరకా ? కాదు. లోకం కొరకు. లోకం ఆ విజ్ఞానాన్ని తెలుసుకొని ఆచరణలో పెట్టినపుడే "క్లేశః ఫలేనహిపునః - నవతాం ప్రయాతి" అనినట్లు **వారి** కష్టం ఫలించి, వారికి ఆనందాన్ని కలిగిస్తుంది. అట్లు చేయనివారు వారికే ఋణపడి ఉంటారన్నమాట. కాని అందరు ఆ విజ్ఞానాన్ని తెలుసుకొనుట కష్టము. అందుచేతనే ఏ కొద్దిమందో మేధావులు ఆ విజ్ఞానాన్ని తెలుసుకొని ఆచరించి జన సామాన్యానికి అందచేస్తూ ఉంటే దానిని వారు అనుభవించి ఆనందిస్తారు. ఈ విద్యుద్దీపాలు, విమానాలు, టెలివిజను టెలీ ప్రింటరు మొదలగునవి వారి కృషి ఫలితమే కదా ! అట్లు ఆనందించుటయే శాస్త్రజ్ఞుల యొక్క, కవుల యొక్క కృషికి ఫలితము.

మరియు ఋషులును అట్లే తమ ఐహిక సుఖములను వీడి అడవులలో తపస్సు చేసి ఐహిక - ఆముష్మిక సుఖములను

ఇచ్చెడి వేద విజ్ఞానాన్ని శాస్త్ర ఇతిహాస పురాణాదుల యందు ఇమిడ్చి లోకానికి అంద చేశారు. ఆ వేద - వేదాంగములను బ్రహ్మచర్య వ్రతమున అభ్యసించి తెలుసుకొని ఋషి ఋణ విముక్తుడవుతాడు. 'అవిప్లుత బ్రహ్మచర్యః - లక్షణ్యాం స్త్రియముద్వహేత్॥'' అనినట్లు బ్రహ్మచర్యవ్రతమును యథా విధిగా నిర్వహించి ఋషి ఋణ విముక్తుడైన పిమ్మట, దేవ - పితృ ఋణ విముక్తికి సాధనమైన వివాహము నాడి గృహస్థాశ్రమమున బోధ ఆచరణ ప్రచారములద్వారా, రక్షణ కృషి వాణిజ్యములద్వారా తనకు సహకరించెడి త్రైవర్ణికులకు లోకమునకుఅందచేసి వారికి జ్ఞానోదయం కలిగించవలసిన బాధ్యత బ్రాహ్మణునిపై ఉంది. అట్లు చేయుటవలన తాను ఋషి ఋణము నుండి విముక్తుడై మిగిలిన వర్ణముల వారిని సయితము ఋణ విముక్తులను చేస్తాడు. గృహ యజమాని ఋణ, ఫణములను తీర్చి తనను ఆశ్రయించియున్న వారిని సయితము ఋణ విముక్తులనుగా చేసినట్లు.

2) దేవ ఋణము :- శ్రు॥ యజ్ఞేన దేవేభ్యః॥

ఇది యజ్ఞములద్వారా దేవతలను తృప్తి పరచుటచే తీరుతుంది. భూలోకంలో కంటే ఇతరములైన లోకాలలో

"సర్వే సూక్ష్మ శరీరాస్తే తత్రత్యాస్తు భవంతిహి!
దుర్భిక్షం దేవలోకేషు॥" అనినట్లు

స్థూలశరీర జీవులుగాని, పాడిపంటలుగాని ఉండవు. అందుచేతనే సర్వ ప్రపంచమునకు ఆహార కేంద్రము భూలోకమే. ఇచట నుండియే ఆహారము ఇతర లోకములకు సరఫరా కావాలి.

ఈ విషయాన్నే :-

శ్రు॥ 'అముతః ప్రదానంవా - ఇమే లోకాః'

ఇచట నుండియే ఇతర లోకములకు ఆహారము సరఫరా కావాలి అని వేదమాత బోధిస్తోంది.

అయితే ఈ సరఫరా ఎట్లా చేయాలి ? రైళ్ళమీదనా ? విమానాల మీదనా ? అట్లు కాదు.

శ్లో॥ అగ్నౌ ప్రాస్తాహుతిః - సమ్యక్ - ఆదిత్య ముపతిష్ఠతే।

అగ్నియందు విధిపూర్వకముగా హోమము చేయబడిన "హవిస్సు" ను (విద్యుత్తు) (అగ్నిభేదము) స్థూలమైన శబ్ద-రూపములను గ్రహించి సూక్ష్మముగా మార్చి వైర్లెస్ (నిస్తంత్రీ) టెలివిజను (దూరదర్శిని) ద్వారాతిరిగి చిరునామా దారు గ్రహించుటకు అనువుగా (స్థూలముగా) మార్చి అంద చేయునట్లు.

సూక్ష్మ రూపములో ఉన్న దేవతలకనువుగా సూక్ష్మముగా మార్చి 'సువరిత్యాదిత్యే' అని సూర్యునిగా వ్యవహరింపబడే స్వర్గలోకమునకు చేర్చి వారికి తృప్తిని కలిగించును. తృప్తిని పొందిన వారు సకాలములో వర్షములు కురిపించుట వలన పాడి పంటలు అభివృద్ధి చెంది లోకము సుభిక్షముగా ఉంటుంది. మనుష్య పశు పక్ష్యాదులకు, స్థావరములకు వేటికి కావలసిన ఆహారము వాటికి సమృద్ధిగా దొరకుతుంది. రెండు లోకముల లోని జీవులు ఇట్లు పరస్పర సహకారంతో సుఖంగా జీవిస్తూ ఉంటాయి. దీనినే :-

శ్లో॥ దేవాన్ భావయుత అనేన తేదేవాః భావయంతువః।
పరస్పరం- భావయంతః- శ్రేయః- పరం- అవాప్స్యథ॥

అని గీతాచార్యుడు చెప్పియున్నాడు. అందుచేతనే

శ్లో॥ దుదోహగాం-సయజ్ఞాయ సస్యాయ మఘవాదివం।
సంపద్వినిమయేన - ఉభౌ దధతుః భువనద్వయం ॥

తా॥ దిలీపుడు యజ్ఞముల ద్వారా దేవతలను పోషించుట కును, ఇంద్రుడు వర్షములద్వారా పంటలు పండునట్లు చేసి మానవు లను (భూమిని) పోషించుటకును; దిలీపుడు యజ్ఞములు చేసియు; ఇంద్రుడు వర్షమును కురిపించియు వినిమయ పద్ధతిని రెండు లోకము లను పోషించిరి.

అందుచేత బ్రాహ్మణుడు యజ్ఞములు (దర్శపూర్ణ మాసా దులు) క్రతువులు (అగ్నిష్టోమాదులు) ను సక్రమముగా చేసి దేవత లను తృప్తి పరచియు, తద్వారా కలిగిన సకాలవర్షముచే అభివృద్ధి చెందిన పాడి పంటలద్వారా కృషి వాణిజ్యాదుల ద్వారా తనకు సహకరించు త్రైవర్ణికులకు- ఇతరవిధముగా సహకరించుచున్న ప్రాణి కోటికి ఆహారము సరఫరా చేసి తృప్తి పరచియు, దేవ మనుష్య ఋణముల నుండి విముక్తుడు కావాలి. ఇట్లు తాను ఋణవిముక్తుడై తనను ఆశ్రయించిన త్రైవర్ణికులను కూడా ఋణవిముక్తులను చేస్తాడు.

3) పితృ ఋణము :- శ్రు॥ ప్రజయాపితృభ్యః॥

ఇది మాడపది.

శ్లో॥ ఆయతనం - విద్యానాం - మూలం - ధర్మార్థ -
కామమోక్షానాం।
శ్రేయః - పరం - కిమన్యత్ - శరీర మజరామరం -
విహాయైకం ॥

అనినట్లు ఐహిక - ఆముష్మిక - మోక్షాదులను సాధించు టకు ముఖ్య సాధనము శరీరము. ఇట్టి అమూల్యమైన శరీరాన్ని ప్రసా దించిన తల్లి దండ్రులకు ప్రతి ఒక్కరు ఋణపడి ఉంటారు. కాన సపర్యల ద్వారా ఈ లోకములోను; పితృ కర్మల ద్వారా పర

లోకంలోను తల్లి దండ్రులకు సుఖాన్ని కలిగించియు, పితృకర్మలకు కొరత లేకుండుటకై ఉత్తమ సంతతిని బడసియు, ఈ ఋణము నుండి విముక్తుడు కావాలి.

## శ్రాద్ధ శబ్ద నిర్వచనము:-

శ్రద్ధతో చేయబడు కర్మకు 'శ్రాద్ధము' అని పేరు.

'దుర్భిక్షం - దేవలోకేషు' సర్వే సూక్ష్మ శరీరాస్తే॥

అనినట్లు పాడి పంటలు లేని నరకంలో ఆకలి దప్పికలచే బాధపడే, సూక్ష్మ శరీరాలుకల పితరులకు పితృకర్మలు (షోడశ శ్రాద్ధములు సపిండీకరణములు) ద్వారా ప్రేతత్వమును పోగొట్టి (పరలోకార్హతకై) ఆకలి దప్పికలను తీర్చుటకై ఎక్కువ శ్రద్ధతో వారి మృత దినము నందు చేయబడు కర్మకు 'శ్రాద్ధము' అని పేరు పెట్టారు.

## పితరులకు ఆహార మందజేయు ప్రధానక్రియలు

ఈ లోకంలో మన బంధువునకు ఏదైనా ద్రవ్యము తప్పక చేరాలంటే అతడు ఎచ్చటవున్నది తెలియనపుడు అతను ఉండు ప్రదేశము లన్నిటికి పంపినచో ఏదో ఒకటి తప్పక చేరుతుంది, అదే విధముగా చనిపోయిన జీవుడు సూక్ష్మ శరీరములోస్వర్గ నరక భూలోకములుఅను ఈ మూడిటిని విడిచి వేరొక చోటకు వెళ్ళడు గాన ఈ మూడిటిలోను ఆ జీవుడు

శ్లో॥ పరలోక జుషాం స్వకర్మభిః గతయో
భిన్న పథాహి దేహినాం ॥

అనినట్లు వాని కర్మగతినిబట్టి ఎచ్చట ఏరూపముతో ఉండునది తెలియదుగాన, స్థూలమైన ఈ అన్నమును సూక్ష్మదేహము గల జీవి భుజించుటకనువుగా (అనగా సూక్ష్మముగా) మార్చి ఈ మూడు ప్రదేశములలో గల వారికి అందజేయుటకై :

1) అగ్నౌకరణము 2) బ్రాహ్మణ భోజనము 3) పిండ దానము అను మూడు ప్రధాన క్రియలు ఈ శ్రాద్ధమున చేయబడు చున్నవి.

## అగ్ని (హవ్యవాహనుడు)

తన యందు హోమము చేయబడిన స్థూల పదార్థమును, శక్తి గామార్చి ఈ లోకమునందలి స్థూల జీవులకు పరలోకము నందలి సూక్ష్మదేహ జీవులకు ఎవరికి ఏ రూపములో అందచేయాలో ఆ రూపంలోనే వారికి అందచేయు శక్తిగల "అగ్నిని" సృష్టించాడు ఆత్మ.

మరియు మనము ఎవరిని ఉద్దేశించి హవ్యకవ్యాదులను పంప తలచుకొంటిమో వారి ఉనికి (ఎడ్రస్) తెలియకపోయినను వారి గోత్ర నామాలను సరిగా ఉపయోగించినచో వారు ఈ ముల్లోకముల లోను ఎచ్చట ఉన్నను ఎవరిది వారికి అందచేయగల శక్తి కూడా అగ్నికి ఉంది. కనుకనే

శ్లో॥ నామగోత్రం- పితౄణాంతు- ప్రాపకం హవ్యకవ్యయోః॥

(గోత్ర నామములు హవ్య కవ్యముల నందచేయుటకు ముఖ్య ములు అని చెప్పబడినది)

## అగ్ని భేదములు

ఈ అగ్ని 1) భౌమము (మనము వాడుకొనునిప్పు) 2) దివ్యము (నీటి నుండి పుట్టెడి దండిని చిత్రణి మొదలగు పేర్లు గల పండ్రెండు రకములైన విద్యుత్తులు) 3) ఔదర్యము (తినిన ఆహారమును జీర్ణము చేయు జాఠరాగ్ని) 4) ఆకరజము (గనుల యందుగల బంగారము రేడియము మొదలగు తేజోధాతువులు) అని నాలుగు రకములుగా విభజింపబడినది.

ఈ అగ్నికి అనేక శక్తులు చెప్పబడ్డాయి. కాని 'బలమిత్ర విద్యుత్' అని అగ్నుల అన్నిటిలోను శ్రేష్టమైనదిగా చెప్పబడిన విద్యుత్తు నుండి స్థూలమైన శబ్దాదులను శక్తిగామార్చి తిరిగి స్థూలముగా మార్చి దేశాంతరగతులకు అందచేయుట, ఎవరిని ఉద్దేశించి పంపుదుమో వారు ఎచ్చట ఉన్నను వారికే అందచేయుట; అను కొన్ని శక్తులను మాత్రమే ప్రస్తుతము ఉపయోగించుకొన గలుగు చున్నారు. వీటికి నిదర్శనము మననుండి గ్రహించిన శబ్దరూపములను మైక్రోఫోను ద్వారా శక్తిగా మార్చి తిరిగి రిసీవరు ద్వారా స్థూల రూపములో దేశాంతరగతులకు అందచేయు "టెలివిజన్" "వైర్లెస్" "టెలిప్రింటరు" మొదలగునవి. మరియు బంగారమును సూక్ష్మముగా మార్చి దేనికి అంద చేయవలెనో దానికే (అనగా "గిల్ట్" వేయు వస్తువునకే అందజేయు); గిలుటు (గోల్డుప్లేటింగ్) మొదలగునవియే నిదర్శనములు.

## పరలోక గతులకు ఆహారము అందచేయుక్రియలు

పరలోక గతులకు ఆహారమందజేయుటకై 1) బ్రాహ్మణ భోజనము 2) పిండదానము 3) అగ్నౌకరణము అని మూడు ప్రధాన క్రియలు చెప్పబడ్డాయి.

1) బ్రాహ్మణ భోజనము:- దీనివలన ఆవాహన చేయబడిన పితరులుగల బ్రాహ్మణుల జాఠరాగ్ని యందు భోజన రూపమున హోమము చేయబడిన "కవ్యాన్నము" పితరులు ఈ లోకమున ఏ రూపమున ఉండిరో వారికి తగిన ఆహారముగా మార్చబడి అంద చేయబడుతుంది.

2) పిండోదకములు:- దీనివలన చంద్రలోకము (భువర్లోకము) నందలి పితృలోకమునగాని యమలోకమున గాని; ఉన్న పితరులకు వారికి తగిన ఆహారముగా మార్చబడి అంద చేయబడుతుంది.

3) అగ్నౌకరణము:- దీని వలన దేవత్వమును పొంది స్వర్గమునందు ఉండిన పితరులకు అగ్ని యందు హోమము చేయ బడిన "కవ్యము" అమృతముగా మార్చబడి అందచేయబడుతుంది.

ఈ విషయాన్నే :-

శ్లో॥ యథా గోషు ప్రణష్టోవై - వత్సో విందతి మాతరం।
ఏవం శ్రాద్ధేన్నం ఉద్దిష్టం మంత్రః ప్రాపయతే పితౄన్।
నామ గోత్రం పితౄణాంతు ప్రాపకం హవ్యకవ్యయోః।
నామ గోత్రాః యథా ఆదేశాః భవాంతర గతానపి।
ప్రాణినః ప్రీణయంతి ఏతే తథాకారత్వం ఆగతాన్।
దేవోయది పితాజాతః శుభకర్మానుయోగతః।
తస్యాన్నం అమృతం భూత్వా దేవత్వే ప్యుపతిష్ఠతి।
దేవత్వే భోగ్యరూపేణ పశుత్వేతు తృణం భవేత్।
శ్రాద్ధాన్నం వాయురూపేణ నాగత్వేపి ఉపతిష్ఠతి॥
పానం భవతి యక్షత్వే గృధ్రత్వేచ తథామిషం।
దనుజత్వే తథా మాంసం ప్రేతత్వే రుధిరోదకం।
మానుషత్వే అన్నపానాది నానాభోగకరః తథా॥ మ. పు.

తా॥ గోవుల మధ్యనుండి తప్పిపోయిన దూడ తిరిగి తన తల్లినే ఎట్లు పొందగలదో అట్లే పితరులకై నిర్దేశింపబడిన అన్నము మంత్రముచే, పితరులు ఏ లోకములో ఏ రూపములో ఉన్నను వారికి తగిన ఆహారముగా మార్చబడి అందచేయ బడును.

శ్రాద్ధాన్నము:-

పుణ్యావశముచే తండ్రి దేవతగా మారిన "అమృతముగను" పశువుగా అయిన "గడ్డిగను" సర్పజన్మ ఎత్తిన "వాయువుగను" యక్షుడుగా జన్మించిన "సురగను", గ్రద్దగా జన్మించిన "మాంసము గను", రాక్షసజన్మ మెత్తిన "మాంసముగను", ప్రేతరూపమున నే ఉండిన "రుధిరోదకముగను", మానవుడుగా జన్మించిన అన్నము-

పానము - మొదలగు వివిధ భోగపదార్థములుగను మారి పితరులకు తృప్తిని కలిగించును. అని వివరింప బడినది.

-: అగ్ని మహిమను తెల్పు మంత్రములు :-

పితరులు ఏ రూపంలో, ఏ లోకంలో ఉన్నను "అగ్ని వనస్పతి సహాయముతో; 'స్వధా - స్వాహా' శక్తులద్వారా పితరులకు దేవతలకు ఆహారాన్ని అందచేయ గలదు" అను విషయాన్ని ఈ శ్రుతులు బోధిస్తున్నాయి."

శ్రు॥ యత్రవేత్థ - వనస్పతే! దేవానాం - గుహ్యానామాని।
తత్ర - హవ్యాని - గామయ స్వాహా॥
యేచేహ - పితరః - యేచ - న - ఇహ - అయాగ్‌ంశ్చ।
విద్మయాగ్‌ం - ఉచ - న ప్రవిద్మ అగ్నే! తాన్ వేత్థ
యదితే, జాతవేదః స్వధాభిః - యజ్ఞగ్‌ం - సుకృతం -
జుషస్వ॥

తా॥ ఓ వనస్పతి! దేవతలయొక్క రహస్యమైన (గుర్తింప వీలులేని) చిరునామాలు (ఎడ్రస్‌లు) ఏవి కలవో, వాటిని తెలిసిన నీవు ఈ హవ్యములను వారికి అందచేయుము.

ఓ అగ్ని! ఈ యజ్ఞమునకై ఇచ్చటకు వచ్చియున్నవారు; రానివారు; తెలిసియున్నవారు; తెలియని వారు అగు పితరులు ఎవరైతే కలరో వారందరికి ఈ కవ్యమును అందచేసి తృప్తులను గావించి పుణ్యమును కట్టుకొనుము. అని బోధిస్తోంది మంత్రము.

## శ్రాద్ధమున ఇతరులకుగూడా ఆహార దానము

శ్లో॥ అసంస్కృత - ప్రమీతాయే, త్యాగిన్యః - యాః -
కులస్త్రియః।
దాస్యామి - తేభ్యో - వికిరం - అన్నం - తాభ్యశ్చ -
పైతృకం॥

అసోమపాశ్చ - యే దేవాః యజ్ఞ భాగ వివర్జితాః ।
తేషాం అన్నం ప్రదాస్యామి వికిరం వైశ్వ దైవికం॥

శ్రు॥ యే - అగ్నిదగ్ధాః - యే అనగ్నిదగ్ధాః - యేవాజాతాః కులే మమ। భూమౌ - దత్తేన - పిండేన - తృప్తాయాంతు పరాంగతిం। అగ్నిదగ్ధేభ్యః - అనగ్ని - దగ్ధేభ్యః అస్మత్ కులప్రసూత - మృతేభ్యః అయం వికిర పిండః ఉపతిష్ఠతు॥

తా॥ ఉపనయనాది సంస్కారములులేక మృతిచెందిన వారికి; చెడునడతను పట్టి, విడవబడిన స్త్రీలకు పితృ శేషాన్నమును; సోమ పానార్హతను కోల్పోవుటచే యజ్ఞభాగములేని దేవతలకు; వైశ్వదేవా న్నమును; వికిరమను పేరుతోను;

మరియు జల, అగ్ని, విష శస్త్రాదులచే దుర్మరణము చెందిన వారికి; జాతకర్మాది సంస్కారములు లేక పసిపాపలుగ మృతిచెంది ఆకలి దప్పికలచే బాధపడువారికి సయితము "వికిరపిండము" ద్వారా ఆహారము సరఫరా చేయబడుతుంది.

ఇంతియేకాదు :-

శ్లో॥ యజమాన కులేజాతాః దాసాః దాస్యః అన్నకాంక్షిణః
తే సర్వే తృప్తిం ఆయాంతుమయాదత్తేన భూతలే॥

తా॥ యజమాని (శ్రాద్ధకర్త) యొక్క వంశమున వారిని ఆశ్రయించి బ్రతికెడి దాస-దాసీ జనులకు సయితము బ్రాహ్మణ ఉచ్ఛిష్టాన్నముద్వారా ఆహారము సరఫరా చేయబడుతుంది.

-: కారుణ్యములు :-

మరియు పాడిపంటలుగల ఈ లోకంలో ఒకరికి-ఒకరు సహాక రించుటకు అవకాశం ఉంది. పాడిపంటలు లేని పరలోకంలో అట్టి అవకాశం లేనందున పరలోకగతులైన వారికి సయితము ఆహారం ఈ లోకము నుండియే సరఫరా కావాలి.

"జగదేవ కుటుంబకం" జగత్తునే కుటుంబముగా భావించిన ఋషులు ఈ లోకంలో-

"శ్లో॥ అవృత్తి - వ్యాధి - శోకార్తాన్ - అనువర్తేత శక్తితః॥

జీవనమార్గము లేకయు, వ్యాధుల చేతను - కష్టములతోను దుఃఖించెడి వారికి యధాశక్తిగా సహాకరింప వలసినది అని బోధించుటచే ఈ లోకంలో మనము వివాహాది కార్యములయందు మనతో పాటు బంధు - మిత్ర - దాస - దాసీజనులను కూడా ఆహ్వానించి ఎట్లు తృప్తులను చేయుచుంటిమో అట్లే ఈ జన్మమునందుగాని మరి ఏ జన్మయందుగాని మనకు బంధు - మిత్ర - దాస-దాసీ రూపకమగు సంబంధము కలిగియుండి సంస్కారహీనులై, దుర్మరణాదుల చేత మృతినొంది ప్రేతలుగా వుండి, ఆకలి - దప్పికలచే బాధనొందెడి జీవులకు సయితము, ఆకలి-దప్పికలను తీర్చి ముక్తులను కావించుటకై గయాది పుణ్యక్షేత్రముల యందు; మహాలయము, సంక్రాంతి మొదలగు పుణ్యకాలములయందు, మన పితరులతో పాటు వారికినీ "కారుణ్యము" అను పేరట, పిండోదకములను ఈయవలసినదిగా ఋషులు శాసించియుండిరి— కరుణతో ఈయబడుటచే వీటికి కారుణ్యములు అని పేరిడిరి.

ఎట్లనగా :-

శ్లో॥ అస్మత్కులే మృతా యేచ గతిర్యేషాం నవిద్యతే।
ఆవాహయిష్యే తాన్ సర్వాన్ దర్భపృష్ఠే తిలోదకైః॥
పితృవంశే మృతా యేచ - మాతృవంశేచ యే మృతాః।
మాతామహ కులేయేచ గతిర్యేషాం నవిద్యతే।
తేషాం ఉద్ధరణార్థాయ ఇమం పిండం దదామ్యహం।
అజాత దంతా యేకేచిత్ యేచగర్భే ప్రపీడితాః।
బంధువర్గాశ్చ యేకేచిత్ నామగోత్ర వివర్జితాః।

స్వగోత్రే - పరగోత్రే వా గతిర్యేషాం నవిద్యతే।
తేషాముద్ధరణార్థాయ ఇమం పిండం దదామ్యహం।
ఉద్బంధన మృతాయేచ - విషశస్త్ర - హతాశ్చయే।
ఆత్మోపఘాతినో యేచ తేభ్యః పిండం దదామ్యహం।
అగ్నిదాహే మృతాయేచ సింహవ్యాఘ్ర హతాశ్చయే।
దంష్ట్రిభిః శృంగిభిర్వాపి తేషాం పిండం దదామ్యహం।
అగ్ని దగ్ధాశ్చ యేకచిత్ నాగ్నిదగ్ధాస్తథాపరే।
విద్యుతాచ హతాయేచ తేభ్యః పిండం దదామ్యహం।
రౌరవే చాంధతామిస్రే కాలసూత్రేచయే గతాః।
అసి పత్రవనే ఘోరే కుంభీపాకేచయే గతాః।
అన్యేషాం యాతనాస్థానాం ప్రేతలోక నివాసినాం।
తేషాముద్ధరణార్థాయ ఇమం పిండం దదామ్యహం !
పశుయోనింగతాఃయేచ పక్షి - కీట - సరీసృపాః।
అథవా వృక్షయోనిస్థాః తేభ్యః పిండం దదామ్యహం॥
అసంఖ్య యాతనా సంస్థాః యేనీతాః యమశాసనైః।
తేషాముద్ధరణార్థాయ ఇమం పిండం దదామ్యహం।
జాత్యంతర సహస్రేషు భ్రమంతి స్వేనకర్మణా।
మానుష్యం దుర్లభం యేషాం తేభ్యః పిండం దదామ్యహం।
యేబాంధవాః అబాంధవావా యేన్య జన్మని బాంధవాః।
తేసర్వే తృప్తిమాయాంతు పిండదానేన సర్వదా॥
యేకేచిత్ ప్రేతరూపేణ వర్తంతే పితరో మమ।
తేసర్వే తృప్తిం అయాంతు పిండదానేన సర్వదా॥
యేమే పితృకులే జాతాః కులేమాతుః తథైవచ।
గురు - శ్వశుర-బంధూనాం యేచాన్యే బాంధవామృతాః॥
యేమేకులే లుప్తపిండాః పుత్రదార వివర్జితాః।
క్రియాలోప హతాయేచ జాత్యంధాః పంగవస్తథా।
విరూపాః ఆమ గర్భాశ్చ జ్ఞాతాః అజ్ఞాతాః కులేమమ।
తేషాం పిండం మయాదత్తం అక్షయ్య ముపతిష్ఠతు॥
(గరుడ పు. పూర్వఖండం - 85 అధ్యాయం)

తా॥ పితృ - మాతృ కులములయందు, మాతామహకులము నందు మరియు ఇతర కులములయందు మృతినొంది ఉత్తరగతులు లేక ఆకలిదప్పికలచే పీడింపబడెడి వారికి పిండోదకముల నిచ్చి తరింప చేయుటకై ఈ దర్భలపై ఆవాహన చేయుచుంటిని.

నా గోత్రమునగాని బంధు మిత్రుల గోత్రమునగాని దంత ములు రాకముందే మృతినొందిన వారికి; గర్భమునందె మృతినొందిన వారికి; "హవ్య-కవ్యములను అందచేయుటకు ముఖ్యములైన" నామ గోత్రములు తెలియనట్టివారికి, ఆకలి దప్పికలనుతీర్చి ఉద్ధరించుటకై ఈపిండమును ఇచ్చుచుంటిని.

ఉరికంబము వలన శస్త్రాస్త్రముల వలన ఆత్మహత్య వలన- మృతిచెందిన వారికి; ఇండ్లు కాలినపుడు మృతిచెందిన వారికి; సింహ వ్యాఘ్రాది మృగములచేతను, కోరలు కొమ్ములుకల జంతువులచేతను మృతినొందిన వారికి; జల- అగ్ని- విద్యుదాదులచేత మృతి నొందిన వారికి శ్రాద్ధాది కర్మలు లేకుండుటచే ప్రేతలుగానుండి వెత జెందెడి వారిని ఉద్ధరించుటకై ఈపిండమును ఇచ్చుచుంటిని.

రౌరవ, అంధతామిస్ర-కాలసూత్ర- అసిపత్ర- కుంభీపాకాది నరకములయందు యమ యాతనలను అనుభవించెడివారిని ఉద్ధరించు టకై ఈపిండమునుఇచ్చుచుంటిని.

వారి వారి కర్మఫలము ననుసరించి తరు పాషాణ క్రిమి కీట పశు పక్ష్యాది యోనుల యందు పుట్టుచు మానవ జన్మను పొంద జాలక దుఃఖించెడివారు; ఉత్తమమైన మానవజన్మనంది ముక్తిని పొందుటకై ఈపిండమును ఇచ్చుచుంటిని.

యముని శాసనము ప్రకారము అనేక యాతనల ననుభవిం చుచు భుక్తి ముక్తుల నిచ్చెడి ఉత్తమమైన మానవజన్మ నెత్తుటకు అవకాశములేక అనేకములగు తరు పాషాణాది జన్మలనెత్తుచు, చచ్చు

చుండెడివారు ఉత్తమమైన మానవజన్మను పొంది ముక్తిని పొందుటకై ఈ పిండమును ఇచ్చుచుంటిని.

పూర్వజన్మమునకాని, ఈజన్మమునకాని మరియే జన్మమునందైననుగాని నాకు బంధు మిత్రాది రూపకముగు సంబంధము కలిగి వారి వారి కర్మలకు తగిన ఫలముల ననుభవించుచు బాధపడెడివారిని ఉద్ధరించుటకై ఈ పిండమును ఇచ్చుచుంటిని

నా తల్లి తండ్రులయొక్క - గురువు - మామగారు - బంధువులు మొదలగు వారియొక్క వంశమున జనించియు; పిండోదకముల నిచ్చు పుత్ర కళత్రాదులు లేకుండుటచే శ్రాద్ధాది కర్మలు లేక బాధనొందెడి వారిని; ప్రేత కర్మలు సక్రమముగా చేయబడకుండుటచేత ప్రేతరూపముననే ఉండి బాధ నొందెడివారిని; పుట్టు గ్రుడ్డి కుంటి వికలాంగములు కలిగి మృతిచెందిన వారిని, గర్భస్రావ రూపకముగా మృతిచెందినవారిని ఇంకను నాకు తెలిసియు తెలియకయు మృతిచెంది యాతనల ననుభవించెడివారిని ఉద్ధరించుటకై ఈ పిండమును ఇచ్చుచుంటిని.

ఈ విధముగా పరలోక గతులయిన అనేక జీవులకు శ్రాద్ధము నందు ఆహారము నొసగి తృప్తులను చేయవలసిన బాధ్యత ప్రతి ఒక్కరికి ఉండుటచేత అనేకులకు తృప్తినికలిగించెడి ఈ శ్రాద్ధకర్మను ప్రతిఒక్కరు తప్పక చేయవలసి యున్నది.

ఈ కర్మవలన తృప్తినొందిన పితరులు శ్రాద్ధకర్తను దీవింతురు. కనుకనే

శ్లో॥ శ్రాద్ధకృత్ సర్వమాప్నోతి యశశ్చ విపులం శ్రియః।

అని చెప్పినట్లు శ్రాద్ధకర్త సర్వ శ్రేయస్సులను పొందును.

ఈ శ్రాద్ధకర్మవలన మానవుడు పితరులకు ఆకలి దప్పికలను మాత్రమే తీర్చి పితృ ఋణమునుండి కొంతవరకే విముక్తుడగును.

పితృ ఋణమునుండి పూర్తిగా విముక్తుడు కావాలంటే ఐహిక - ఆముష్మిక సుఖ సంపదలకు ప్రధాన కారణమైన ఉత్తమ సంతానమును బడయుట ఎంతయు అవసరము.

## సంతానము - పితృఋణ విముక్తి

శ్లో॥ సంతతిః శుద్ధ వంశ్యాహి - పరత్రేహచ శర్మణే॥

అనినట్లు తనకు - పితరులకు కూడా ఇహ పర సుఖ సంపదలకు మూలకారణమైన ఉత్తమ సంతానమును బడసినకాని "పితృ ఋణము"నుండి పూర్తిగా విముక్తి చెందడు. కనుకనే

శ్రు॥ ప్రజననం వై-ప్రతిష్ఠా; సాధుప్రజాయాః తంతుం
తన్వానాః; పితౄణాం-అనృణో భవతి॥
తదేవ తస్యా - అనృణం॥

తా॥ సంతానవంతు డయినపుడే మానవుడు పితృఋణము నుండి పూర్తిగా విముక్తుడగుతాడు.

శ్రు॥ ప్రజామను ప్రజాయసే - తదుతే మర్త్యా అమృతం॥

తా॥ మరణ స్వభావముగల మానవుడా! "ఆత్మావై పుత్ర నామాసి" అనినట్లు సంతాన రూపమున తిరిగి నీవు పుట్టుట యేది కలదో అదే నీకు "అమృతత్వము" అనగా పుత్రరూపమున చిరంజీవియై యుంటివని భావము.

అట్లు చిరంజీవి యగుటవలన స్వర్గలోక ప్రాప్తికి హేతువైన శాశ్వతముయిన పేరుకలవాడ వగుదువు. కాన సంతానవంతు డగుట ఎంతయు అవసరము అని శ్రుతి బోధిస్తోంది. సంతానము కావాలంటే స్త్రీని వివాహమాడి తీరాలి.

## వివాహ ప్రాధాన్యము

తాను సంతానవంతుడు అగుట వలన (పుత్రుడుకలవాడగుట వలన) ప్రేతత్వము పోయి వస్వాది స్థానములను పొందుటకు తగిన అర్హత ఏర్పడుతుంది. పిమ్మట కుమారుడు "షోడశ శ్రాద్ధములను" పెట్టినచో వసుస్థానమును పొందుతాడు. కుమారుడు:-

శ్లో॥ యస్యైతాని నదత్తాని ప్రేతకర్మాణి షోడశ। పిశాచత్వ
స్థిరం తస్య దత్తైః శ్రాద్ధశతైరపి॥

అనినట్లు - షోడశ శ్రాద్ధములు పెట్టనిచో ప్రేతత్వము పోదు. దేవగణములో చేరుటకు అర్హత ఉండదు. తాన పితరులకు ఉత్తర గతులను కలిగించి ముక్తులను చేయాలంటే కుమారుడు పితృకర్మలను తప్పక చేయాలి. (పండ్రెండు మాసికములు, ఊనమాసిక - త్రైపక్షిక - ఊనషాణ్మాసిక - ఊనాబ్దికములు కలసి - షోడశ శ్రాద్ధములనబడును.)

కుమారుడు షోడశ శ్రాద్ధములను పెట్టుటచే ప్రేతత్వము పోయి వసు స్థానంలో చేరుతాడు తాను. వసు స్థానములోని (వసు గణములోని) తన తండ్రి 'రుద్ర స్థానము'నకు; రుద్రస్థానమునందలి తాత 'ఆదిత్య స్థానము'నకు; ఆదిత్య స్థానము నందలి ముత్తాత

శ్లో॥ పుత్రేణ లోకాన్ జయతి పౌత్రేణ ఆనంత్య మశ్నుతే।
అథ పుత్రస్య పౌత్రేణ బ్రహ్మలోకే మహీయతే॥

అనినట్లు బ్రహ్మలోకానికి "ట్రాన్సుఫర్" అవుతారు.

పనకు ఇద్దరు కుమారులు ఉన్నపుడు జ్యేష్ఠుడైన (సీనియర్ అయిన) కుమారుడు మరణించి వసువుగా వచ్చినపుడే తనను వసు స్థానము నుండి "రిలీవు" చేయుటకును తాను తనతండ్రిని; తనతండ్రి తాతను: తాత - ముత్తాతను "రిలీవు" చేసి పై స్థానములకు (రుద్ర- ఆదిత్య - బ్రహ్మస్థానములకు) పంపుటకు అవకాశముంటుంది.

'జూనియర్ అయిన' చిన్నకుమారుడు ముందుగా మరణించి నచో వాని పుత్రుడు (అనగ తన పౌత్రుడు) పెట్టు తద్దినము తనను "రుద్రస్థానమున" ఉచ్చరించుటకు మాత్రమే అర్హత తప్ప (అనగా "ఆక్టింగ్"గా వ్యవహరించటమే తప్ప) స్థిరముగా "వసుస్థానమును" వీడి "రుద్ర స్థానమునకు" వెళ్ళే అర్హత ఉండదు. తాన 'సీనియర్' అయిన పెద్ద కుమారుడు వచ్చి 'రిలీవ్' చేసేవరకు తాను చిన్న కుమారునితో గూడి వసు లోకములోనే ఆక్టింగ్‌గా ఉంటాడు. మిగిలిన వారును వారి వారి స్థానాల్లోనే ఉంటారు - 'రిలీవ్' చేసే వాడు వచ్చేవరకు.

తాను బ్రతికిఉండి; తండ్రి చనిపోయినచో తండ్రి వసుస్థానము లోను, తాత రుద్ర స్థానములోను; ముత్తాత ఆదిత్య స్థానములోను ఉంటారు. తాను మృతినొంది తండ్రి బ్రతికిఉన్నచో ఖాళీగాఉన్న తండ్రి యొక్క వసు స్థానములో తాను చేరుతాడు. తాత-ముత్తాతలు వారిని 'రిలీవ్' చేయువారు ఎవరూ రానందున వారు "రుద్ర, ఆదిత్య స్థానాల్లోనే" ఉంటారు. తండ్రి మరణించి రాగానే రుద్ర స్థానంలో చేరుటచే రుద్ర స్థానములోని తాత "ఆదిత్య" స్థానమును; ఆదిత్య స్థానమందలి ముత్తాత బ్రహ్మ లోకాన్ని పొందుతారు.

కనుకనే :-

శ్లో॥ వ్యుత్క్రమాచ్చ మృతానాంచ నైవకార్యా సపిండతా।
పితుః సనామ సంకీర్త్య కీర్తయే త్ప్రపితామహం॥ (మనువు)
(యాజ్ఞ. ఆ. కా. 25 శ్లోకములో)

తా॥ వ్యుత్క్రమ మరణమున (తండ్రి ఉండగా కుమారుడు చనిపోయినచో) సాపిండ్యము చేయరాదు. తండ్రి పేరును ఉచ్చరించి ప్రపితామహుని తలవవలెను. కొడుకు మరణించి తండ్రి బ్రతికివున్నపుడు 'వసు' స్థానమున కొడుకును; 'రుద్ర' స్థానమున తాతను; 'ఆదిత్య' స్థానమున ముత్తాతను చెప్పవలెను.

సంతతి లేనిచో తమను 'రిలీవ్' చేయువారు లేనందున ఎచ్చటి వారు అచ్చటనే ఉండిపోతారు. వారికి ఉత్తరగతులు (పై స్థానములకు వెళ్ళు అర్హత) ఉండదు. కనుకనే "అపుత్రస్య గతిః నాస్తి" అని చెప్పబడినది.

అయితే ఈ పుత్రసంతతి ఎట్లు కలుగుతుంది?

అపత్యార్థం స్త్రియః సృష్టాః॥ సంతానము బడయుటకై స్త్రీలు సృష్టింపబడ్డారు. అని చెప్పుటచే "స్త్రీ" వల్ల సంతానము కలుగును కాన "సలక్షణ్యాః స్త్రియ ముద్వహేత్" ఉత్తమసంతానమునకై మంచి లక్షణములుగల స్త్రీని వివాహ మాడవలెను. విధిపూర్వకముగ - ఇది అంతయు దృష్టియందు ఉంచుకొనే "ప్రజాతంతుం - మా - వ్యవచ్ఛేత్సీః॥ సంతానమునకు అంతరాయము (నిరోధము) కలుగునట్లు ప్రవర్తింపకుము" అని శాసించినది వేదమాత. ఈ విషయాన్ని దృష్టియందుంచుకొనియే :

అవిప్లుత బ్రహ్మచర్యః - లక్షణ్యాం స్త్రియముద్వహేత్॥
అని బలపరచారు మన్వాదులు.

## షడ్గ్రత్రయమును మాత్రమే చెప్పుటకు హేతువు

శ్లో॥ శీతార్తః క్షుధితః సోపి వీక్షతేహి దిశోదశ।
అస్తిమే బాంధవః కోపి యో మే దుఃఖం వ్యపోహతి॥
(గరుడ పు.)

ప్రేత లోకేతు వసతి నృణాం వర్షం ప్రకీర్తితా॥
క్షుత్తృష్ణే ప్రత్యహం తత్ర భవేతాం భృగునందన॥
(యాజ్ఞవల్క్య - పు.)

తా॥ మృతిజెందిన మానవులు ఆకలి-దప్పికలచే బాధనొందుచు ఈ ఆకలి - దప్పికల వలన కల్గెడి బాధను పిండోదకముల ద్వారా

పోగొట్టి మాకు సుఖమును కలిగించెడి బంధువులు ఎవరేనా కలరా? అని దిక్కులు చూచుచు ప్రేతలోకములో నివసించు చుందురు - అని చెప్పబడి యుండినది.

కాన అట్టివారి ప్రేతత్వమును తొలగించి ఆకలి, దప్పికలను తీర్చుటకే ఈ పిండోదకములు ఏర్పాటు చేయబడ్డాయి. పితరులు వసు-రుద్ర-ఆదిత్య రూపములతో, వసు, రుద్ర, ఆదిత్య లోకములలో ఉన్నంతవరకే వారికి ఆకలి-దప్పికల బాధలు ఉంటాయి. బ్రహ్మ లోకమునకు వెళ్ళిన పిమ్మట ఆకలి-దప్పికల బాధ ఉండదు. కనుకనే వర్గత్రయము (అనగా తండ్రి - తాత - ముత్తాత) వరకే తీసుకొని పిండోదకములు ఏర్పాటు చేశారు. ఆ పైవారు బ్రహ్మలోకమును పొందుదురు గాన వారికి పిండోదకములతో పని లేదు.

ఈ విషయమునే :

శ్లో॥ పుత్రేణ లోకాన్ జయతి పౌత్రేణ ఆనంత్య మశ్నుతే।
పుత్రస్యతు ప్రపౌత్రేణ బ్రహ్మలోకే మహీయతే॥

అని మన్వాదులు చెప్పి యున్నారు.

## గోత్ర-నామముల ప్రాముఖ్యత

లోకంలో పలురకముల పేర్లు కలవారు ఒకే పదవిలో ఉంటారు. మనము ఒక "వస్తువును, ఎవరికి పంపతలచామో వారి పదవీనామముతో పాటు వారిస్వంత నామము (పరసనల్ ఎడ్రస్)ను కూడా వ్రాసినచో వారు పంపినచోటున లేక వేరే చోటునకు వేరే ఉద్యోగముపై వెళ్ళినను, అచ్చటకు తీసుకువెళ్ళి అందచేయ బడుతుంది. లేనిచో అందనేరదు. అలాగుననే వసు - రుద్ర - ఆదిత్య స్థానములలోగల యజ్ఞదత్త, దేవదత్తాదులలో ఎవరిని ఉద్దేశించి పిండోదకములు ఏర్పడుచున్నవో, వారి నామ-గోత్రములను కూడా పదవీ నామములైన వసు - రుద్ర - ఆదిత్యాది నామములతో చేర్చి

B.W.S.S. MANI
MADRAS 600028

ఉచ్చరించినపుడే ఆ పిండోదకములు వారి వసు-రుద్ర-ఆదిత్యాది స్థానములను వీడి ఈ ముల్లోకములలోను ఏ రూపములలో ఉన్ననూ కూడా అందచేయ బడుతాయి. లేనిచో అవి చేరనేరవు. ఈ విషయమునే:-

శ్లో॥ దేవోయది పితా జాతః శుభకర్మానుసారతః।
తదన్నం అమృతం భూత్వా దేవత్వే వ్యపతిష్ఠతి॥
నామ గోత్రం పితౄణాంతు ప్రాపకం హవ్యకవ్యయోః।
నామ మంత్రాః తథా ఆదేశాః భవాంతర గతానపి।
ప్రాణినః ప్రీణయంత్యేతే తథాకారత్వ మాగతాన్॥

తా. పుణ్యకర్మను బట్టి తండ్రి దేవత్వమును పొందినచో శ్రాద్ధాన్నము అమృతముగామారి అతనికి ఆహారముగాఅయి తృప్తిని కలిగించును. నామము-గోత్రము ఈ రెండు దేవతలకు, పితరులకు హవ్యకవ్యములను అందచేయుటకు ఎంతయు ఉపకరించును. పితరుల యొక్క నామ గోత్రములు; వారిని ఉద్దేశించి చెప్పబడు శబ్దములు; మంత్రములు; మృతిచెందినవారు ఏ రూపములో-ఏ జన్మలోఉన్నను ఆ యా జన్మల నెత్తినవారికి తగిన ఆహారముగా మార్చి అందచేయుచు, తృప్తులను కావించును అని చెప్పబడుటచే పితరులయొక్క పదవీనామములైన వసు-రుద్ర-ఆదిత్య స్థానములతో పాటు వారి గోత్ర నామములను కూడా నిర్దుష్టముగా ఉచ్చరించుట ఎంతయు అవసరము.

ఈ ప్రకారము శ్రాద్ధాదుల ద్వారా ఆకలి - దప్పికలను తీర్చియు; సంతానము ద్వారా ఉత్తర గతులను కలిగించియు, పితౄ ఋణమునుండి విముక్తుడు కావాలి.

## పిండోదకములకై పితరుల నిరీక్షణ

శ్లో॥ శీతార్తః క్షుధితః స్తోపి వీక్షతేహి దిశో దశ।
అస్తిమే బాంధవః కోపి యోమే దుఃఖం వ్యపోహతి।

కింకరాః తంవదంత్యేవంక్వతేపుణ్యాంహి తాదృశం।
విధినా దదతే పుత్రః పిత్రే తదుపతిష్ఠతి ॥
ఆత్మావై పుత్రనామాసి పుత్రః త్రాతాయమాలయే।
నరకాత్ పితరం త్రాయేత్ తేన పుత్రఇతీరితః।
విచరంత్య శరీరా స్తే క్షుత్పిపాసార్దితా భృశం।
కలౌ ప్రేతత్వం ఆప్నోతి తార్క్ష్య! అశుద్ధక్రియాపరః।
కృతాదౌ ద్వాపరం యావత్ న ప్రేతః నైవ పిండనం॥

తా॥ శీత వాతాదుల చేతను, ఆకలి దప్పికలచేతను పీడింపబడుచు జీవుడు "ఈ దుఃఖమును పోగొట్టు బంధువులు ఎవరైనా కలరా" అని విచారముతో దిక్కులు చూచుచుండ, యమభటులు వానిని గాంచి "అట్టి అదృష్టము నీకు ఎక్కడిది?" అని పలుకుదురు.

కుమారుడు యథావిధిగా పెట్టిన శ్రాద్ధాన్నము తండ్రికి చేరును. కుమారుడనగా తన ప్రతిబింబమె. నరకమునుండి తరింపచేయుటచే "పుత్రుడు" అను పేరు సార్థకమైనది.

శ్రాద్ధాది కర్మలులేని జీవులు ఆకలి దప్పికలచే బాధపడుచు అశరీరులై (సూక్ష్మదేహముతో) వాయురూపమున తిరుగుచుందురు.

అపవిత్రమైన కర్మలను చేయుచుండుటచే కలియుగమునందు జీవులకు "ప్రేతత్వము" కలుగును. కృతయుగము మొదలు ద్వాపరయుగము వరకు ప్రేతత్వము లేకుండుటచేత ప్రేతత్వమును పోగొట్టెడి "షోడశ శ్రాద్ధములతో" వారికి పనిలేదు. ప్రేతత్వ నివృత్తికై షోడశ శ్రాద్ధములు చేయుట కలియుగమున ఎంతయు అవసరము. అవి చేయనిచో పిశాచముగా ఉండిపోవుదురు.

## సూక్ష్మ దేహము

లోకంలో:- "భస్మీ భూతస్య దేహస్య పునరాగమనం కుతః"

భస్మమైన దేహము తిరిగి పుట్టుననుట లోకవిరుద్ధము-నమ్మరా

నిది అని కొందరు; స్థూలదేహము పోయినను సూక్ష్మదేహముతో జీవుడను పేరుతో ఉండునని కొందరు పలుకుచుందురు.

ఈ విషయాన్నే యమునియింటికి అతిథిగా చనిన నాచికేతుడు "యోయం ప్రేతే విచికిత్సా మనుష్యే అస్తీత్యేకే నాయమస్తీతిచైకే"

ఓ యమధర్మరాజా! మనుజుడు మృతినొందిన పిమ్మట శరీరమును వీడి "జీవుడనువాడు" ఉండునని కొందరు; ఏమియు మిగులదని కొందరు పలుకుచుందురు. దీని యదార్థమును గూర్చి బోధింపుమని ప్రార్థింపగా:

"దేవైరత్రాపి విచికిత్సితం పురా నహిసువిజ్ఞేయం అణురేష ధర్మః"

ఓ నచికేతా! ఈ విషయమై పూర్వము దేవతలు సహితము చర్చించి యుండిరి. ఇది మిక్కిలి సూక్ష్మమైనది.

"నచస్త సంధయాబుద్ధిః గంభీరంగా హతే వచః"

అనినట్లు పసిబాలురయొక్క బుద్ధి ఇట్టి గంభీరమైన విషయములను గ్రహింప నేరదుగదా!

"బాలః సుఖేధితో గేహే నత్వం కించన బుధ్యసే" ఆకుచాటు పిందెవలె తల్లిదండ్రుల చాటున సుఖముగా పెరిగిన నీకు ఏ విషయమును తెలియదు" అని సుధన్వుడనినట్లు బాలుడవైన నీకు ఈ విషయమును గ్రహించుట కష్టసాధ్యము. కాన వేరొక విషయమునుగూర్చి అడుగుమని యముడు వచింపగా; తిరిగి

"త్వదన్యః సంశయస్యాస్య ఛేత్తా నహ్యుపపద్యతే"

ఓ యమధర్మరాజా! ఈ సంశయమునుతీర్ప నీవుతప్ప వేరొకడు సమర్థుడు కాడు. కనుక నా సందేహమును తీర్పుమని ప్రార్థించగా ఇట్లు చెప్పెను.

శ్లో॥ పురుషః ప్రకృతిస్థోహి భుంజతే ప్రకృతి జాన్ గుణాన్।
కారణం గుణసంగోఽస్య-సదసద్యోని జన్మసు॥

(గీ. 13 అ. 25 శ్లో.)

తా. ఓ నచికేతుడా! 'నేను' అని పిలువబడె భోక్తయగు జీవుడు "ఆత్మా మనసా సంయుజ్యతే; మన ఇంద్రియేణ; ఇంద్రియ మర్థేన" అనినట్లు మనస్సుయొక్క సహాయముతో ఇంద్రియముల ద్వారా విషయ సుఖములను (సుఖ దుఃఖాదులను) గ్రహించి అనుభ వించుచుండును. ఈ జీవుడు తరు-పాషాణ-క్రిమి-కీటక-పశు పక్ష్యాది జన్మల నెత్తుటకు సత్వ-రజ-స్తమో గుణముల సంపర్కముచే చేసిన పుణ్య పాప కర్మలే కారణమగు చున్నవి.

శ్లో॥ శరీరం యదవాప్నోతి యచ్చాప్యుత్క్రామతీశ్వరః।
గృహీత్వైతాని సంయాతి వాయుఃగంధా నివాశయాత్॥
(గీ. 15 అ. 8 శ్లో.)

తా. వాయువు పుష్పకోశము నుండి గంధాదులను కొనిపోవు నట్లు జీవుడున్ను కర్మవశమున శరీరాంతరమునకు పోవునపుడు పూర్వ శరీరమును వీడి అందుండి ఇంద్రియాదులను తీసుకొనిపోయి నూతన దేహమున ప్రవేసించు చున్నాడు.

శ్లో॥ వాసాంసి జీర్ణాని యథావిహాయ నవానిగృహ్ణాతి నరోపరాణి।
తథాశరీరాణి విహాయ జీర్ణాన్యన్యాని సంయాతి నవానిదేహీ॥

తా. మానవుడు జీర్ణ వస్త్రములను వీడి క్రొత్త వస్త్రములను ధరించునట్లు, జీవుడును జీర్ణ దేహములనువీడి క్రొత్తదేహములనుధరించు చుండును. కాన స్థూలశరీరము నశించినను జీవుడు సూక్ష్మదేహ ముతో సంచరించుచుండును అని సందేహమును తీర్చెను.

అందుచేత జడమగు స్థూలదేహము నశించినను "నేను" అను పేరుతో పిలువబడుచు సుఖదుఃఖముల ననుభవించెడి "జీవాత్మకు" నాశము లేదు. దీనినే-

"జ్ఞా-జ్ఞౌ-ద్వౌ-అజౌ-ఈశానీశౌ" జీవేశ్వరుల ఇరువురిలోను జీవుడు అజ్ఞాని; ఈశ్వరుడు సర్వజ్ఞుడు; ఇరువురును పుట్టుక లేనివారే

(అనగా నిత్యులు) కాని ఈశ్వరుడు స్వతంత్రుడు, జీవుడు అస్వతంత్రుడు" అని వచించియుండిరి.

మరియు ఈజీవుడు సూక్ష్మదేహముతో కర్మానుసారము తరు పాషాణాదుల స్థూలదేహములయందు ప్రవేశించి కర్మఫలములను అనుభవించుచుండునని చెప్పిరి.

అట్లయిన స్థూలదేహము లేకుండగా సూక్ష్మశరీరముతో సుఖదుఃఖముల ననుభవించుటకు వీలుపడునా? అని సందేహింప వచ్చును. మనలో ప్రతిఒక్కరికి నిద్రించునపుడు తాత్కాలికముగా స్థూలదేహమును వీడి స్వప్నమునందు (కలలో) సూక్ష్మదేహముతో సంచరించు జీవుడు సుఖ - దుఃఖముల ననుభవించి నవ్వుచు, ఏడ్చుచు, లేచుట మనకు అనుభవసిద్ధము. ఈ విషయమునే:

శ్లో॥ పూర్వదేహానుభూతాంస్తు భూతాత్మా స్వపతః ప్రభుః
రజోయుక్తేన మనసా గృహ్ణాత్యర్థాన్ శుభాశుభాన్॥

అని చెప్పబడినది. (సు॥ శు॥ త॥ 4-6)

స్వప్నమునందువలె జీవాత్మ "శాశ్వతముగా" ఈ దేహమును వీడి లోకాంతరగతుడై కర్మానుసారము సుఖ-దుఃఖముల ననుభవించు ననిన సందేహింప నవసరము లేదు.

కాన దుష్కర్మలచే ప్రేతత్వము నొంది దుఃఖించెడి జీవుల దుఃఖమును తొలగించుటకై ఈ కర్మలు చెప్పబడినవి.

## పితరుల పొదుపు ఉద్యమము

శ్లో॥ మత్పరం దుర్లభం మత్వా నూనమావర్జితంమయా।
పయః పూర్వైః స్వనిశ్వాసైః కవోష్ణ ముపభుజ్యతే।
నూనంమత్తః పరం వంశ్యాః పిండవిచ్ఛేద దర్శినః।
నప్రకాశభుజః శ్రాద్ధేంస్వధాసంగ్రహ తత్పరాః॥

తా॥ నా పిమ్మట 'తిలోదకముల నిచ్చువారుండరు' అను విచా

రముతో నా పితృదేవతలు నాచే ఈయబడి, వారి వేడినిట్టూర్పుచే నులివెచ్చనైన తిలోదకములను త్రాగుచుండిరి.

వీని పిమ్మట మనకు పిండదాన మిచ్చువారు లేరని విచారముతో "శ్రాద్ధమున నాచే ఈయబడిన పిండములను" స్వేచ్ఛగా భుజింపక సగము భుజించి మిగిలినది మరునాటికి దాచుకొనుచుండిరి" అని సంతానము లేని దిలీపుడు తన పితరుల విచారమును గురువగు వశిష్ఠునకు తెల్పెను.

## ఋణత్రయము - ఇతరుల కేల చెప్పబడలేదు ?

ఈ ఋణత్రయము బ్రాహ్మణునికే తప్ప మిగిలిన వారికి ఉండదా? అని సందేహము కలుగవచ్చును. లోకములో తమ విధులను సక్రమముగా నిర్వర్తిస్తూ, కుటుంబ యజమానికి సహకరిస్తూ ఉన్న కుటుంబసభ్యులకు విద్యాబుద్ధులను కరపుట, రక్షించుట, పోషించుట - మొదలగు బాధ్యతలను వహించిన కుటుంబ యజమానిపైనే ఋణ-పణాదులను తీర్చు బాధ్యత ఉంటుంది. వాటిని తీర్చి ఆ ఫలితాన్ని వాళ్ళకు అందచేస్తాడు కుటుంబ యజమాని

అట్లే జగత్కుటుంబానికి యజమానిగా నిర్ణయింపబడి ఆ భారమంతయు తనపై మోపబడిన బ్రాహ్మణుడు, ఋణత్రయ భారము తనపైనే ఉండుటచే రక్షణ-కృషి- వాణిజ్యముల ద్వారా తనకు సహకరించుచున్న క్షత్రియ - వైశ్య - శూద్రుల సహకారంతో తాను ఋణవిముక్తుడై వారలనుకూడా ఋణవిముక్తులను చేస్తున్నాడు. కనుకనే "వర్ణానాం బ్రాహ్మణో గురుః" అని చెప్పారు. కాన బ్రాహ్మణేతరులకు ప్రత్యేకముగా "ఋణత్రయము" చెప్పబడలేదు.

## : స్త్రీ ప్రాముఖ్యత (స్త్రీ గౌరవము) :

పితృఋణ విముక్తికరమైన ఉత్తమ సంతానము; దేవఋణ విముక్తికరమైన ధర్మకార్యములు; ఎవరి స్వాధీనములో ఉన్నాయి?

స్త్రీ యొక్క స్వాధీనంలో ఉన్నాయి. ఇవి మాత్రమే కాదు. "శుశ్రూష - ఇంద్రియసుఖము-పితరులకు, తనకు కూడా స్వర్గాది లోకములు, ఈ స్త్రీ స్వాధీనములో ఉన్నాయి. దీనినే:-

శ్లో॥ అపత్యం ధర్మకార్యాణి శుశ్రూషా రతిరుత్తమా।
దారాధీనాః తథాస్వర్గం పితౄణాం ఆత్మనశ్చనః॥

అని మనువు చెప్పాడు.

ఇట్టి ఉత్తమఫలములను ప్రసాదించుచూ తద్వారా మానవుని సంసార తరణమునకు 'తరణి' (నావ) వలే ఉపకరించు ఉత్తమ సాధనము "స్త్రీ" అని ఆమెకు సంఘంలో ఉత్తమస్థానాన్ని ఒసగుటయేగాక వస్త్రాభరణాదుల నిచ్చి కులదేవతనువలె పూజించవలెనని ఆదేశించిన వారు 'మన ఋషులు'. ఎచ్చట స్త్రీలు గౌరవింపబడుదురో అచ్చట దేవతలు నివసింతురు. ఎచ్చట స్త్రీ కన్నీరుపెట్టునో ఆ ఇల్లు నశించును. కాన ఆత్మశ్రేయస్సును కోరువారు స్త్రీని అన్ని విధముల గౌరవింపవలెనని శాశించారు ఋషులు. దీనినే:

శ్లో॥ పూజ్యా భూషయితవ్యాశ్చ - యది కళ్యాణమిచ్ఛతా।
యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతాః।
జామయో యత్రశోచ్యంతే వినస్యంతి ఆశు తత్కులం॥

అని మనువు చెప్పియున్నాడు.

## తన రూపమే పుత్రుడు

పరుల పనులను నెరవేర్చుటకంటె తన పనిని తానే నెరవేర్చుకొనుటయందు ఎక్కువ శ్రద్ధను చూపుట లోకసహజము. అందుచే పరలోకగతుడైన తనకు పితృకర్మలద్వారా సుఖాన్ని కలిగించుటయందు ఎక్కువ శ్రద్ధాభక్తులుకల వ్యక్తి ఎవరు? తానే. అందుచే తనకు ప్రతినిధిగా తన ప్రతిబింబాన్ని స్త్రీ యందు నిర్మించుకొని వెళ్ళుచున్నాడు మానవుడు. కనుకనే: "ఆత్మావై పుత్రనామాసి"

ఓ మానవుడా ? "నీవే నీ భార్యయందు పుట్టి 'పుత్రుడు' అను పేరుతో పిలువబడు చున్నావు - అని వేదమాత బోధిస్తోంది.

ఈ పుత్రరూపాన్ని నిర్మించుకొనుటకు ముఖ్యసాధన మేమిటి ? స్త్రీ. ఈ విషయమే :

శ్లో॥ పతిర్జాయాం - ప్రవిశతి
గర్భో భూత్వా సమాతరం। దశమేమాసి సూతవే॥

తా॥ పురుషుడు స్త్రీ గర్భములో ప్రవేశించి పదవ నెలలో "పుత్రుడు" అను పేరుతో పుడతాడు - అని చెప్పబడినది.

ఈ విషయాన్నే 'పుత్రాకృతి నున్న ద్రోణుడు అని' అశ్వత్థామనుగూర్చి, తిక్కన ద్రౌపదినోట చెప్పించాడు. ఈ వేద రహస్యము ఆనాడు స్త్రీలకుకూడా తెలుసునన్న మాట. అందుచేతనే ఆనాడు తమ పవిత్రతను జాగ్రత్తగా కాపాడుకొనే వారు స్త్రీలు. ఈ విజ్ఞానము ఆనాడు ఆబాలగోపాలానికి ప్రతి అణువులోను జీర్ణించిపోయే టంతటి విపుల ప్రచారములో ఉండేదని స్పష్టమగు చున్నది. ఈనాడు ఈ విషయం పండితులకే తెలియకపోవుటచే స్వధర్మాన్నుండి చ్యుతులైన మానవులు అధఃపతనానికి దారితీస్తున్నారు.

## స్త్రీ సజీవమైన కెమేరా

ఐహిక - ఆముష్మిక - సుఖసంపదలకు సాధనమైన ఉత్తమ సంతతిని; (ఆత్మరూపాన్ని) బడయుటకై నిర్మింపబడిన "సజీవమైన కెమేరాయే" స్త్రీ అంటే అందుచేతనే 'అపత్యార్థం స్త్రియః సృష్టాః। పుత్రార్థం - దారసంగ్రహః॥' అని చెప్పారు ఋషులు.

స్త్రీ అనే సజీవమైన ఈ కెమేరాద్వారా 'పుత్రుడు' అను పేరుతో సజీవమైన తన రూపాన్ని (ఫోటోను) నిర్మించుకొను చున్నాడు మానవుడు.

ఈ లోకంలో నిర్జీవమైన తన ప్రతిబింబాన్ని (ఫోటోను) నిర్జీవమైన కెమేరాద్వారా నిర్మించుకొని, దానితో తన లౌకిక వ్యాపారములను ఎట్లు నెరవేర్చుకొనుచున్నాడో అలాగే "స్త్రీ" అనే సజీవమైన కెమేరాద్వారా; సజీవమైన తన ప్రతిబింబాన్ని నిర్మించుకొని అలౌకిక వ్యవహారాలను సాధించుకొనుచున్నాడు మానవుడు.

ఈ స్త్రీ అనే కెమేరా మానవుని రూపాన్ని గ్రహించి సజీవమైన ప్రతిబింబాన్ని ప్రసాదిస్తుంది. కనుకనే ఈమెకు 'జాయ' అని పేరు పెట్టారు. దీనినే:

శ్లో॥ జాయాయాః తద్ధిజాయాత్వం-యదస్యాం జాయతే పునః ॥

భర్త యొక్క రూపము స్త్రీ యొక్క హృదయఫలకముపై ప్రతిబింబించి ఆమె నుండి "పుత్రుడు" అను పేరుతో పుట్టునుగాన ఈమెకు 'జాయ' అనునది సార్థకమైననామమని వేదమాత బోధిస్తోంది.

## స్త్రీ అను కెమేరా యందలి భాగములు

సజీవమైన 'స్త్రీ' అనే కెమేరాకు కన్నులే 'లెన్సులు'; ఆమె మనస్సే 'నెగిటీవ్'; గర్భాశయమే "చీకటిగది" ఈ గర్భాశయమున ఉంచబడిన స్త్రీ-పురుష బీజమిశ్రణమను "పాజిటివ్" పైన మనస్సను (హృదయఫలకమను) "నెగిటీవ్"పై ప్రతిబింబించిన రూపము ముద్రింపబడుతుంది. ఇది "గర్భోదక మను" డెవలపర్ "ద్రావణమున" మునిగితేలుచు మాసాను-మాసికముగ క్రమేణ పెంపొందుచు తొమ్మిది నెలలు పూర్తికాగానే "సర్వాంగ సుందరమైన" భర్తయొక్క సజీవమైన ప్రతిబింబాన్ని కంటుంది స్త్రీ. దీనికే "పుత్రుడు" అను పేరు పెట్టబడుతుంది. నిర్జీవమైన కెమేరాకు "డార్కు రూము", "డెవలపర్" మొదలగునవి వేరువేరుగా ఉంటాయి. నేర్పరియైన భగవంతుడు వీటిని స్త్రీ అను సజీవమైన కెమేరాలోనే ఇమిడ్చాడు.

## వివాహ శబ్ద నిర్వచనము

"వివాహము" అంటే ఎక్కువ భారము (బాధ్యత)ను వహించుట అని అర్థము. ఇచ్చట ఎవరి బాధ్యతను ఎవరు వహిస్తున్నారు? "పాలకొరకు - రాయి మోయాలని" అనినట్లు దేవ-పితృ ఋణ విముక్తికి ప్రధానసాధనమైన స్త్రీని ఎవడు 'స్వీకరించుటకు నిశ్చయించుకొనునో, వాడు ఆమె యొక్క బాధ్యతను వహిస్తాడు (భరిస్తాడు) కాన వాడు ఆమెకు "భర్త" అని చెప్పబడుతాడు.

### : వి వా హ ము :

పురుషుడు "ద్విజ, అగ్ని, బంధు, మిత్రుల" సమక్షమున

శ్లో॥ ధర్మ ప్రజా సంపత్యర్థం స్త్రియ ముద్వహే ॥

తా॥ దేవఋణ విముక్తికి సాధనమైన యజ్ఞాదికర్మలు చేయుటకు 'పితృఋణ' విముక్తికి హేతువైన ఉత్తమ సంతానమును బడయుటకు; ప్రధాన సాధనమైన స్త్రీని, ఋణవిముక్తికై వివాహమాడుచుంటిని" అని ప్రతిజ్ఞ చేసియు;

"ధర్మేచ అర్థేచ కామేచ తయా సహానాతిచరితవ్యా?
నాతి చరామి॥"

తా॥ ధర్మ అర్థ కామములను ఈమెను వీడి ఆచరింపరాదు. అని కన్యాదాత పలుకగా; 'చేయను' అని ప్రతిజ్ఞ చేసియు;

వధూవరులు:-

ఆవాభ్యాం కర్మాణి కర్తవ్యాని; ప్రజాశ్చ ఉత్పాదయతవ్యాః॥

తా॥ 'మన మిరువురము దేవఋణ విముక్తిసాధనమైన యజ్ఞాదికర్మలను చేయుదము. పితృఋణ విముక్తికి హేతువైన ఉత్తమసంతానమును బడయుదము' అని పరస్పర ప్రతినపల్కియు;

పురుషుడు:

శ్లో॥ తేజోమయైః - మంత్రైః సత్యబ్రహ్మ తపోమయైః॥

తా॥ బ్రహ్మతేజస్సు; తపశ్శక్తితోఁ నుకూడి; సత్యస్వరూపము లైన మంత్రములతోఁ అగ్నియందు హోమమొనర్చి ఆమెను పవిత్రురాలనుగా (బీజావాపనకు అర్హురాలనుగా) చేసి; అట్టి స్త్రీని సహ ధర్మచారిణిగా స్వీకరించుట యేది కలదో అట్టిక్రియకు "వివాహము" అని పేరు పెట్టారు.

## వివాహ భేదములు

ఈ వివాహము ఎనిమిది విధములుగా విభజింపబడినది.

1) బ్రాహ్మము : సాలంకృత కన్యను అర్హుడైన వరునకు ఇచ్చుట.

2) దైవము : సాలంకృత కన్యను యజ్ఞమునందలి ఋత్విజునకిచ్చుట.

3) ప్రాజాపత్యము : ధర్మార్థ-కామముల యందు ఈమెను విడవక ఈమెతోఁ కలసి చేయవలెను-అనిన 'చేయుదును' అని ప్రతిన చేయించి కన్యను ఇచ్చుట.

4) ఆర్షము : వ్రతాంగముగ ఒకటి-రెండు గోమిథునములను వరుని నుండి గ్రహించి కన్య నిచ్చుట.

5) ఆసురము : కన్యాశుల్క - వరశుల్కముల నిచ్చి వివాహ మాడుట. (ఇది శుల్కదూషితము).

6) గాంధర్వము : వధూవరులు అన్యోన్యానురాగమున (ప్రేమించుకొని) పెండ్లి చేసుకొనుట. (ఇది కామదూషితము).

7) రాక్షసము : కన్యయొక్క బంధువులను జయించి కన్యను తెచ్చుకొనుట. (ఇది హింసా దూషితము)

8) పైశాచము : ఇష్టములేని, నిద్రించుచున్న కన్యను దొంగిలించి వివాహమాడుట ఇది అభియోగ (నేరము), దూషితము.

## శ్రేష్ఠమైన వివాహములు

బ్రాహ్మ - దైవ - ప్రాజాపత్య - ఆర్ష వివాహములు పూర్వాపూర్వము శ్రేష్ఠము లగుటచే వీటియందు పుట్టిన పుత్రుడు క్రమ

ముగా 21, 15-13-7; పురుషములను తరింప చేయును. మిగిలినవి కామోపభోగమునకే కాని వారి సంతతికి కర్మార్హత లేనందున నింద్యములు. కనుకనే:

శ్లో॥ పూర్వే వివాహాః చత్వారః ధర్మ్యాః తోయ ప్రదానికాః
అశుల్కాః బ్రాహ్మణార్హాశ్చ తారయంతి కులద్వయం॥

తా॥ బ్రహ్మ - దైవ - ప్రాజాపత్య-ఆర్షము అను మొదటి నాల్గు వివాహముల యందు ధారాపూర్వకముగా కన్యాదానము చేయబడును గాన ధర్మ్యములు. ఈ వివాహములయందు కల్గిన సంతానమునకే కర్మార్హత ఉండును. శుల్క శూన్యములైన ఈ వివాహములు ఉభయకులములను తరింప చేయును. ఇవి బ్రాహ్మణులకు తగినవి; అనియు మిగిలిన ఆసురాది వివాహములు కర్మ ప్రాధాన్యత లేని శూద్రులకు మాత్రమే తగినవి - అని చెప్పిరి.

శ్లో॥ బ్రాహ్మ్యాదిషు వివాహేషు చతుష్వేవ అనుపూర్వశః
బ్రహ్మవర్చస్వినః పుత్రాః జాయంతే శిష్ట సమ్మతాః।
రూప సత్వ గుణోపేతాః ధనవంతః యశస్వినః।
పర్యాప్త కామాః ధర్మిష్ఠాః జీవంతిచ శతంసమాః ॥

తా॥ బ్రాహ్మ్యాది నాల్గు వివాహములయందు బ్రహ్మతేజస్సు రూపము - సత్యము - ధనము - యశస్సు - ఆప్తకామము - ధర్మబుద్ధి కలిగి పూర్ణాయుర్దాయము గల సంతానము కలుగును.

శ్లో॥ ఇతరేషు వివాహేషు నృశంసాః అనృతవాదినః
జాయంతే దుర్వివాహేషు బ్రహ్మకర్మ ద్విషః సుతాః॥
అనిందితైః స్త్రీ వివాహైః అనింద్యాః భవతి ప్రజాః।
నిందితైః నిందితాః నృణాం తస్మాత్ నింద్యాన్ వివర్జయేత్॥

తా॥ మిగిలిన ఆసుర - రాక్షస-గాంధర్వ-పైశాచ వివాహములయందు క్రూరస్వభావము, అసత్యము - వేదకర్మలను నిందించు స్వభావముగల పుత్రులు కలుగుదురు.

ప్రశస్తమైన వివాహములయందు ఉత్తమ సంతానమును; నింద్యములైన వివాహములయందు నీచస్వభావము గల సంతానమున్నూ కలుగును. కాన నింద్యములైన ఆసుర-రాక్షస - గాంధర్వ పైశాచములను విడువ వలెను - అని ఋషులు చెప్పారు.

## వివాహయోగ్య కాలము

సూ॥ ధర్మ్యేషు వివాహేషు కాల ప్రతీక్షణం। నాధర్మ్యేషు।

వైద్యనాధ వర్ణాశ్ర-ఖం.-110పే - 11-శ్లో॥

శ్లో॥ అధర్మ్యాః యే వివాహాస్తే-సమ్మతాః సార్వకాలికాః।
రాక్షస ఆసుర గాంధర్వ పైశాచా బ్రాహ్మణస్యతు।
నిషిద్ధ తిధివారేపి సమ్మతాః ఇతి నిశ్చితం॥

వైద్యనాధ ఖం॥ 110 పే-12 శ్లో॥

తా॥ ధర్మ్యములైన బ్రాహ్మ - ప్రాజాపత్య - దైవ - ఆర్ష వివాహములకుమాత్రమే శుభలగ్నాదులను చూడవలెను. అధర్మ్యములైన రాక్షస-ఆసుర-గాంధర్వ - పైశాచములకు శుభలగ్నములతో నిమిత్తము లేదు. నిషిద్ధ - తిధి - వారములయందు సైతము చేయవచ్చును. ఈ అధర్మ్యములైన వివాహములకు కాల నియమముతో పని లేకుండ అన్ని కాలములయందునూ చేయవచ్చును. అని ఋషులు చెప్పియుండిరి. ఈ వివాహములయందు పుట్టిన వారికి కర్మార్హత లేదని చెప్పబడుటచేత.

## వివాహ సంస్కార ప్రాముఖ్యత

కృషీవలునిచే సంపాదింపబడిన వ్యవసాయ యోగ్యమయిన ఉత్తమక్షేత్రము "దున్నుట - కలుపు తీయుట - ఎరువు వేయుట - మొదలగు సంస్కారములచే సంస్కరింపబడి, ఉత్తమఫలాన్ని ఈయగల శక్తి కలదై విత్తనమును నాటుట కనువైనదిగా ఏర్పడుతుంది. అట్లే ఉత్తమలక్షణములుకల క్షేత్రస్థానీయమైన కన్య వివాహ సంస్కారముచే సంస్కరింపబడి గర్భాధానా(బీజావాపనాది) సంస్కా-

రములకు అర్హులైరాలయి ఉత్తమ (జాతికి) సంతానమునకు ప్రసవిత్ర అగుతుంది. కాన ఈ వివాహ సంస్కారము యధావిధిగా చేయుట ఎంతయు ముఖ్యము.

## ఊరిలోని వివాహము ఊరి (లోని) వారలకు ఉత్సాహదాయక మేల ?

కృషీవలుని సక్రమమైన కృషిఫలితముగా, కృషీవలునితో పాటు, దేశమంతయు సుభిక్షముగా ఉండుటచే వానిని చూచి సర్వులు సంతోషింతురు. అట్లే వివాహసంస్కారముచే సంస్కరింప బడిన నూతన దంపతులకు "వంశస్య కర్తారం – అనంత కీర్తిం" అనినట్లు వంశోద్ధారకుడు-దేశోద్ధారకుడునగు రామ-కృష్ణాదులవంటి ఉత్తమపురుషుడు పుట్టవలెనని కోరుచు, అట్టి మహాపురుషుడు పుట్ట వలెనని నూతన దంపతుల ఆశీర్వదించుటకే; పవిత్రమైన వివాహ సంస్కారమున బంధుమిత్రాదులందరు పాల్గొనుచుండుటకు ముఖ్య కారణము. వధూ-వరులతో పాటు ఇతరులకు కూడా ఆనందహేతువు కాగలదు కాన

## కన్యా లక్షణములు

శ్లో॥ అనన్యపూర్వికాం కాంతాం అసమానార్షి గోత్రజాం।
అవ్యంగాంగీం సౌమ్యనామ్నీం హంస వారణ గామినీం।
తను లోమ కేశ దశనాం మృద్వంగీం ఉద్వహేత్ స్త్రియం
హంసస్వరాం మేఘవర్ణాం మధుపింగళలోచనాం।
తాదృశీం-ఉద్వహన్ కన్యాం గృహస్థః సుఖమేధతే॥

తా॥ పరపురుష సంపర్కము లేనిది; మనోహరమైనరూపము కలది, సమానమైన ఋషి – గోత్రములు లేనిది; అంగవైకల్యము లేనిది; ఆకర్షణీయమైన (ఇంపైన) పేరు కలది; రాయంచ, మత్త గజమువలె మనోహరమైన నడక గలది; మృదువైన – పలచని

(వెంట్రుకలు) జుట్టు, పండ్లు కలది; మృదువైన, నిగారింపుగల శరీరము కలది; రాయంచ - కీరము - కోకిలల వంటి మనోహరమైన కంఠస్వరము కలది; మేఘశ్యామలమైన శరీరకాంతి కలది; తేనెరంగు గల కన్నులు కలది - అగు కన్యను పెండ్లి ఆడినచో దినదినాభివృద్ధి నొందుచు సుఖించును.

## పెండ్లి యాడరాని కన్య

శ్లో॥ నోద్వహేత్ కపిలాం కన్యాం నాధికాంగీం నరోగిణీం।
నాలోమికాం నాతిలోమాం నవాచాటాం నపింగళాం।
నగర్ఘురస్వరాం క్షామాం తథా కాకస్వరాం నచ।
నాని బద్ధేక్షణాం తద్వత్ వృత్తాక్షీం నోద్వహేత్ ద్విజః।
గండయోః కూర్పరౌయస్యాః హాసంత్యాఃతాంచ నోద్వహేత్।
నచాతి ఛిద్రదశనాం నకరాళముఖీం నరః।
ద్రుష్టాన్యగతకామాంచ నోద్వహేత్ పురుషః క్వచిత్॥

తా॥ రాగివర్ణముగల శరీరము; జుట్టు; కల దానిని; హెచ్చు తగ్గులుగల అవయవములు కల దానిని, రోగిష్ఠురాలిని; ఎక్కువ రోమములు కాని, అసలు రోమములు లేనిదానిని కాని, వదరుపోతును కాని; బొంగురుకంఠము, కాకిస్వరము కలదానిని, కృశించి యున్న దానిని; ఎక్కువగా కంటిరెప్పలను ఆర్చు దానిని; (మాటిమాటికి రెప్పలను వాల్చు దానిని) గుండ్రని కన్నులు కలదానిని; నవ్వునపుడు బుగ్గలు సొట్టలుపడు దానిని; ఎడమైన - వంకరయైన పండ్లుకల దానిని; వంకర ముఖము కలదానిని; ఇతరులను ప్రేమించి యున్న దానిని; పెండ్లియాడరాదు. భయంకరమైన కాళీ, చెండి మొదలగు పేర్లుకల దానిని పెండ్లి యాడరాదు.

## వర లక్షణములు

శ్లో॥ కులంచ శీలంచ వపుః వయశ్చ విద్యాంచ విత్తంచ

సనాథతాంచ। ఏతాగుణాః సప్తపరీక్ష్య దేయా కన్యా
బుధ్నై నాన్యత అవేక్షణేయా॥

తా. స్వయం ఏతైర్గుణైః యుతః అనినట్లు కన్యకు చెప్పిన లక్షణములను కూడా పరీక్షించియు, ఉత్తమ కులము (వైదికకర్మ లచే పవిత్రమైన కులము) మంచి స్వభావము, అందము, తగినవయస్సు విద్య, ధనము, తల్లి తండ్రులు మొదలగు పెద్దవారు కలవాడైన వరునకు కన్యను ఈయవలెను.

వధూవరుల వయః పరిమాణము

శ్లో॥ వర్షైః ఏకగుణాం భార్యాం ఉద్వహేత్ త్రిగుణోనరః॥

తా॥ వరుని వయస్సులో మూడవవంతు వయస్సుగల కన్యను వివాహమాడ వలయునని మన్వాదులు వచించిరి.

సూ. అథాస్మై పంచవింశతి వర్షాయ ద్వాదశ వర్షాం పత్నీం
ఆవహేత్। పిత్ర్య ధర్మ అర్థ కామ ప్రజాః ప్రాప్స్యతీతి॥
(సు. 10 అ)

తా॥ ఇరువదియైదు సంవత్సరములు వయస్సు గలవాడు పండ్రెండు సంవత్సరములు వయస్సుగల కన్యను వివాహమాడవలెను. అట్లయిన శ్రాద్ధాది పితృకర్మలు- యజ్ఞాది దేవకర్మలు- అర్థ, కామ ములు ఆచరించుటయందు ఉత్తమ సంతానమును, బడయుటయందు ఆసక్తిగల పుత్రులను బడయును అని సుశ్రుతాదులు చెప్పిరి.

శ్లో. స్వవర్షాత్ ద్విత్రి పంచాదిన్యూనాం కన్యాం సముద్వహేత్॥

తా. వరుని వయస్సు కంటె 2, 3, 5 మొదలగు సంవత్సర ములు తక్కువ వయస్సు గల కన్యను వివాహమాడ వలయుననియు చెప్పియుండిరి.

"యత్రో మందాగ్నయో హ్రస్వాః హీనసత్వాః నరాః కలౌ॥

అనుటచే యుగ భేదమునుబట్టి మానవుల యొక్క ఆయువు మొదలగువాటి ప్రమాణము తగ్గుచుండును కాన మన్వాదులు చెప్పినది కృత త్రేతాయుగముల వారికిన్నీ; సుశ్రుతాదులు చెప్పినది ద్వాపర యుగము వారికిన్నీ మిగిలినది అనగా (2, 3, 5 సంవత్సరములు తక్కువ అనునది) కలియుగపు వారికిన్నీ చెప్పబడినట్లుగా గ్రహించునది.

## గర్భాధాన యోగ్య వయఃకాలము

శ్లో. ఊన షోడశ వర్షాయాం అప్రాప్తః పంచవింశతిం।
యద్యాధత్తే పుమాన్ గర్భం కుక్షిస్థః సవిపద్యతే।
జాతోవా నచిరంజీవేత్ జీవేద్వా దుర్బలేంద్రియః।
తస్మాత్ అత్యంత బాలాయాం గర్భాధానం నకారయేత్॥
(సూ. 10 అ)

తా. పదహారు సంవత్సరములకు లోపల వయస్సుగల స్త్రీయందు ఇరువదియైదు సంవత్సరముల లోపల వయస్సుగల పురుషుని వలన కలిగి గర్భము నిలువక చెడిపోవును. ఒకవేళ గర్భము నిలచి సజీవముగా ప్రసవించినను ఎక్కువ కాలము జీవింపనేరదు. ఒకానొకపుడు జీవించినను దుర్బలములైన అవయవములు కలవాడై జీవించును. కాన పదునారుసంవత్సరముల వయస్సుకు లోబడిన స్త్రీయు ఇరువదియైదు సంవత్సరముల వయస్సుకు లోబడిన పురుషుడును గర్భాధానమున కనర్హులు. చవిటి నేలయందు నాటిన బీజమువలె నిష్ప్రయోజన మగును.

## గర్భాధాన యోగ్య కాలము

శ్లో॥ ఋతు కాలాభిగామీస్యాత్ స్వదార నిరతః సదా।
ఋతు, స్వాభావికః స్త్రీణాం రాత్రయః షోడశస్మృతాః।
తేషామాద్యాః చతస్రస్తు నిద్యైకాదశీచయా।
త్రయోదశీచ శేషాస్యుః ప్రశస్తాః దశరాత్రయః॥

తా. ఉత్తమ సంతానమును కోరువాడు ఋతుకాలమునందే తన భార్యతో కలియవలెను. స్త్రీ బైటచేరినది మొదలు పదునారు రోజులకు "ఋతుకాలమని పేరు". వాటిలో మొదటి నాల్గు రోజులు పదకొండు పదమూడవ రోజును భార్యతో కలియుటకు పనికిరావు. మిగిలిన పదిరోజులలో కలసినచో ఉత్తరోత్తరము మంచి సంతానము కలుగును.

## ఋతుకాల నియమములు

సూ॥ ఋతౌ ప్రథమ దివసాత్ ప్రభృతి బ్రహ్మచారిణీ; దివా స్వాప; అంజన -అశ్రుపాత -స్నాన - అనులేపన అభ్యంగన - నఖచ్ఛేదన-ప్రధావన - హసన - కథన - అతిశబ్ద శ్రవణ - అవలేఖన అని లాయాసాన్ పరిహరేత్॥ కిం కారణం?

దివాస్వాపాత్ స్వాపశీలః; అంజనాదంధః, రోదనాత్ వికృత దృష్టిః; స్నానానులేపనాత్ దుఃఖశీలః; తైలాభ్యంగాత్ కుష్ఠీ; నఖాప కర్తనాత్ కునఖే; ప్రధావనాత్ చంచలః హసనాత్ శ్యావ-దంత - ఓష్ఠ - తాలు - జిహ్వాః; ప్రలాపీవా అతి కథనాత్; అతి శబ్ద శ్రవణాత్ బధిరః: అవలేఖనాత్ ఖలతిః; మారుతా యాస సేవనాత్ ఉన్మత్తః, గర్భోభవతి ఇతి; ఏవమేతాన్ పరిహరేత్॥

సు॥ 2 - అధ్యా.

తా॥ స్త్రీ బైటచేరిన మొదటిరోజు నుండి మూడు రోజుల వరకు బ్రహ్మచర్య వ్రతమును పాటించవలెను. పగటి నిద్ర, కాటిక పెట్టుకొనుట, ఏడ్చుట, స్నానము చేయుట, గంధము మొదలగు పూతలను పూసుకొనుట, తలంటుకొనుట, గోళ్ళు తీయుట, పరుగెత్తుట, ఎక్కువగా నవ్వుట - అధిక సంభాషణము, పెద్ద ధ్వనులనువినుట, భూమియందు, కాగితములయందు వ్రాయుట, ఎక్కువగా గాలిని సేవించుట, ఎక్కువగా కష్టపడుట, మొదలగునవి విడువవలెను. ఏలయన?

పగటినిద్ర వలన నిద్రపోతు, కాటుక పెట్టుకొనుటవలన గ్రుడ్డి వాడు, ఏడ్చుట వలన వంకరదృష్టి కలవాడు, స్నాన-అనులేపనముల వలన దుఃఖస్వభావము గలవాడు, తల అంటుకొనుట వలన కుష్ఠు రోగి, గోళ్ళుతీయుట వలన పుప్పిగోళ్ళ వాడు, పరుగెత్తుట వలన చంచలమైన స్వభావము కలవాడు, నవ్వుట వలన శ్యావ వర్ణము (ఎరుపు; నలుపురంగు) గల దంతములు, పెదవులు, దౌడలు, నాలుక కలవాడును; ఎక్కువ మాట్లాడుట వలన వదరుబోతు; అధిక శబ్ద మును వినుట వలన చెవిటివాడున్ను; చిత్రరువులు మొదలగునవి వ్రాయుటవలన బట్టతలవాడు; ఎక్కువ గాలిని సేవించుట, అలసట చెందుట వలన ఉన్మత్తుడు (మందబుద్ధి) కలవాడును - అగు శిశువు జనించును. కాన వీటిని విడువ వలెను.

## స్త్రీ - పురుష సంతానము కలుగుటకు కారణము

శ్లో॥ యుగ్మేషు దివసేష్వాసాం - భవత్యల్పతరం రజః।
సంయోగం తత్రయాగచ్ఛేత్ సాపుమాంసం ప్రసూయతే।
అయుగ్మేషు దినేష్వాసాం భవేత్ బహుతరం రజః।
సంయోగం తత్ర యా గచ్ఛేత్ సాతు కన్యాం ప్రసూయతే॥

తా॥ "శుక్రబాహుళ్యాత్ పుమాన్; రజోబాహుళ్యాత్ స్త్రీ॥" శుక్రాధిక్యతవలన పురుషుడు; ఆర్తవాధిక్యతవల్ల స్త్రీయు; పుట్టు ననుటచే, 6-8-10-12-14-16. ఇవి యుగ్మ (సరి) రోజులగుటచేత ఈ రోజులలో స్త్రీకి ఆర్తవము తక్కువగా ఉండుటచేత, ఆ రోజు లలో "తైల మాషోత్తరా హారాం నారీం ఉపేయం రాత్రౌ" అని చెప్పినట్లు, ఆర్తవము యొక్క పరిమాణమును తగ్గించెడి నూనె - మినుములు మొదలగు ఆహారమును తినిన స్త్రీని కలసినచో పురుష సంతానము కలుగును. 5-7-9-11-13-15, ఈ రోజులు బేసిరోజులు వీటియందు స్త్రీకి ఆర్తవము ఎక్కువగా ఉండుటచే, ఈ రోజులలో

స్త్రీని కలసినచో ఆడపిల్లలు కలుగుదురు. కాన పురుషసంతానము కావలెననెడివారు సరి రోజులలోను; ఆడపిల్లలు కావలెననెడివారు బేసి రోజులలోను స్త్రీతో కలయవలెను.

"సర్పిస్నిగ్ధః సర్పిక్షీరాభ్యాం - శాల్యోదనం భుక్త్వా॥"

అనుటచే మగశిశువును కోరువాడు శుక్రమును వృద్ధిచేసెడి నేతితో కూడిన పాలుఅన్నమునుతిని స్త్రీతో కలియుట ఎంతయు ముఖ్యము.

## పుంసవనము

గర్భస్థశిశువు స్త్రీ అయిన పురుషునిగా మార్చుటకై చేయు క్రియకు "పుంసవనమని" పేరు పెట్టిరి. "అవ్యక్తే గర్భే" అనుటచే అంగ ప్రత్యంగ విభాగమును పూర్తిగా చెందని గర్భమునకు (గర్భస్థ శిశువునకు) ప్రథమ, ద్వితీయ, తృతీయ మాసములయందు ఇది చేయవలెను. ఎట్లన :

సూ॥ లబ్ధగర్భాయాశ్చ ఏతేష్వహస్సు, లక్ష్మణా, వటశృంగా-సహదేవా - విశ్వే దేవానాం అన్యతమం క్షీరేణ అభిషుత్య త్రీన్, చతురోవా, బందూర్ దద్యాత్ దక్షిణే నాసాపుటే పుత్రకామాయై; నచతాన్ నిష్ఠీవేత్॥ (స్త్రీ కామాచేత్ వాను నాసాపుటే దద్యాత్) సు-2 - అధ్యా. 33 సూ॥

తా॥ స్త్రీ గర్భమును ధరించినట్లు స్పష్టమైన పిమ్మట, లక్ష్మణ పంజి, వటాంకురము, సహదేవి, విశ్వదేవి అను వాటిలో దేనినేనియు ఆవుపాలతో నూరి మూడు, లేక నాలుగు చుక్కలు పుత్రుడు కావలయుననెడి స్త్రీయొక్క కుడిముక్కునందు వైదికోక్త ప్రకారము నస్యము చేయించవలెను. దానిని ఉమ్మి వేయరాదు. ఆడపిల్ల కావలెననిన ఎడమముక్కునందు నస్యము చేయించవలెను.

శ్లో॥ తత్రతకాకారి రక్తాల్ప బిందుభిః లక్షితచ్ఛదా।
లక్ష్మణా పుత్రజననీ బస్తగంధాకృతిర్భవేత్॥

తా॥ లక్ష్మణ అను మూలిక గుడ్లగూబ శరీరమువలె అచ్చుటచ్చుట ఎఱ్ఱని చుక్కలుతో కూడిన ఆకులు కలిగియుండును. వావింట ఆకును పోలిక ఆకులు కలిగి యుండును. మగపిల్లలను పుట్టునట్లు చేయుటచే దీనికి "పుత్రజననీ" అనుపేరు సార్థకమైనది.

## ఏ రోజున కలసిన ఎట్టి సంతానము కలుగును ?

శ్లో॥ రాత్రౌ చతుర్థ్యాం పుత్రః స్యాత్ అల్పాయుః ధనవర్జితః।
పంచమ్యాం పుత్రిణీ – నారీ; షష్ఠ్యాం పుత్రస్తు మధ్యమః।
సప్తమ్యాం అప్రజా యోషిత్ అష్టమ్యాం ఈశ్వరస్సుతః!
నవమ్యాం సుభగాదారాః; దశమ్యాం – ఈశ్వరస్సుతః।
ఏకాదశ్యాం అధర్మాస్త్రీ; ద్వాదశ్యాం – పురుషోత్తమః।
త్రయోదశ్యాం సుతా లోకవర్ణ సంకరకారిణీ।
ధర్మవిచ్చ కృతజ్ఞః స్యాత్ ఆత్మవేదీ దృఢవ్రతః।
ప్రజాయతే చతుర్దశ్యాం గుణాఢ్యైః జగతీపతిః।
రాజపత్నీ మహాభోగా రాజవంశ గతాధవా।
జాయతే పంచదశ్యాంతు బహుపుత్రా పతివ్రతా।
విద్యాలక్షణ సంపన్నః సత్యవాదీ జితేంద్రియః।
ఆశ్రయః సర్వభూతానాం; జాయతే–షోడశే–పుమాన్॥

తా॥ భార్యతో నాల్గవరోజున కలసిన దరిద్రుడు, అల్పాయుర్దాయముగల పుత్రుడు; ఐదవరోజున సామాన్యపు కుమార్తెయు; ఆరవరోజున సామాన్యుడైన కుమారుడున్ను; ఏడవరోజున గొడ్రాలు అగుకన్యయు; ఎనిమిదవరోజున ఈశ్వరుడు (అధికారముగల) పుత్రుడు; తొమ్మిదవ రోజున ఉత్తమమైన కన్యయు; పదవ రోజున ఉత్తము

N. B. : గర్భస్థ శిశువును "క్రోమోజోమ్సు, అల్కాహోలు, వాటి సహాయమున స్త్రీగా గాని; పురుషుడుగా కాని మార్చవచ్చునను విషయమును సుమారు పది నెలల క్రిందట రేడియో ప్రసంగమున ఆంగ్లేయ డాక్టరు ఒకరు ప్రసంగించి యుండిరి.

డైన కుమారుడు; పదకొండవ రోజున చెడునడతగల కన్యయు, పండ్రెండవ రోజున పురుషశ్రేష్ఠుడైన కుమారుడు; పదమూడవ రోజున వర్ణసంకరముచేయు కన్యయు; పదునాల్గవ రోజున ఉత్తమ గుణములు కలిగి ప్రభువగు కుమారుడు; పదిహేనవ రోజున గొప్ప భోగములు కలదియు, మహారాణియు, ఎక్కువ పుత్రులు కలిగి పతివ్రత యగు కన్యయున్ను; పదహారవ రోజున మహావిద్వాంసుడున్ను, ఇంద్రియ నిగ్రహము-సత్యవాక్కు, ఉత్తమ లక్షణములు కలిగి సర్వభూతాశ్రయుడగు కుమారుడున్నూ కలుగును.

## స్త్రీ - పురుషులు కలయుటకు ఉండవలసిన నియమములు

శ్లో॥ సువస్త్ర వేషధరయా స్నాతయా శుద్ధచిత్తయా।
అరోగయా దయితయా స్వాయం ఏవం విధః స్వపేత్।
స్నాతః స్రక్ గ్రంధదృక్ ప్రీతః వ్యావాయం పురుషోవ్రజేత్॥

సూ॥ క్షీర శాల్యోదనం భుక్త్వా తైల మాషోత్తరాహారాం -
నారీం ఉపేయాత్ రాత్రౌ॥

తా॥ వస్త్రభూషణాదుల చేతను, స్రక్చందనాదుల చేతను, మనోహరముగా, అలంకృతయై; పవిత్రమైన మనస్సుగల స్త్రీతో, పురుషుడుకూడా అట్టి లక్షణములు కలవాడై, ఇరువురు పరస్పర అనురాగముతో కలసినచో ఉత్తమమైన సంతానము కలుగును.

పురుషుడు పాలుఅన్నమును భుజించియు, నూనెతో చేయబడిన, మినుముతోచేయబడిన పదార్థములను తినిన స్త్రీతో కలియుట శ్రేష్ఠము. పగలు కలియుటవలన అల్పాయుర్దాయము, అనారోగ్యము మొదలగు సంతానము కలుగును - కాన నియమములను నతిక్రమించరాదు.

## ఎట్టి స్త్రీని - కూడరాదు

శ్లో॥ నానిష్టాం - నప్రకుపితాం - నప్రశస్తాం - నరోగిణీం।
నాదక్షిణాం-నాన్యకామాం-నాకామాం-నాన్యయోషితం।
క్షుత్క్షామాం-నాతిభుక్తాంవా-స్వయం ఏతైర్గుణైర్యుతః॥

తా॥ ఉత్తమ సంతానమును కోరు పురుషుడు, అనురాగము లేని స్త్రీతోను; కోపముతో కూడిన, అనుచితమైన, రోగిణియైన, అసమర్థురాలయిన, ఇతరులయందు కోర్కె కలిగియున్న, కలియుట యందు ఇష్టములేని, పరస్త్రీ అయిన స్త్రీతో; తానును పై లక్షణ ములు కలవాడై కలియుట ఎంతయు నింద్యము. ఎక్కువ ఆకలిచే బాధపడెడి, లేక ఎక్కువగా భుజించిన స్త్రీ-పురుషులు కలియు టయు; ఆరోగ్యమునకు; సంతానమునకు నష్టమును కలిగించును.

## గర్భాధానమునకు శుభనక్షత్రావశ్యకత

శ్లో॥ గర్భాధానర్క్షం ఆరభ్య నక్షత్రే జననం భవేత్।
నవమే-దశమేవాపి ద్వాదశేవా అథనిశ్చితః।
ఆధానర్క్షం సమారభ్య ప్రసవో ద్వాదశేయతః!
విజ్ఞాయ శుభనక్షత్రం తద్గంతవ్యం విశేషతః।
దారప్రియైః అలంకారైః అలంకృత్య ప్రసన్నధీః॥

తా॥ గర్భాధాన నక్షత్రము మొదలు తొమ్మిది - పది - పండ్రెండు నక్షత్రములయందు ప్రసవించుట సామాన్యము. గర్భా ధాన నక్షత్రము నుండి పండ్రెండవ నక్షత్రమున జననము కలుగును. కాన జనన నక్షత్రము కూడా మంచిదగునట్లు చూచుకొని (అనగా గర్భాధాన నక్షత్రమునకు పండ్రెండవ నక్షత్రము కూడా మంచిది అగునట్లుగా చూచుకొని) ముహూర్తము పెట్టవలెను.

## స్త్రీకి అలంకారాదుల ఆవశ్యకత

భార్యకు ఇష్టమైన పుష్పాదులచే అలంకరింపచేసి ఉత్సాహ

ముతో స్త్రీని (భార్యను) కలియుటవలన ఉత్తమసంతానము కలుగును. కాని అట్లుచేయుట ఎంతయు అవసరము. ఈ విషయమునే - మనువు:

శ్లో॥ యది నారీ నరంచేత పుమాంసం న ప్రమోదయేత్।
అప్రమోదాత్ పునః పునః ప్రజనం న ప్రవర్తతే॥

తా॥ స్త్రీ, పురుషుని మనస్సును ఆకర్షించునట్లు లేనిచో (వస్త్రాభరణములచే అలంకరించుకొని అందముగా లేనిచో) పురుషుని మనస్సును ఆకర్షింప జాలదు. పురుషునకు ఉత్సాహము కలగనిచో గర్భధారణ జరుగనేరదు. కాని పురుషుని మనస్సును ఆకర్షించునట్లు స్త్రీ వస్త్రాభరణాదులచే అలంకరించుకొనుట ఎంతయు అవసరము.

(ఉత్తమ సంతానమును కోరువారు కేవలము కామప్రవృత్తి గల పశువులవలె ప్రవర్తింపక స్రక్ - చందన - వస్త్రాభరణాదులచే అలంకృతయై, మనోహరమైన స్త్రీని పరస్పరానురాగముతో కూడుట ఎంతయు అవసరము.

## సంసర్గ కాల నియమములు

శ్లో॥ నిషేక సమయే యాదృక్ నారీ చిత్త వికల్పనా।
తాదృక్ స్వభావా సంభూతిః జంతుర్భవతి కుక్షిగః॥

తా॥ స్త్రీ - పురుషుల, కలయిక సమయమున "కెమేరా స్థానీయమైన స్త్రీ హృదయమున ఎట్టి వికల్పనలు (ఎట్టి ఆకారములను స్మరించుట) జరుగునో అట్టి స్వరూప స్వభావములుగల శిశువే జనించును.

కెమేరాకు యెదుట ఏదిఉంటే దాని ప్రతిబింబమే ప్రతి బింబించుట వలన అదే ఆకారముగల బొమ్మలనే యిస్తుంది కెమేరా. అదే విధముగా స్త్రీ హృదయఫలకమున (మనస్సులో) సంసర్గకాలమున మనో-వాక్-కాయముల ద్వారా :-

శ్లో॥ యాదృశం భజతేహి స్త్రీ సుతంసూతే తథావిధం॥
సూ॥ యాం ఆకృతిం పశ్యతి। తాదృశం జనయతి॥

తా॥ ఎట్టి రూపమును చూచునో లేక స్మరించునో వాటికి సంబంధించిన రూపగుణములే గర్భస్థశిశువుకు సంక్రమించుటచేత అట్టి రూప-గుణములు గల "శిశువునే" స్త్రీ ప్రసవిస్తుంది. కాన ఎంత అలంకరించుకొనినను చిత్తశుద్ధికూడా ఉత్తమసంతానము బడయుటకు అవసరము.

ఈ విషయాన్నే :- బైబులు మొదటి భాగమున 30 అధ్యాయము, 37 - వాక్యమునందు ఈ విధముగా వ్రాయబడినది. "యాకూబు" పొన్న మొదలగు ప్రాకుల కొమ్మలను నరకి అచ్చటచ్చట తెలుపు కనబడునట్లు పట్ట వలిచి మేకలు నీరు త్రాగుటకై వచ్చు దారిలో వాటికి కనబడునట్లు వేసి ఉంచును. అవి నీరుత్రాగునపుడు క్రీడించు వాడుక కలదు. ఆ సంపర్క సమయమున వాటిని చూచి 'తెలుపు-నలుపు' రంగులుగల పిల్లలను కనును - అని చెప్పబడింది.

అందుచేతనే చరకాచార్యుడు కూడా :

సూ॥ "స్త్రీ" యా-యాచ యథావిధం పుత్రం ఆసీత్; తస్యాః, తస్యాః, తాన్-తాన్ పుత్రాశిషం అను నిశమ్య తాంస్తాన్ జనపదాన్ - మనసా అను పరిక్రామయేత్॥

"స్త్రీ" ఎట్టి పుత్రుని కోరునో అట్టి గుణముల కనువైన ఆశీస్సులను విని; ఆయాయా జనపదములను స్మరించుచుండవలెను" అని వచించి యుండెను.

అందుచేత ఉత్తమ గుణములుగల సంతానము కావలయునని కోర్కెలుగల దంపతులు ఉత్తమమైన "భగవంతుని యొక్క; పుణ్యక్షేత్రముల యొక్క; పుణ్యపురుషుల యొక్క; చిత్రపటములను పడకటింటియందుంచుకొని వానిని చూచుట, స్మరించుట మొదలగునవి చేయవలయును. మరియు ఆత్మానురూపమగు కుమారుడు కావ

లయునని వివాహమాడిన భర్తయొక్క కోర్కె నెరవేర్ప తలచిన "స్త్రీ".

శ్లో॥ పూర్వం పశ్యేత్ ఋతుస్నాతా యాదృశం నరం అంగనా।
తాదృశం జనయేత్ పుత్రం భర్తారం దర్శయే దతః॥

తా॥ ఋతుస్నాతయైన (ముట్టునీళ్ళు పోసుకొనిన) స్త్రీ, తొలుత ఎవరిని చూచునో వాని రూపగుణములుకల కుమారునే ప్రసవించును. (కనుకనే ముట్టుదోషము తగులును అని చెప్పుదురు.) కాన ముందుగా భర్తను చూడవలెనని చెప్పిరి. "అందుచేత తన భర్తనే ముందుగా చూడవలెను.

## (పేడివాడు)

## షండ లక్షణము

శ్లో॥ యోభార్యాయాం ఋతౌ మోహాత్ అంగనేవ ప్రవర్తతే।
తత్ర స్త్రీ చేష్టితాకారః జాయతే షండసంజ్ఞికః॥

తా॥ ఋతుకాలమున భార్యతో ఆవేశమున ఉపరతి (స్త్రీ పురుషులు తారుమారుగా కలయుట) చేసినచో స్త్రీ లక్షణములు గల పురుషుడు నిర్వీర్యుడై పుట్టును. వీనినే (పేడి అని-కొజ్జా అని) అందురు.

శ్లో॥ ఋతౌ పురుషవద్వాపి ప్రవర్తే తాంగనాయది।
తత్రకన్యాయది భవేత్ సాభవేత్ నరచేష్టితా॥

తా॥ ఋతు కాలమున కామాతిరేకమున స్త్రీ పురుషునివలె ప్రవర్తించినచో (తారుమారుగా ప్రవర్తించినచో) ఉపరతి సల్పిన వారికి "కన్యక జనించినచో" పురుష లక్షణములుకలదిగా నుండును. అట్టి కన్యను "పుంసా స్త్రీ - స్ఫోట లక్షా" అనియు పిలుతురు.

## అస్థి విహీన గర్భోత్పత్తి

శ్లో॥ యదా నార్యాం వుపేయతాం వృషస్యంతౌకథంచన।
ముంచన్త్యౌ శుక్రమన్యోన్యం అనస్థి తత్రజాయతే॥

తా॥ కామపీడితులైన స్త్రీ లిరువురు సురతాపేక్షతో దృఢమైన పరస్పర యోని సంఘర్షణావలన వీర్యము స్రవించి గర్భాశయమున చేరి ఎముకలేని మాంసపిండము వృద్ధి చెందుటచే మాంసపిండమును ప్రసవించును.

### కలలము పుట్టుటకు హేతువు

శ్లో॥ ఋతుస్నాతాతు యానారీ స్వప్నే మైథునమావహేత్।
ఆర్తవం వాయునాదాయ కుక్షౌ గర్భం కరోతిహి।
మాసి మాసి వివర్థేత గర్భిణ్యా గర్భలక్షణం।
కలలం జాయతేతస్యాః వర్జితం పైతృకైర్గుణైః॥ (సు-2-అధ్యా.)

తా॥ ఋతుస్నాతయైన స్త్రీ కలలో మైథునము చేసినట్లు కల వచ్చినచో ఆర్తవము వాయువుచే గర్భాశయమున చేర్పబడి గర్భముగా మారును. పిమ్మట ప్రతి మాసమునందు గర్భిణీలక్షణములతో గర్భము వృద్ధినొంది పితృ సంబంధమైన కేశ-రోమ-నఖ-సిరా-ధమని, స్నాయువులు - ఎముకలులేని మాంసపిండము పుట్టును. దీనిని కలల మందురు.

### దుష్ట సంతానమునకు హేతువు

శ్లో॥ ఆహారాచార చేష్టాభిః యాదృశీభిః సమన్వితౌ॥
స్త్రీ పుంసౌ సముపేయాతాం తయోః పుత్రోపితాదృశః॥

తా॥ మైథునమున (సంతానమునకై) ప్రవృత్తిగల స్త్రీ-పురుషులు, ఎట్టి ఆహార-ఆచార-చేష్టలు కలవారై యుందురో అట్టి ఆహారాచారములకు తగిన లక్షణములుగల సంతానమే కలుగును కాన స్త్రీ-పురుషులు కామాతిరేకమున సత్సంతానమునకై స్త్రీ పురుషుల కలయికకు చెప్పబడిన నియమముల నతిక్రమించినచో అల్పాయుష్యము; అంగవైకల్యము, నీచలక్షణములుగల సంతానము; పైన చెప్పినట్లు మాంసపిండాదులు జనించి దంపతులకు దుఃఖమును కలిగించును.

## మంచి సంతానమునకు హేతువు

శ్లో॥ ఏవంజాతాః రూపవంతో మహాసత్త్వాః చిరాయుషః।
భవంతి ఋణస్య మోక్తారః సత్పుత్రాః పుత్రిణే హితాః॥

తా॥ సత్సంతానమునకై చెప్పబడిన నియమములను (ఆహారాచారములను) పాటించినచో ఆయువు ఆరోగ్యములు, ఐశ్వర్యము, మంచి రూపము; గొప్ప బలము గలిగి ఋణత్రయములను తీర్చుట యందు సమర్థులైన; తల్లితండ్రులకు - సంఘమునకు ఆనందోత్సాహములను కలిగించెడి పుత్రులు కలుగుదురు. గాన ఇహపర సౌఖ్యమునకు నియమాచరణ ఎంతయు అవసరము.

## నియమ ప్రాధాన్యము

ఫోటోగ్రాఫరు "ఫోటో తీయుటకు చెప్పిన నియమములను పాటించినపుడే సర్వాంగ సుందరమైన ఫోటోను తీసి ఇవ్వగలుగుతాడు. ఆ నియమములను పాటింపక (అనగా: దేశ-కాల-దూరములను; కెమేరా యొక్క మంచి-చెడ్డలను; గమనింపక) ఫోటో తీసినచో అసలురూపాన్ని గ్రహింపలేకపోవుటయో, వికృతముగా ప్రతిబింబించుటయో; లేక ఇతరుల ఫోటో ప్రతిబింబించుటయో జరుగుతుంది. అందుచేత అందమైన ఫోటోను తీయలేకపోతాడు. నిర్జీవమైన ప్రతిబింబాన్ని తీయుటకే ఇన్ని నియమాలు - చిక్కులు ఉంటే సజీవమైన ప్రతిబింబాన్ని తీయుటకు వీనికంటె వేయిరెట్లు నియమాలున్నాయని వేరే చెప్పాలా! నిర్జీవమైన కెమేరాకంటే సజీవమైన "స్త్రీ" అనే కెమేరా వేయింతలు సున్నితమైనది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రతిబింబము తారుమారయి "సంతతిః శుద్ధ వంశ్యాహి - పరత్రేహచ - శర్మణే" అనినట్లు ఐహిక - ఆముష్మిక సుఖసంపదలకు సాధనమగు సంతానమును బడయుటకు బదులు దుఃఖహేతువైన నరకాన్ని కలిగించు సంతానమును బడయును. అందుచేత శాస్త్రనియమములను పాటించుట ఎంతయు అవసరము.

## బాల్య వివాహ ప్రాధాన్యము

సర్వదా "ఆత్మాను రూపమైన సంతానము కావలయునని కోరు" భర్తయొక్క రూపమే ప్రతిబింబించాలంటే ఏమి చేయాలి? బాల్యములోనే వివాహము చేయాలి.

"అనాస్వాదిత విషయ రసస్య తే అయమేవ ఉపదేశకాలః"

అనినట్లు విషయరసా స్వాదనము (విషయముల చవి) ఎరుగని పవిత్రమైన లేత హృదయములు గల వారైన బాలికలను పిన్న వయస్సునందే వివాహముచేసి రాక పోకలద్వారా (మనుగుడుపులు అను పేరుతో) భర్తయందు భక్తి అనురాగములను పెంపొందించుట వలన నిర్మలమైన వారి హృదయఫలకముపైన చిన్ననాటనే ప్రతిబింబించిన భర్తయొక్క రూపము దృఢమూలమై ఇతర రూపములు ప్రతిబింబించుటకు అవకాశమీయక ఏ ఉద్దేశ్యముతో వివాహము చేసుకొనబడుచున్నదో అనగా "ఆత్మాను రూపమైన సంతానము బడయవలయును" అను ఉద్దేశ్యము ఏది కలదో ఆ ఉద్దేశ్యము నెరవేరుతుంది. అందుచేత బాల్యవివాహము అన్నివిధముల శ్రేష్ఠమైనది.

## రజస్వలానంతర వివాహ నిషేధము

సూ. విషమ శర ప్రహార జర్ఝరితే హృదయే జలమివ
గళత్యుపదిష్టం॥ అనినట్లు

యవ్వనవతియైన విషయ రసాస్వాదన మొనర్చిన యువతి హృదయ ఫలకముపైన పలురకములైన రూపములు ప్రతిబింబించుచూ నశించు చుండుటవలన భర్తయొక్క రూపము స్థిరముగా ఉండుటకు వీలులేకుండుటచే తత్కాలమున (ఆ సంసర్గ కాలమున) ఏ రూపము ప్రతిబింబించిన అట్టి రూప గుణాదులు గల పుత్రుడే కలుగును. అందుచేత వివాహము యొక్క ముఖ్యోద్దేశ్యము నెరవేరదు గాన "ఆత్మాను రూపమగు సంతానము నేకోరు" మానవుడు

చిన్నవయస్సుగల బాలికనే వివాహ మాడుట ముఖ్యము. కేవలము ఇంద్రియ సుఖమునే కోరు కామాతురులకు ఈ నియమములతో పని లేదు. సరియగు ప్రతిబింబము అక్కరలేదను వానికి "ఎక్స్‌పోజు అయిన నెగటివ్ గల; డార్కురూము చెడిపోయిన-కెమేరా అయినా పనికి వస్తుంది.

అట్లే పరపురుష సంపర్కముచే ఎక్స్‌పోజుఅయిన, హృదయ ఫలకమనే నెగటివు; చెడిపోయిన గర్భాశయమనే డార్కురూముగల స్త్రీని యైన వివాహ మాడుటలో దోషము లేదు.

## స్త్రీ పునర్వివాహము వలన పుట్టిన సంతాన లక్షణము

కెమేరా తన "నెగటివు" మొదట ఏరూపాన్ని గ్రహిస్తుందో దాని ప్రతిబింబాన్నే ఇస్తుంది కాని వేరే రూపాన్ని ఈయలేదు. అలాగుననే స్త్రీ "అనే కెమేరాయు" తొలి సంపర్కమున ఏ పురుషుని రూపము తనయొక్క గర్భాశయమున ముద్రింప బడుతుందో ఆ పురుషుని పోలిన సంతానమునే ప్రసవిస్తుంది. ఈ విషయాన్ని నవీన శాస్త్రజ్ఞులు పరిశోధన పూర్వకముగా రుజువు చేశారు.

(1) Herbert Spencer's opinion regarding a physioli-gical aspect of marriage is:— That during gestatition, traits on the constitution inherited from the father produce effects on the constitution of the mother; and these communicated effects are transmitted by her to subsequent off spring Professor Austin Febrit in his text book of Human Physiology writes as follows:—

A peculiar and it seems to be, on inexplicable fact is that previous pregnancies have an influence upon off spring. This is well known to breeders of animals. If pure blooded mares or bitches have been once covered by inferior male, in subsequent facundations the young are likely to partake of the character of the first male, even if they be afterwards bred with bales of unimpeachable pedigree.

What the machanism of the influence of the first conception is:—

It is imposible to say; but the fact is incontestable. The same influence is observed in the human subject. "A white woman who has had children by negro may subsequently bear children to a white man, these children presenting unmistakable peculiarities of the negro race" Mr. Spencer thinks that the influence of a previous pregnancy on subsequent offspring must be taken as a demonstrated fact".

ఒక స్త్రీ ఒక పురుషునితో కలసి గర్భమును ధరించినపుడు ఆ స్త్రీ పిమ్మట ఇతరులతో కలిసినచో రెండవవానికి పుట్టిన వారును మొదటివానినే పోలుచుందురు. ఈధర్మము పశువులలోను ఉన్నట్లు అనేక దృష్టాంతముల నిచ్చినారు.

"శ్రేష్టమైన గుఱ్ఱములు, కుక్కలు మొదటిసారి తక్కువ జాతి గుఱ్ఱములతోను, కుక్కలతోను కలసి, పిమ్మట రెండవసారి శ్రేష్టమైనవాటితో కలసినను, మొదటివాటినే పోలుచున్నవి"

అనేక నిదర్శనములతో "ఆస్టిన్" అను శాస్త్రజ్ఞుడు రుజువుచేసెను. మనుష్యులలో సయితము ఈధర్మమే కనబడుచున్నదని ఈ క్రింది ఉదాహరణము ఈయబడెను:-

"ఒక తెల్ల జాతిస్త్రీ నల్లవానితో (సిద్దీతో) కలసి, పిల్లలను కనిన పిమ్మట, తిరిగి తెల్లజాతివానితో కలసినను పుట్టిన పిల్లలు "సిద్దీనే" పోలుచున్నారు. అని చెప్పెను.

## పునర్వివాహ నిషేధ హేతువు

కాన సజీవమైన తన ప్రతిబింబాన్ని స్త్రీ ద్వారా నిర్మించు కొనవలెనని ఉద్దేశ్యముతో వివాహమాడదలచిన పురుషుడు ఇంతకు ముందె పరపురుష సంపర్కము గల స్త్రీని వివాహమాడినచో ఆత్మానురూపమైన సంతానమును ప్రసవింపజాలక తొలిసంపర్కంగల పురుషునిరూపమునే ప్రసవిస్తుంది. వాని రూపాన్ని చూచుకొనే భర్త

ఆనందించాలి. అందుచే వివాహము యొక్క ఉద్దేశ్యమే చెడిపోతుంది కనుకనే:-

"అనన్య పూర్వికాం" "అక్షతయోనికాం"

తా॥ పరపురుష సంపర్కము లేని కన్యనే వివాహమాడవలె నని మన్వాదులు చెప్పియుండిరి.

కాన స్త్రీయందు "సజీవమైన తన ప్రతిబింబాన్ని నిర్మించుకోవ తలచినవాడు వితంతువును కాని, పరపురుష సంపర్కముగల స్త్రీని కాని వివాహమాడరాదు.

## సగోత్ర - వివాహ - నిషేధము

Says Dr. S. M. Bemissi in his report read before the National Medical Association at washington :-

"That over ten percent of the blind, and nearly fifteen per cent of the idiotic in the different state institutions, were the offspring off kindred parents"

"అసపిండాం" "అసమాన ఋషి - గోత్రజాం"

తా॥ రక్తసంబంధము కలదియగు, లేక సమాన గోత్రముకల కన్యను కాని వివాహమాడరాదని నిషేధించారు ఋషులు ఎందుచేత? అట్టి వివాహములయందు శారీరక మానసిక దౌర్బల్యము దుష్ట స్వభావముగల సంతానము కలుగుతుంది కనుక.

ఈ విషయాన్ని నవీన శాస్త్రజ్ఞులు సైతము పరిశోధనల మూలముగా రుజువుచేసియున్నారు. ఈ క్రింది విధముగా:-

పాఠశాలలలోని గ్రుడ్డివారిలో 100కి పదికంటే ఎక్కువమంది సమీప బంధువులతో వివాహము చేయుటవలననే కలిగినవారని తెలియుచున్నది.

అని డాక్టరు (R బీమసు) అనునతడు 1858 లో వాషింగ్టన్ లోని వైద్య మహాసభలో చెప్పినాడు.

బైబులు నందుకూడా:-

మీలో ఎవ్వరు కూడా సమీప బంధువులతో వివాహము చేయబోకుడు అని చెప్పబడినది.

Leuit car:- None of you shall approach in "Marriage" to any that of kin to him" అని.

నిషిద్ధములైన వివాహముల వలన కలుగు నష్టము :-

శ్లో॥ వ్యభిచారేణ - వర్ణానాం - అవేద్యా వేదనేనచ,

స్వకర్మణాం పరిత్యాగాత్ జాయతే వర్ణసంకరః॥

తా॥ తమ వర్ణాశ్రమ ధర్మములను వీడి ఇతర ధర్మములను ఆచరించుట చేతను; సగోత్రము-రక్త సంబంధముగల వివాహములు చేయుట వలన; వర్ణాంతర వివాహములు చేయుటవలనను, వర్ణ సంకర మేర్పడును. (వెండి - బంగారము - రాగి మొదలగునవి కలిపినట్లు పంచకోల కషాయ మగుతుంది).

శ్లో॥ సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్యచ॥

తా॥ వర్ణసంకరము వలన; సంకర మొనర్చిన వారు; సంకర మైన కులములుకూడ నరకమును పొందుదురు. (అధర్మమైన భావ ములు కలవారగుటచే) అని ఋషులు సంఘక్షేమమును కోరినవారై చెప్పియుండిరి. కాన ఇట్టి నిషిద్ధములైన వివాహాదులను చేయుట, చేయించుట - ఎంతయు హానికరమని గుర్తించి అట్లు చేయకుండుట సంఘమునకు ఎంతయు క్షేమకరము.

## సాపిండ్య నివృత్తి

శ్లో॥ సపిండ తాతు పురుషే సప్తమే వినివర్తతే॥

తా॥ రక్తసంబంధము ఏడవ తరమునందు నివృత్తి యగును. అనియు;

శ్లో॥ జాత్యుత్కర్షో యుగే జ్ఞేయః సప్తమే పంచమేపివా॥

తా॥ క్షత్రియ-వైశ్య-శూద్రులు, ఉత్తమజాతి సంపర్కము వలన (అనగా తనుకంటే పైజాతి సంపర్కముచే) సంపర్కముగల ఉత్తమజాతిగా మారుచుందురనియు; మన్వాదులు చెప్పియుండిరి.

ఈ విషయమునే పరిశోధనల ద్వారా శాస్త్రజ్ఞులు క్రింది విధముగా ఋజువు చేసిరి.

Mr. Darwin's theory is (variation Vol. 2 - Chapter 17) "Thus Lord Exford crossed his famous grayhound which failed in courage with a bulldog which had an excess of ferocity. The consequence was that at the sixth or the seventh generation of decendants there was not a vesting left of the form of bulldog, but his indomitable courage remained."

"ఆక్సుఫర్డు" అను నాతడు "బొత్తిగా ధైర్యములేని తన వేటకుక్కను మిక్కిలి రౌద్రముగల "బుల్ జాతి" కుక్కతో కలపగా, కలిపిన కుక్కయొక్క ఆరవ-లేక - ఏడవ; తరమునకు బుల్ జాతి కుక్కయొక్క ఆకారచిహ్నములు; ఏమాత్రము లేక "ధైర్యము" నిలచినది. అని మాత్రమే "డార్విన్" అను నతడు వ్రాసెను - అని చెప్పెను.

## స్త్రీ దూషణ హేతువులు

శ్లో॥ పానం దుర్జన సంసర్గః పత్యాచ విరహాటనం।
స్వప్నః అన్యగేహ వాసశ్చ నారీ సందూషణానిషట్।
ద్వారోపవేశనం చైవ గవాక్షావేక్షణం తథా।
అసత్ప్రలాపః హాస్యంచ దూషణం కులయోషితాం॥

తా॥ త్రాగుట - దుష్టుల స్నేహము-భర్తను విడచి ఎక్కువ కాలము ఉండుట - పగటినిద్ర - పొరుగు యిండ్లకు అకారణముగా ఎక్కువసార్లు వెళ్ళుట - వీధిగుమ్మము వద్ద కూర్చొనుట; కిటికీనుండి పలుమారులు చూచుట; ఉచ్చరింపరాని మాటలను పలుకుట; ఎక్కువగా, నిష్కారణముగా నవ్వుట; మొదలగునవి స్త్రీ చెడిపోవుటకు కారణములు.

## స్త్రీ నియమములు

సూ॥ నానుక్త్వా గృహాన్నిర్గచ్ఛేత్; నానుత్తరీయా; నత్వరితా వ్రజేత్; నపరపురుషం అభిభాషేత-అన్యత్ర వణిక్; ప్రవ్రజిత; వృద్ధ వైద్యేభ్యః నానాభిం దర్శయేత్; ఆగుల్ఫాత్; వాసః పరిదధ్యాత్। నస్తనౌ వివృతౌకుర్యాత్; నహసేత్ అపావృతః; భర్తారం - తద్బంధూన్వా నద్విష్యాత్, నగణికా, ధూర్తా; అభిసారిణీః ప్రవ్రజితా, ప్రేక్షణకా; కలహకారికా; దుశ్శీలాదిభ్యః; సహ ఏకత్రిన తిష్ఠేత్; సంసర్గేణహి చారిత్రం దుష్యతి॥

తా॥ పెద్దల అనుమతి లేకుండగా ఇంటినుండి వెళ్లుట, వేగముగా నడచుట, ఉత్తరీయము(పమిటి)లేకుండగా ఉండుట,వృద్ధులైన వర్తకులు, సన్యాసి, వైద్యులు మొదలగు వారికంటె వేరయిన పరపురుషులతో మాట్లాడుట, నాభి కనబడునట్లు వస్త్రము కట్టుట, చీలమండల వరకు వస్త్రమును ధరింపకుండుట, స్తనములను బయట పరచుట, చేయి అడ్డు లేకుండగ - నిష్కారణముగా పలుమారు నవ్వుట; భర్తను, అతని బంధువులను ద్వేషించుట, వేశ్య - పరుషభాషిణి, వ్యభిచారిణి, సన్యాసిని, తారువుకత్తె, కలహ స్వభావురాలు, దుష్టురాలు - మొదలగు వారితో కలసియుండుట, మొదలగునవి స్త్రీ చెడుటకు ముఖ్య కారణములుగాన తన పవిత్రతను కాపాడుకొన తలచిన స్త్రీ వీటిని విడువవలెను.

## స్త్రీ రక్షణావశ్యకత

ఈ సంసారము నుండి తరించుటకు "స్త్రీ" పురుషునకు ఒక తరణి (నావ) వంటిది. నదీతరణమునందు నావకు స్వతంత్ర శక్తి లేకున్నను, తనపైన ఎక్కిన నావికుని తరింపచేసి తాను కూడా తరిస్తుంది వానితోపాటు నావ. అట్లే స్త్రీకి కర్మాధికారము లేకున్నను ఉత్తమ సంతతిని బడయుటకు, ధర్మకార్యము లాచరించుట యందు

పురుషునకు సహధర్మచారిణిగ సహకరిస్తూ వానిని తరింపచేసి వానితో పాటు తానుకూడా తరిస్తుంది సత్ప్రవర్తనగల స్త్రీ. నావ ఛిద్రాదులు (కన్నములు - పగుళ్ళు) మొదలగు వానిచే చెడిపోయినను; నావికునకు నావను నడపుటయందు సామర్థ్యము లేకున్నను; ఆ నావ తాను నదీగర్భములో మునుగుచు నావికుని కూడా ముంచి వేస్తుంది. అలాగుననే "స్త్రీ" దుష్టురాలయినను; ఆమెను సక్రమముగా నడపించుకొను శక్తి పురుషునకు లేకున్ననూ:

శ్లో॥ స్త్రీషు దుష్టాసు - వార్ష్ణేయ - జాయతే - వర్ణసంకరః॥
సంకరో - నరకాయైవ - కులఘ్నానాం - కులస్యచ॥

అనినట్లు తనతో పాటు భర్తను కూడా నరకముపాలు చేస్తుంది. "స్త్రీ" మోక్షసాధనకై ఎంతగొప్ప సాధనమో పతనానికి కూడా అట్టి సాధనమే కనుకనే :-

శ్లో॥ తస్మాత్ ప్రజావిశుద్ధ్యర్థం స్త్రీయం రక్షేత్ -ప్రయత్నతః"

తా॥ చక్కని పాటో కావాలంటే పాటోకు చెప్పిన నియమాలుఎట్లుపాటించాలో(కేమేరానుఎట్లుజాగ్రత్త చేసుకోవాలో)పరిశుద్ధమైన సంతానమును బడయుటకు అలాగే నియమములను పాటించుచు స్త్రీని ఎక్కువ జాగ్రత్తతో కాపాడు కొనవలెను అని మన్వాదులు చెప్పియుండిరి.

కాన స్త్రీ స్వయముగా రక్షించుకొనుచు భర్తచే రక్షింపబడుట ఎంతయు అవసరము.

ఉత్తమ ఫలమైన మోక్షసాధనకు, ఆనందానికి ముఖ్య సాధనమైన మానవత్వాన్ని (మనుష్యజన్మను) ఎవరు కోరుతారో వారికే ఈ నియమాలు చెప్పబడ్డాయి. అది వద్దను కొన్నవారికి పై నియమములతో పనిలేదు.

శ్లో॥ నిస్త్రైగుణ్యే - పథి - విచరతాం - కోవిధిః - కోనిషేధః॥

అనినట్లు "ఆత్మశక్తులను సంపాదించి ఎక్కువ ఉచ్ఛస్థితికి వెళ్ళిన బ్రహ్మవేత్తకు విధి-నిషేధములతో ఎట్లు పనిలేదో- అట్లే అతి నీచ స్థితియందున్న వానికి "విధి నిషేధములతో" పనిలేదు. అంతకంటె నీచస్థితికి పోవు అవకాశము లేనందున, కాన ఆత్మశ్రేయస్సును కోరు వారికే ఈ విధి-నిషేధములు చెప్పబడినవి.

## సంస్కారములు - వాటి ఆవశ్యకత

శ్లో॥ గర్భైః హోమైః జాతకర్మ చౌళమౌ జీనిబంధనైః।
బైజికం గార్భికంచేనః ద్విజానా మపమృజ్యతే॥ (మనుః)

తా॥ జాతకర్మ - చౌల - ఉపనయములయందు చేయబడిన హోమములు బీజ సంబంధమైన, గర్భసంబధమైన దోషములను పోగొట్టి ద్విజులను పవిత్రులనుగా చేయును అని మనువు వచించెను.

శ్లో॥ చిత్రకర్మ - యథానేకైః - రంగైః - ఉన్మీల్యతేశనైః।
బ్రాహ్మణ్యమపి-తద్వత్స్యాత్-సంస్కారైః విధిపూర్వకైః॥

తా॥ పలురకములైన వర్ణముల (రంగుల) చేత చిత్రము (బొమ్మ) ఎట్లు వ్యక్తము చేయబడి ప్రకాసించునో; అట్లే నలుబది సంస్కారములు, ఎనిమిది ఆత్మగుణముల చేతను; నంస్కరింపబడిన బ్రాహ్మణ్యము క్రమముగా పెంపొంది ప్రకాశించును.

సూ॥ ద్వివిధఏవ సంస్కారః బ్రాహ్మః దైవశ్చ భవతి।
గర్భాదానాది సమావర్తాంతాః - బ్రాహ్మః। పాకయజ్ఞ-
హావిర్యజ్ఞ - సౌమ్యాశ్చేతి దైవః। బ్రాహ్మేణ సంస్కా-
రేణ సంస్కృతః ఋషీణాం సమానతాం సాయుజ్యం
గచ్ఛతి. దైవేన (ఉత్తరేణ) సంస్కృతః దేవానాం స
మాన తాం - సలోకతాం - సాయుజ్యం గచ్ఛతి॥

తా॥ గర్భాధానము మొదలు సమావర్తము వరకు బ్రాహ్మ సంస్కార మనబడును. (వీటికే పూర్వ సంస్కారములందురు) వీటిచే సంస్కరింప బడిన ఋషితుల్యు లగుదురు. పాకయజ్ఞ - హవిర్యజ్ఞ సౌమ్యయజ్ఞములు దైవమని (ఉత్తర సంస్కారములని) పిలువబడును. వీటిచే సంస్కరింపబడి దేవతుల్యులయి దేవలోకమును, సాయుజ్య ముక్తిని పొందుదురు. కాన వీటిని తప్పక ఆచరించవలెను.

## ఈ నియమములు ఎవరికి

అర్చిరాది మార్గముగుండా పయనించి బ్రహ్మపదాన్ని పొంద గోరు యాత్రా జీవులు తొలుత ఋణత్రయ విముక్తి పత్రాన్ని (క్లియరింగు సర్టిఫికెట్ ను) సంపాదించి; సంస్కారములచే సంస్కరింప బడి పవిత్రులై "బ్రహ్మత్వాన్ని" సాధించియు; పిమ్మట ప్రేతకర్మల ద్వారా ప్రేతత్వమును పోగొట్టుకొని పరలోకయాత్రార్హత పత్రాన్ని (పాసుపోర్టును) సంపాదించు కొనుట అవసరము. కాన అట్టివారికే ఈ నియమములు చెప్పబడినవి.

—:o:—

# జీవయాత్ర - మూడవభాగం

## విషయ సూచిక


| | | పేజీ |
|---|---|---|
| 1) | వేదాంతమునకు లోకంల్లోగల ప్రచారము. | 1 |
| 2) | వేదాంతమనగా నేమి? | 2 |
| 3) | జీవుని బ్రహ్మగా మార్చు మార్గములు. | 2 |
| 4) | ఆనందము. | 2 |
| 5) | ఆనందము నందలి భేదములు. | 2 |
| 6) | లౌకికానందము. | 2 |
| 7) | మానవానందము. | 3 |
| 8) | చక్రవర్తి ఆనందము. | 3 |
| 9) | అలౌకికానంతము. (బ్రహ్మానందము) | 4 |
| 10) | ముక్తి. | 4 |
| 11) | మానవజన్మ ప్రాప్తి. | 5 |
| 12) | బ్రహ్మత్వమెట్లు కలుగును? | 6 |
| 13) | కుండలినీ - ప్రజ్వలనము. | 7 |
| 14) | జీవుడు - బ్రహ్మగా మారుట. | 7 |
| 15) | కుండలినీ శక్తి. | 8 |
| 16) | శ్రీశివా-శివశక్తుల సమ్మేళనము. | 9 |
| 17) | భక్తిమార్గము. | 13 |
| 18) | గురువు నిమిత్తమాత్రుడు. | 14 |
| 19) | కర్మయోగము. (భేదములు) | 15 |

20) కర్మయోగము - మొదటిపద్ధతి. 15

21) రసముద్వారా - బ్రహ్మత్వసాధన. 15

22) రససేవన ఫలము. 16

23) దివ్యౌషధిసేవనద్వారా - బ్రహ్మత్వము. 16

24) ప్రవరుని అతిథి. (కర్మయోగి) 17

25) కర్మయోగము - రెండవ పద్ధతి. 18

26) మనో నిగ్రహము. 19

27) యోగమును - అభ్యసించువిధము. 19

28) యోగము ఎవనికి సిద్ధించును? సిద్ధింపదు? 21

29) మనస్సును నిగ్రహించు విధము. 21

30) మనోనిగ్రహాదుల యందసమర్థుడేమి చేయవలెను? 22

31) నియమముల నతిక్రమించువారి స్థితి. 23

32) నియమములను పాటింపని యాత్రికుని ప్రబోధ. 24

33) బ్రహ్మపథప్రాప్తికి - ప్రధాన మార్గములు. 25

# జీవయాత్ర - మూడవభాగము
# వేదాంతము

## 1. వేదాంతమునకు - లోకంల్లోగల ప్రచారము.

ఈ కనబడేది అంతా అబద్ధమనియు; "యద్ద్రశ్యం తన్న శ్యం" ఏది కనబడుచున్నదో అది అంతా నశించేదే, అనియు; ఈ విధముగా "మానవుని దుఃఖోపశమనమునకై సంఘంల్లో ప్రచారంలోకల ఊరట వాక్యములకు "వేదాంతము" అనే ప్రచారము, లోకంలో ఉంది. ఇంతే కాదు. చెప్పేవానికి,వినేవానికి తెలియనిది ఏదికలదో అదే వేదాంతసారముగ చెప్పబడుతోంది. ఈ విషయాన్నే :-

"శ్లో॥ ఆశ్చర్యవత్ -పశ్యతి-కశ్చిత్ -ఏనం; ఆశ్చర్యవత్
వదతి-తథైవ చాన్యః। ఆశ్చర్యవత్ -చ-ఏనం
అన్యత్ -శ్రుణోతి-శ్రుత్వాప్యేనం- వేద నచైవ కశ్చిత్ ॥"

తా॥ ఒకడు ఈ ఆత్మనుగూర్చి ఆశ్చర్యముగా చూచుచుండును; మరియొకడు ఆశ్చర్యముతో వర్ణించుచుండును. వేరొకడు ఆశ్చర్యముగా వినుచుండును; కాని వీరెవరికిని, ఆత్మనుగూర్చి తెలియదు. అని శ్రీకృష్ణభగవానులు చెప్పియున్నారు.

కాన వేదాంతమంటే ఏమిటో? దాని యథార్థమును తెలుసుకొనుట ఎంతయు అవసరము.

## 2. వేదాంత మనగానేమి ?

"వేదాంతమనగా, జీవునియందు (మూలాధారమున) "కుండలిని" అను పేరట పిలువబడు "పరాప్రకృతి" అనెడి శివా

శక్తిని, సహస్రారమున గల "శివశక్తితో" కలియునట్లు చేసి ఆత్మశక్తులను సాధనద్వారా జీవునియందు వ్యక్తమగునట్లుచేసి జీవుణ్ణి బ్రహ్మగా (ఆనందమయునిగా) మార్చి "జీవో బ్రహ్మైవ" అను అద్వైతాన్ని నిరూపించు శాస్త్రము. దీనినే:-

శ్లో॥ తిష్ఠంత్యణిమాదియుతాః। విలసద్దేహాః - ముదా - సదా - 
నందాః। యే - బ్రహ్మభానం - అతులం సంప్రాప్తాశ్చైవ-
కృతకృత్యాః॥

అని గోవింద భగవత్పాదాచార్యులవారు చెప్పియుండిరి.

## 3. జీవుని బ్రహ్మగా మార్చు మార్గములు :-

"జీవో-బ్రహ్మైవ" అను అద్వైతాన్ని సాధించుటకు రెండు మార్గాలు చెప్పబడ్డాయి. 1. సాఖ్యము (జ్ఞానయోగము-అభ్యంతరయోగము) 2. కర్మయోగము (బాహ్యయోగము)

## 4. ఆనందము.

పిపీలికాది బ్రహ్మ పర్యంతము ప్రతిప్రాణి కోరేది "ఆనందము" దానికై "పాలకోసము-రాయి మోయాలి" అనినట్లు ఎన్ని కష్టాలు వచ్చిన లెక్క-చేయకుండా కృషిచేస్తూ ఉంటారు. కూలివానినుండి చక్రవర్తివరకు కష్టపడేది "ఆ ఆనందము కొరకే"

## 5. ఆనందము నందలి భేదములు.

ఈ ఆనందాన్ని రెండుగా విభజించారు ఋషులు. 1. లౌకికానందము 2. అలౌకికానందము (బ్రహ్మానందము) అని.

## 6. లౌకికానంద భేదములు

ఇది 1. మానవానందము 2. మనుష్య గంధర్వ 3. దేవ గంధర్వ 4. చిరలోక పితృ 5. ఆజాన జానదేవ 6. కర్మదేవ 7. దేవ

8. ఇంద్ర 9. బృహస్పతి 10. ప్రజాపతి; అనందమని పది విధము లుగా విభజింపబడింది.

7. మానవానందము.

కూలివాని వద్దనుండి చక్రవర్తివరకు గల ఆనందాన్ని "మానవానందము; అని అంటారు. క్రిందివాడు పైవారి ఆనందాన్ని కోరుట సహజము. చక్రవర్తికి గల ఆనందంకంటే గొప్పది మానవానందము వేరొకటిలేదు ఈ లోకంల్లో. కనుకనే చక్రవర్తికి ఈ లోకంల్లో ఉన్నదానిని అనుభవించుటయే తప్ప కోరతగినది వేరొకటిలేదు. (పరలోకానందము తప్ప)

8. చక్రవర్తి - ఆనందము.

ఎవడు :- శ్రు॥ ఆశిష్టో-ద్రఢిష్ఠో-బలిష్ఠః-తస్య-ఇయం-పృథ్వీ-సర్వా-
విత్తస్య-పూర్ణాస్యాత్। సఏకః-మానుష- ఆనందః॥

తా॥ బాగుగ తినగలిగి తినినది ఓజస్సుగా (బలముగా) మారి దృఢమైన అవయవ సౌష్టవము కలవాడై, భీమబలుడుగా ఎవడు ఉంటాడో; రత్నగర్భయు, సర్వసస్య సంభరితమైన సప్తద్వీపాత్మకమైన ఈ భూమండలమంతయు ఎవని స్వాధీనంలో ఉంటుందో అట్టివానికి గల ఆనందము మానవానందంలో ఉత్తమమైనది. (దీనినే చక్రవర్తి ఆనందము) అని అంటారు. ఇది:—

"శాస్తి-యశ్చాజ్ఞయా-రాజ్ఞః-ససమ్రాట్!"

తా॥ చతుస్సముద్ర ముద్రితమైన ఈ భూమండలము లోని రాజాధిరాజులు; సామంతులు మొదలగువారు ఎవని ఆజ్ఞను శిరసావహించి వాని అడుగుజాడలలో మెలగుతారో అట్టివానికి "చక్రవర్తి" అని పేరు. వానికి ఈ ఆనందము ఉంటుంది.

సృష్ట్యాదినుండి నేటివరకు గడచిన 196కోట్ల సంవత్సరముల లోను ఈ మానవానందమునకు అర్హులై చక్రవర్తి నామమును సంపాదించినవారు:—

శ్లో॥ హరిశ్చంద్రః - నలలోరాజా - పురుకుత్సః - పురూరవః।
నగరః - కార్తవీర్యశ్చ - షడైతే - చక్రవర్తినః॥ అను హరి

శ్చంద్రాదులు అర్హులు మాత్రమే.

ఈ మానవానందము మొదలు ప్రజాపతి ఆనందమువరకు గల పది విధములైన ఆనందములు ఒకదానికంటె ఒకటి నూరు రెట్లు గొప్పవి. అయినను వీటి అన్నిటియందు దుఃఖ సంపర్కము తరతమ భావములతో (హెచ్చుతగ్గులతో) ఉంటుంది.

## 9. అలౌకికానందము (బ్రహ్మానందము).

దీనికే "బ్రహ్మానందము" అని పేరుపెట్టారు. ఇది దుఃఖ సంపర్కములేక నూటికి నూరుపాళ్ళు స్వచ్ఛమైనది. "సత్ (త్రికాలాబాధితము) చిత్ (చైతన్యరూపము) ఆనందము 'ఆనంద రూపము' అని "బ్రహ్మకు" చెప్పబడిన లక్షణములలో ఈఆనందము ఒక లక్షణము. కనుకనే "ఆనందో బ్రహ్మ, ఆనందం బ్రహ్మణో రూపం" అని చెప్పబడింది.

## 10. ముక్తి.

ఇట్టి నిర్మలమైన ఆనందాన్ని పొందుట యేదికలదో దానికే "దుఃఖధ్వంసో గౌతమో మోక్షమాహ" అని గౌత మాదులు "మోక్షము" అని పేరుపెట్టారు. 84లక్షల జీవరాసుల లోను, దుఃఖ నివృత్తిద్వారా బ్రహ్మానందాన్ని పొందగల శక్తి ఒక మానవునకే ఉంది. మిగిలినవాటికి లేదు. కనుకనే:—

శ్లో॥ బుద్ధిమత్సు-నరాః-శ్రేష్ఠాః-నరేషు-కృతాబుద్ధయః।
కృతబుద్ధిషు-కర్తారః-కర్తృషు-బ్రహ్మవేదినః॥

తా॥ బుద్ధి కలవారిలో నరులు; నరులయందును, ఆత్మ జ్ఞానమున కుతూహలము కలవారును; అట్టివారిలో ఆత్మాను సంధానము చేయువారు; వారిలో బ్రహ్మతత్త్వసిద్ధిని పొందినవారును; శ్రేష్ఠులు; అని మనువు వచించియుంచెను.

## 11. మానవజన్మ ప్రాప్తి.

శ్లో॥ అనేక కోటి-జన్మాని-గచ్ఛతా-మనుజేశ్వర।
మానుష్యం ప్రాప్యతే దైవాత్, భుక్తి-ముక్తిప్రదాయకం॥

తా॥ కాయిక-వాచిక - మానసిక దోషములకు (నేరములకు) తగినట్లు తరు-పాషాణ, క్రిమి-కీటాది జన్మలను కోట్లకొలది ఎత్తినపిమ్మట పుణ్యావిశేషముచే తుదకు, భుక్తి-ముక్తులను, ఇచ్చు మానవజన్మ కలుగుతుంది.

కనుకనే:— "జంతూనాం - నరజన్మ దుర్లభం" జీవులకు మానవజన్మ వచ్చుట చాలా దుర్లభము అని అన్నారు. ఈ విషయాన్నే బోధించుటకై "వైకుంఠపాళిని" ఏర్పాటు చేశారు, స్త్రీలకు.

కాన ఈ శరీరము ఉండగనే మానవుడు ఆత్మజ్ఞానానికై (బ్రహ్మపథప్రాప్తికై) కృషి చెయ్యాలి. లేనిచో "ధర్మసాధనకై ముఖ్యమైన ఈ దేహముపోయిన (విడచిన) పిమ్మట, వారుచేసిన కాయిక-వాచిక, మానసిక నేరములకు తగినట్లు తరు-పాషాణాది జన్మలను పొందినచో ఆత్మజ్ఞాన సాధనకు అవకాశము ఉండదు. ఈ విషయాన్నే గోవింద భగవత్పాదులవారు :—

శ్లో॥ అస్మిన్నేవ శరీరే-యేషాం-పరమాత్మనోన సంచేద॥
దేహ త్యాగాత్ ఊర్ధ్వం-తేషాంతద్బ్రహ్మ-దూరతరం॥

తా॥ ఈ శరీరము ఉండగనే ఎవరు పరమాత్మను తెలసుకొనజాలరో, అట్టివారు శరీరము విడచిన పిమ్మట ఆ యాత్మను తెలసుకొనుట మిక్కిలి అసాధ్యము అని చెప్పారు. కాన ప్రతి ఒక్కరు ఈ శరీరము జరా-మరణములకు లోను కాక పూర్వమే బ్రహ్మత్వమునకై" కృషి చేయాలి.

## 12. బ్రహ్మత్వము ఎట్లు కలుగును?

శ్లో॥ "ఋణాని త్రీణ్యపాకృత్య-మనః- మోక్షే నివేశయేత్॥"
అనినట్లు బ్రహ్మచర్యాదులద్వారా ఋషి - దేవ-పితృఋణముల నుండి విముక్తి చెంది ఋణవిముక్తి పత్త్రాన్ని (క్లీరింగ్ సర్టిఫికెట్ ను) పొందిన యాత్రికుడు దేవయానము (అర్చిరాది మార్గము) గుండా పయనించి స్వస్థానమైన "బ్రహ్మపథాన్ని" పొందుటకు నార్తన్ రైల్వే గైడ్ అయిన "ఉపనిషత్తులందు" చెప్పిన రీవ్వున బ్రహ్మత్వాన్ని సాధించుటకై కృషి చేయాలి.

ప్రతి అగ్గిపుల్లయందు నిప్పు నిగూఢముగా ఉంటుంది. అయితే ఏ పుల్లను వరపిడి చేయుదుమో అందలి అగ్నిమాత్రమే ప్రజ్వరిల్లి ఉపయోగించుకొనువాని స్వభావమును పట్టి ఆత్మ శ్రేయస్సుకు, ఆత్మనాశనమునకుకూడా హేతువగుతుంది. అదే పధముగా 84లక్షల జీవరాసులకు మూలాధారమసే "పవర్ హౌసు నందు" "నిస్సీమ మహిమా" "మహాశక్తిః కుండలినీ" అని కొని యాడబడే "కుండలినీ-శక్తి" నిగూఢంగా ఉంటుంది. "యోగము-మణి-మంత్ర- ఔషధాదులద్వారా ప్రజ్వలింపచేయబడిన కుండలిని యందే మనస్సును నిలిపి ధ్యానించినచో :—

శ్లో॥ తస్మిన్ ఆధాయమనః స్ఫురదఖిలం చిన్మయం జగత్ పశ్యన్।
ఉత్సన్న కర్మ బంధః బ్రహ్మత్వ మిహైవ చాప్నోతి॥

తా॥ ఏ సాధకుడు ఆ కుండలినియందే. (ఆత్మ యందే) లగ్నమైన మనస్సు కలవాడై ప్రపంచము నంతటిని ఈ చిన్మయమైన జ్యోతిగా (ఆత్మగా) చూడగలుగునో అట్టివాడు ఈ జన్మయందే "బ్రహ్మత్వమును" పొందును;అని నిట్లు బ్రహ్మగా మారుతాడు. ప్రజ్వలింపచేయబడనిచో నిప్పుపుల్ల యందలి అగ్నివలే అందే నమసిపోతుంది. దీన్ని ప్రజ్వలింపచేసి బ్రహ్మత్వాన్ని పొందే శక్తి ఒక మానవునకు మాత్రమే ఉంది. కనుకనే—

"బుద్ధిమత్సు నరాః-శ్రేష్ఠాః-నరేషు కృతబుద్ధయః। అని చెప్పియున్నారు.

## 13. కుండలినీ - ప్రజ్వలనము.

శ్లో॥ యత్రాసక్తిః మనస్తత్ర తదాకారేణ తిష్ఠతి।
సఏవ మనసోధర్మః స్వానుషక్తాత్మనాస్థితిః॥

తా॥ మనస్సు దేనియందు లగ్నమగునో ఆ యాకారమును పొందును. అట్లు పొందుటయే మనస్సుయొక్క ధర్మము కాన :—

"శ్లో॥ బంధాయ-విషయాసక్తం, ముక్త్యై నిర్విషయంస్మృతం॥"

తా॥ విషయ సుఖములయందు లగ్నమైన మనస్సు, బ్రహ్మత్వాన్ని పొందనీయక "జీవుణ్ణి" విషయములయందే బంధించును. విషయ సుఖములయందు లగ్నము కాక ఆత్మానుసంధానము నందే లగ్న మొనర్చినచో "బ్రహ్మత్వాన్ని" కలిగించి ముక్తి నొసగును. అనినట్లు విషయ సుఖములయందే లగ్నమైన మనస్సు స్వల్పములును; పరిమితములును; అగు విషయసుఖములయందే బంధించి "జీవుణ్ణి" బ్రహ్మత్వాన్ని పొందనీయదు. విషయసుఖముల నుండి ఆత్మవైపుకు మరల్పగలిగినపుడే యాత్రికుడు "బ్రహ్మపథమును" పొందగలుగుతాడు. కాన యోగము-భక్తి వైరాగ్యముల ద్వారా మనస్సును బాహ్యవిషయములనుండి మరల్చి యాత్రికుడు దేనియందు ఎక్కువ ప్రీతి ఉండునో దానినే "ఆత్మభావనతో" నిరంతరము అనుసంధానము చేయుటవల్ల మనస్సునకు ఏకాగ్రత ఏర్పడి త్వరలో "కుండలినీ ప్రజ్వలనము" కలుగును.

## 14. జీవుడు బ్రహ్మగా మారుట.

బొగ్గు నిప్పుగా మారాలంటే నిప్పుతో సన్నిహిత సంబంధ మేర్పరచి వాయుసహాయముతో ప్రజ్వలింపచేసినచో బొగ్గు తన రూపాన్ని విడచి ఉష్ణత-ప్రకాశతలు కలదగుతుంది. అనగా

నిప్పుగా మారుతుందన్నమాట. అప్పుడు బొగ్గు అను పేరుపోయి "నిప్పు" అని పిలువబడుతుంది. అదే విధముగా.

"ఆత్మా-మనసా-సంయుజ్యతే; మన ఇంద్రియేణ;

ఇంద్రియ మర్ధేన" అనినట్లు

జీవునకు ఇంద్రియములకు మధ్య మనస్సు సంధానకముగా ఉండి విషయసుఖములను జీవునకు అందచేస్తుంది. దుఃఖమిశ్రితమైన ఆనందాన్ని, అప్పుడు జీవుడు పొందుతాడు. అప్పుడు అది బంధ హేతువగుతుంది. అనగా బ్రహ్మత్వాన్ని పొందనీయకుండా చేస్తుందన్నమాట. ఆ మనస్సే విషయములనుండి మరల్చబడి అలౌకికమైన "ఆత్మకు-జీవునకు" మధ్య సంధానకముగా ఉండునట్లు చేయబడినచో, అట్టి మనస్సుద్వారా నిరంతర సంబంధమేర్పరచుకొన్న జీవునకు ఆత్మగుణాలు సంక్రమింపచేయబడుటచే జీవత్వాన్ని వీడి "బ్రహ్మ" అని పిలువబడుతాడు. బ్రహ్మగుణములన్ని వానికి సంక్రమించుటచే అప్పుడే "జీవో బ్రహ్మైవ" అనునది ఋజువగును.

## 15. కుండలినీ శక్తి.

"విద్యుత్తు" జడశక్తులన్నిటికి మూలాధారము. కనుకనే "బలమితి విద్యుతి" అని వేదమాత చెప్పినది. అనంత శక్తియుతమైన ఈవిద్యుత్తు బ్రహ్మండమంతట వ్యాపించియున్నను. "విద్యుత్-సూర్యేసమాహితా" అనినట్లు సూర్యుడే మూలాధారముగా కలిగి ఉంది. ఆలాగుననే "ప్రాక్సృష్టేః కేవలాత్మనే" అనినట్లు సృష్టికి పూర్వము ఆత్మయందే లీనమైయుండి—

"బహుస్యాం-ప్రజాయేయ" పలురకములైన ప్రజలుగామారుదును. అని. సృష్టికి ఉన్ముఖమైన ఆత్మనుండి.

"శ్లో॥ గుణత్రయ విభాగాయ-పశ్చాద్భేదముపేయుషే"

"స్త్రీ పుంసా-వాత్మభాగౌతే - భిన్నమూర్తేః సిసృక్షయా" అనినట్లు ఆత్మనుండి విడబడినదియు; "ఇస్సీమ మహిమా"

"సర్వాంతర్యామినీ" "సర్వచైతన్యరూపా," అనినట్లు.

అనంతశక్తి యుతమును; సర్వవ్యాపకమును, చైతన్య రూపిణియునగు "ఆదిశక్తి, కులాంగన" అను పేర్లతో పిలువబడి "పరాప్రకృతి" "కుండలినీ" అను పేరుతో సర్వవ్యాపకమైనను "మూలాధారైక నిలయా" అనినట్లు మూలాధారమును నివాసముగా చేసుకొని యున్నది. ఈ కుండలినీ:—

"శ్లో॥ కులాంగనా-కులాంతస్థా కౌళినీ-కులయోగినీ।
అకులా-సమయాంతస్థా-సమయాచార తత్పరా।
మూలాధారైక నిలయా-బ్రహ్మగ్రంథి-విభేదినీ।
మణి పూరాంతరుదితా-విష్ణుగ్రంథి విభేదనీ!
ఆజ్ఞా చక్రాంతరాళస్థా-రుద్రగ్రంథి విభేదినీ।
సహస్రారాంబుజారూఢా-సుధాధారాభివర్షిణీ।
తటిల్లతా-సమరుచిః-షట్చక్రోపరి సంస్థితా।
మహాశక్తిః-కుండలినీ-బిసతంతు తనీయసీ।

భవానీ।భావనాగమ్యా-భవారణ్య కుఠారికా॥" అని కొని యాడబడినది.

## 16. శ్రీశివా - శివశక్తుల సమ్మేళనము.

అనంతశక్తియుతమైన స్త్రీ వాచకమైన విద్యుత్తు - పురుష వాచకమైన ఐరావత విద్యుత్తు (నెగిటివ్-పాజిటివ్) పరస్పరము కలసుకొని నపుడే కార్యకరణ సమర్థములగును, అట్లే—

"శ్లో॥ శివశ్శక్త్యాయుక్తః-యది-భవతి-శక్తః ప్రభవితుం
నచేదేవం-దేవః నఖలు కుశలః-స్పందితుమపి॥"

అనినట్లు మూలాధారముననుండి బయలుదేరిన "కుండలిని" అనంతశక్తియుతమైన స్థాణువను ఆత్మకు నిలయమైన సహస్రారమునకు చేరి ఆత్మతో కలుసుకొనినపుడే సర్వశక్తులు వ్యక్తమగుతాయి.

"పవర్ హౌస్" నుండి బయలుదేరిన-అనంతశక్తియుతమైన విద్యుత్తు మెయిన్‌లైనునందు పయనించుచూ ట్రాన్సుఫారముల గుండా తనయందలి శక్తులకు సూచకములైన "లైటు-ఫ్యాను, యంత్రచాలనము, మొదలగు శక్తులకు సంబంధించిన శాఖలలో ప్రవేశించి అందలి గ్రంథులను (స్విచ్‌లను) భేదించుకొని కేంద్రములకు చేరుకొని ఒకే విద్యుత్తు తాను చేయు క్రియాభేదములను బట్టి "లైటు, ఫ్యాను" మొదలగు పేర్లతో పిలువబడుచు తనయందలి అనంత శక్తులను ఎట్లు వ్యక్తము చేయుచున్నదో అట్లే ఇంద్రియములను-బుద్ధిని నిగ్రహించి, ఇంద్రియములనుండి మనస్సును మరల్చి స్వస్థానమైన ఆజ్ఞాచక్రమున నిలిపి, నాసాపుటమున సంచరించెడి హృదయమే స్థానముగాగల ప్రాణవాయువును, మూలాధారమే స్థానముగా గల అపాన వాయువును;

"శ్లో॥ ప్రాణాపానౌ-సమౌకృత్వా-నాసాభ్యంతరచారిణౌ॥"

అనినట్లు:— సమానమైన వేగాదులు కలుగునట్లు చేయుట వలనను:

"శ్లో॥ వజ్రోల్యభ్యాసయోగేన-కుండల్యుత్థాపనంభవేత్॥"

అనినట్లు వజ్రోలీ అభ్యాసముచేతను; "కుండలినికి సంచలన మేర్పడి రాజవీధి (ప్రకాశవంతమైన మార్గము) మెయినులైను అయిన సుషుమ్నా మార్గముగుండా ప్రవేశించి మధ్య మధ్యగల 1. మూలాధారము 2. స్వాధిష్ఠానము 3. మణిపూరము 4. అనాహతము 5. విశుద్ధము 6. ఆజ్ఞా;" అనెడి ట్రాన్సుఫారములగుండా "బ్రహ్మ-విష్ణు-రుద్ర" గ్రంథులను స్విచ్చెస్‌ను భేదించుకొనుచు

"శ్లో॥ శిరస్థితా-చంద్రనిభా-ఫాలస్థ-ఇంద్రధనుప్రభా"
హృదయస్థా-రవి ప్రఖ్యా॥ అనినట్లు:—

ఒక్కొక్క చక్రమునందు ఒక్కొక్క వర్ణముతో వెలయుచు పయనించి ఆజ్ఞాచక్రమును చేరి,

"ఫాలస్థ ఇంద్రధను ప్రభా।" అనినట్లు

ఆజ్ఞాచక్రమున ఇంద్రధనస్సువలే ప్రకాశించుచుండును. ఇట్టి తేజస్సును:-

"శ్లో॥ భ్రూయుగ-మధ్యగతం-యచ్ఛిఖి-విద్యున్నిర్మలంపరం
జ్యోతిః। కేషాంచిత్-పుణ్యకృతాం-ఉన్మీలతిచిన్మయంజ్యోతిః॥

అనినట్లు, శిఖిపించ్ఛము వలెను, ఇంద్రధనస్సువలెను, ప్రకాశించెడి చిన్మయమైన ఆ కులడలినియొక్క తేజస్సును భ్రూయుగ మధ్యమున అనగా ఆజ్ఞాచక్రమున చూడగలుగు భాగ్యము కొద్ది మంది పుణ్యాత్ములకే లభ్యమగును.

శ్లో॥ తస్మిన్-ఆధాయ మనః- స్ఫురదఖిలంచిన్మయం జగత్-పశ్యన్।
ఉత్పన్న-కర్మబంధః-బ్రహ్మత్వంఇహైవ చాప్నోతి॥ అనినట్లు

ఇంతకు పూర్వమే తన స్వస్థానమైనట్టి ఆజ్ఞాచక్రము యొక్క కేంద్రమున గల మనస్సుతో ఆ కుండలినీ తేజస్సునే ధ్యానించుచుండుట వలన:—

"శ్లో॥ తత్రస్థానాం-సులభమమృతం- సన్నిధానాత్ సుధాం శ్లో॥" అనినట్లు.

ఆ యాజ్ఞాచక్రమునకు సమీపముననే అనంతశక్తియుత మైన "ఆత్మకు" "సుధారసమునకు" నెలవైన సహస్రారము ఉండుటచేత:—

"శ్లో॥ ఆజ్ఞాచక్రాంతరాళస్థా-రుద్రగ్రంధి-విభేదినీ।" అనినట్లు.

ఆజ్ఞా చక్రమునందలి కుండలిని అచ్చటి రుద్రగ్రంధిని భేదించుకొని సహస్రారము చేరి అచట "ఆత్మ" అని పిలువబడెడి శివశక్తితో కలసి:—

"శ్లో॥ శ్రీ-శివా-శివ శక్త్యైక్య-రూపిణి-లలితాంబికా" అను

శివశక్తుల" మిథునముగా ఏర్పడి "లలితా" అని పిలువబడును.

"శ్లో॥ సహస్రారాంబుజారూఢా - సుధాధారాభివర్షిణీ॥" అనినట్లు

క్షుత్పిపాసలను (ఆకలి దప్పికలను) జరా-మరణములను పోగొట్టి అనంతములైన ఆత్మశక్తులను ప్రసాదించు, అమృతమును వర్షించును. సాధకుడు దానిని గ్రోలుటవల "బ్రహ్మత్వం - ఇహైవ చాప్నోతి" అనినట్లు ఈ జన్మలోనే బ్రహ్మగా మారి "జీవో బ్రహ్మైవ" అను అద్వైతాన్ని రుజువు చేయగలుగును. ఏ సాధకుడు (జీవుడు) పై రీతిని "అభ్యాసాతిశయజ్ఞాతా" అనినట్లు అభ్యాస యోగముచే సులభమైన "కుండలిని" యొక్క మహిమచే బ్రహ్మత్వమును పొందునో అట్టివాడు:—

"శ్లో॥ త్రిష్వంత్యాణి మాదియుతాః-విలసద్దేహాః-సదాముదా
నందాః! మే-బ్రహ్మభావం-అతులం-సంప్రాప్తాశ్చైవ
కృతకృత్యాః॥" అనినట్లు.

దేశ-కాల-అపరిచ్ఛిన్నత్వము; మొదలగు ఆత్మశక్తులు కలవాడై అణిమాది అష్టసిద్ధులను పొంది విద్యుత్తుతో కూడిన బల్బువలె (దీపాశయము వలె) బ్రహ్మతేజస్సుతో ఒప్పు దేహము కలవాడై కృతకృత్యుడగును.

"శ్లో॥ యస్మాత్-పరం-నాపరమస్తి-కించిత్ః" అనినట్లు దీని కంటే గొప్పదియు, పొందతగినదియు వేరొకటి లేకుండుటచేతను;

"సర్వంఖలు-ఇదం బ్రహ్మ" అనినట్లు. సమస్త దేవతల యొక్క శక్తులు ఈ బ్రహ్మయందే ఇమిడియుండుటచేతను, అట్టి బ్రహ్మత్వమును పొందిన సాధకుణ్ణి:—

"శ్రు॥ యావతీర్వై - దేవతాః - తాస్సర్వాః - వేదవిది బ్రాహ్మణే వసంతి" అని, సర్వదేవతామయుడు,అనగా సర్వదేవతా శక్తులు కలిగియుండునని వేదమాత బోధించుచున్నది. కాన

అట్లు బ్రహ్మత్వమును పొందిన సాధకునకు "నానవాప్తం-అవాప్తవ్యం" అనినట్లు ఇంతకంటె పొందతగినది పొందనిది అగు గొప్పది వేరొకటి లేకుండుటచేతను; ఉత్తమ ఫల సాధనకై చేయవలసిన కార్యము ఏమియులేదు. అందుచేతనే "బ్రహ్మవేత్త" "ఆప్తకాముడు" అని చెప్పబడుచున్నాడు. శ్రీకృష్ణ భగవానులు బ్రహ్మత్వమును పొందిన యోగీశ్వరుడు గాన:-

"శ్లో॥ "నమే-పార్థాస్తి-కర్తవ్యం-త్రిషులోకేషు-కించన।
నానవాప్తం-అవాప్తవ్యం-వర్తఏవచకర్మణి॥"

ఓ అర్జునా! ఈ మూడులోకముల యందును, నాచే పొందతగినది కాని; పొందబడనిది కాని లేదు. కాన నాచే చేయవలసినది ఏదియు లేదు. అని చెప్పియున్నాడు. అయినను:-

"శ్లో॥ అజ్ఞప్రబోధాత్ నైవాన్యాత్ - కార్యమస్తీతి తద్విదః।" అని చెప్పుటచే తాను ఆప్తకాముడైనను, అజ్ఞులకు బోధించి తరింపచేయవలసిన బాధ్యత ప్రతి ఒకరిపై ఉండుటచేత "శ్లో॥ లోకసంగ్రహమేవాపి - సంపశ్యన్ - కర్తుమర్హసి" అని నిట్లు అజ్ఞప్రబోధకై బ్రహ్మవేత్త తాను కర్మలను చేయుచు, ఇతరులుచేయునట్లు ప్రబోధ చేయవలెను. అని బోధించాడు భగవానుడు.

ఇది అంతేయు జీవునియొక్క అంతరతమైన మనస్సుద్వారాను, చైతన్యశక్తిద్వారా లోపలనే సాధింపబడుటచేత దీనిని "అభ్యాంతర యోగమనియు" ఇరిదు జ్ఞానసాధకమైన మనస్సు నిగ్రహింపబడును గాన "జ్ఞానయోగమనియు" దీనికి పేర్లు పెట్టారు.

### 17. భక్తి మార్గము.

ఇదియు జ్ఞానయోగము యొక్క శాఖయే. ఈ మార్గమున

శ్లో॥ యత్రాసక్తిః మనఃతత్ర తదాకారే ణతిష్ఠతి।
సఏవమనసోధర్మం స్వానుషక్తాత్మనా స్థితి॥

మనస్సు దేనియందు లగ్నమగునో ఆ యాకారమునే పొందును. అట్లు పొందుటయే మనస్సుయొక్క స్వభావము. కాన సాధకుడు (భక్తుడు) తనకు ప్రియమైన వస్తువునందే మనస్సును నిల్పి "ఆత్మగా" భావించుటవలన "భ్రమరకీట న్యాయమున" "బ్రహ్మగా" మారి ఆత్మశక్తులు కలవాడగును. కనుకనే:- "పతియే ప్రత్యక్షదైవము" అని ఉపాసించిన అనసూయ త్రిమూర్తులను పసి పాపలనుగా నొనర్చినది. బొమ్మరాళ్ళను సయితము ఆలుగడ్డలను వలె మెత్తగా ఉడికించి పెట్టినది. "సూర్యోదయాన్ని సయితము" అరికట్టినది- సతీసుమతి; "గురువే ప్రత్యక్షదైవము" అని ఉపాసించిన ఏకలవ్యుడు విలువిద్యలో అర్జుని సైతము అతిక్రమించాడు. "మేక పెంటికయే" శివుడని ఉపాసించిన గొల్లవాడు ముక్తిని సాధించాడు. చైతన్యము లేని గోడను సయితము నడపించి; దున్నపోతుచే వేదమును చెప్పించాడు "జ్ఞానబాయ్". "బొమ్మరాళ్ళను" స్పర్శవేదిగా మార్చాడు తుకారామ్. వీరందరు ఈ భక్తిమార్గము ద్వారా "బ్రహ్మత్వాన్ని" సాధించినవారే.

## 18. గురువు నిమిత్తమాత్రుడు.

నిప్పుపుల్ల యందలి నిప్పు వరపిడిద్వారా ప్రజ్వలింపచేసి మనము ఉపయోగించుకొనుచున్నట్లే. "శ్లో॥ మూలాధారైక నిలయా బ్రహ్మగ్రంధి విభేదినీ "మహాశక్తిః-కుండలినీ"అనినట్లు

జీవులయొక్క మూలాధారమే ఆశ్రయముగాగల, అనంత శక్తియుక్తమైన "కుండలినిని" యోగము-భక్తి-మణి-మంత్ర ఓషధులద్వారా ప్రజ్వలింపచేసి తద్వారా బ్రహ్మత్వమును పొందుటకు గురువు మార్గదర్శకుడు మాత్రమే: "ఉద్ధరేత్ -ఆత్మనా-ఆత్మానం" అనినట్లు ఎవరికివారు తమలోనే ఇమిడియున్న "ఆత్మశక్తులను" గురూపదేశానుసారము "యోగము-భక్తి; మొదలగు సాధనల ద్వారా సాధించుకొని బ్రహ్మత్వమునకై కృషిచేయుట ఎంతయు ప్రధాన కర్తవ్యము.

## 19. కర్మయోగము.

దీనికే "బాహ్యయోగము" అనియు పేరుకలదు. ఇందు "రసోవై సః" అని ఆత్మస్థానీయముగా చెప్పబడిన "పాదరసము" ఓషధీశుడుగా పేర్కొనబడిన "సోమము" మొదలగు దివ్యౌషధుల యందలి జడశక్తులద్వారా బాహ్యముననే సాధింపబడును కాన "బాహ్యయోగమనియు" క్రియావిశేష బహుళమగుటచే "కర్మయోగమనియు" సార్థకములగు పేర్లు పెట్టబడినవి.

ఈ కర్మయోగము రెండు విధములు. ఒకటి రస-ఓషధుల శక్తుల సహాయముతో అంతర్గత శక్తిని ప్రజ్వలింపచేయుట. రెండవది పదార్థశక్తులను యంత్రములయందు ప్రవేశపెట్టి వాటిద్వారా కార్యసాధన మొనర్చుకొనుట.

## 20. కర్మయోగము - మొదటి పద్ధతి.

విద్యుత్తును యంత్రములయందు ప్రవేశపెట్టి తద్వారా కార్యసాధనమెట్లు చేయబడుచున్నదో అట్లే శాస్త్రమున నెప్పినట్లు ఆచరించుటచే "రసదివ్యౌషధులయొక్క శక్తి" (అనగా జడశక్తి) సాధకునియందు ప్రవేశించి అంతర్గతమైన "కుండలినీ శక్తిని" ప్రజ్వలింపచేయును. అందువలన "జ్ఞానయోగమున" ఏయే శక్తులు కలుగునో దీనివలనను అవేశక్తులు కలుగును. ఈ విషయము రసశాస్త్రమునందు వివరింపబడెను. అయినను యాత్రాజీవుల సుబోధకై స్వల్పముగా నిచ్చట సూచింపబడుచున్నది.

## 21. రసముద్వారా - బ్రహ్మత్వసాధన.

రసమునకు-మనస్సునకు చంచలత్వము స్వభావము "శ్లో॥ రసోబద్ధో మనో బద్ధం కిన్నసిధ్యంత భూతలే" అనినట్లు రసమునకు మనస్సునకు, చంచలత్వము లేకుండునట్లు బంధించినచో ఆత్మశక్తులన్నియు కలుగును. కనుకనే:- శ్లో॥ యత్సాంఖ్యైః ప్రాప్యతేస్థానం తద్యోగైరపి గమ్యతే। ఏకం-సాఖ్యంచ - యోగంచ - యఃపశ్యతి

నపశ్యతి॥ తా॥ జ్ఞానయోగమున యేయే ఫలములు పొందబడునో అవి అన్నియు ఈ కర్మయోగమునను పొందబడును. కాన రెంటికి ఫలము ఒక్కటియే: అని శ్రీకృష్ణభగవానుడు వచించియుండెను.

## 22. రససేవన - ఫలము.

శ్లో॥ భక్షణాత్-తస్యరూతస్య-భవేత్-రుద్రసమోనరః।
క్రీడతేన సప్తలోకేషు-శివరూప-పరాక్రమః
నవమాసంతు వక్త్రస్థా-సభవేత్-వ్యాపకోనరః
హర్తా-కర్తా-స్వయంభోక్తా-శాపానుగ్రహకారకః॥

తా॥ సిద్ధరస సేవన వలన ఈశ్వరత్వమును (బ్రహ్మత్వమును) పొంది సప్తలోకములయందు స్వేచ్ఛగా సంచరించును. రసగుటికను తొమ్మిది నెలలు నోటియందు ధరించినచో సర్వవ్యాపకత్వము; సృష్టి-స్థితి-లయ-కర్తృత్వము; శాప-అనుగ్రహ-శక్తులు కలుగును. మరియు అణిమాది సిద్ధులను ఇచ్చుటయందు సమర్థమైన; సంసార సాగరమునుండి తరింపచేయ (ముక్తినీయగల) సమర్థమైనట్టి; రస-ఉపరసములకు అధిపతియగుటచే "రసరాజు" అని పిలువబడెడి పాదరసముతప్ప జరా-మృత్యువులను పోగొట్టి "ముక్తిని" ఇచ్చునది వేరొకటి ఏదియును లేదు. అని రసముయొక్క ప్రభావమును ఆదిశంకరుల గురువగు గోవింద భగవత్పాదులవారు వర్ణించియుండిరి. షడ్దర్శనములలోని "రసేశ్వరదర్శనము" కూడా దానినే చెప్పుచున్నది.

## 23. దివ్యౌషధి - సేవనద్వారా బ్రహ్మత్వము.

శ్లో॥ ఓషధీనాం-పతిం-సోమం-ఉపయుంజ్యాత్-విచక్షణః।
దశవర్ష సహస్రాణి-తనుం-ధారయతే-నవం।
నాగ్నిః-నతోయం-నవిషం-నశస్త్రం-నాస్త్రమేవచ।
తస్య-అలం-ఆయుః-క్షపణే-సమర్థాని-భవంతిహి।
సాంగోపాంగాంశ్చ-వివిధాన్-వేదాన్-విందతి-తత్వతః।

చరత్యమోఘసంకల్పో-నభస్యంబుద దుర్గమే।
వ్రజంతి-పక్షిణో-యత్ర-జలలం బాశ్చతో యదా॥
గతిరౌషధ సిద్ధస్య-సోమసిద్ధేః-గతిః-పరా॥

తా॥ ఓషధులకు **పతియైన** సోమమును యథావిధిగా సేవించిన **పదునారు** వత్సరముల బాలునివలె నూతన శరీరము కల వాడై, పదివేల సంవత్సరములు జీవించును. ఆత్మకు గల "దేశ-కాల-అపరిచ్ఛిన్నత్వము-సర్వ వ్యాపకత్వము" మొదలగునవి కలుగును. శస్త్రి-అస్త్రి-విషములు మొదలగునవి వానిని నశింపచేయ చాలవు. ఆత్మకువలె సర్వజ్ఞత్వము కలవాడై షడంగములతో కూడిన వేదములన్నియు, వానికి స్ఫురించును. పక్షులుకాని, **మేఘములు**కాని సంచరించుటకు శక్యముకాని వినువీధి **యందు** సయితము నిరాటంకముగా సంచరించగలుగును. అని ఇట్లు దివ్యౌషధి ప్రభావము వలన "బ్రహ్మత్వప్రాప్తి" వర్ణింపబడినది. ఇచ్చట సాంఖ్య (జ్ఞాన) యోగమున మనోనిగ్రహముద్వారా చైతన్యశక్తిని స్వాధీన మొనర్చుకొనుటవల ఏయే సిద్ధులు కలుగునో అవే దివ్యౌషధీ-రసగతమైన "జడశక్తిని" ఉపాసించుట (స్వాధీన మొనర్చుకొనుట) వలనను కలుగుననునది స్పష్టమగుచున్నది. (ఈ విష**యమును**)

## 24. ప్రవరుని - అతిథి (కర్మయోగి)

వ॥ వినవయ్యా? జరయు, రుజయు, జెనకంగా నెరచు మమ్ము సిద్ధుల మగుటన్;

మ॥ పరమంబైన రహస్యమా,నయినం-డాపన్, చెప్పెదన్;భూమినిర్
ఝర వంశోత్తము? పాదలేపంబను-పేరంగల్గు దివ్యౌషధం।
పురసం బీశ్వర సత్కృపన్ కల్గెన్-తదూర్భరి ప్రభావంబునన్।
చరియింతున్-పవమాన-మానస-తిరస్కారి-త్వరాహం
కృతన్॥

"దివి-జలరుహ బాంధవ-సైంధవ-సంఘుం బెంత దవ్వు
దగలే కరుగున్॥
ఏనును అంత దవ్వు చన దవ లేక రుగుదుము హుటాహుటి
నదరన్॥

తా॥ ఓ విప్రకుమారా! నీ సందేహము తీర్ప చెప్పు చుంటిని వినుము. నేను రససిద్ధుల మగుటచే ముసలితనము - మరణము- రోగములు మమ్ములను సమీపించుటకు భయపడును. ఇది మిక్కిలి రహస్యమైన విషయము. అయినను నీ భక్తి-శ్రద్ధలకు మెచ్చి చెప్పుచుంటిని. నాకు ఈశ్వరానుగ్రహము వలన "పాదలేపంబను" దివ్యౌషధసిద్ధమైన రసము లభించినది. దాని మహిమచే వాయువేగ మనోవేగములను మించిన వేగముతో వినువీధిని సంచరించగలుగు చుంటిని. సూర్యాశ్వములు ఎంతవరకు పోగలవో అంతవరకు నేనును అలసట ఏమాత్రము లేకుండగ సంచరింపగలను" అని చెప్పిన ప్రవరుని అతిథి "కర్మయోగి" పై విషయమును బుజువు చేయుచుండెను.

## 25. కర్మయోగము - రెండవపద్ధతి.

జ్ఞానయోగమున "చైతన్యశక్తిని"; కర్మయోగము నందలి మొదటి పద్ధతిలో "జడశక్తిని" ఉపాసించుట వలనను;

శ్లో॥ "ధ్యాన-ధ్యాతృ-ధ్యేయరూపా" అనినట్లు

త్రిపుటీ ఐక్యతను పొందుటచే తనయందలి "ఆత్మశక్తి" తనయందే వ్యక్తమయి ఒక శక్తి కేంద్రముగా మారి "జీవో బ్రహ్మైవ" అను అద్వైతాన్ని నిరూపిస్తాడు సాధకుడు.

కర్మయోగము నందలి రెండవ పద్ధతియందు - యంత్ర - గుటికాదు భౌతికములైన (జడశక్తులను) నియంత్రిత మొనర్చి ఆ యంత్రాదుల సహాయంతో దేశకాలాదులను స్వాధీన మొనర్చు కొని "శ్లో॥ నిజం శరీరముత్సృజ్య-పరకాయప్రవేశనం। అర్థానాం - ఛందతః-సృష్టిః యోగ సిద్ధేర్హి-లక్షణం॥" అనినట్లు దూరశ్రుతి -

దూరగత స్వదర్శనము, అదృశ్యకరణత్వము-ఆకాశ గమనము మొదలగు సిద్ధులను సాధించుచున్నారు. అట్లు సాధించుటయే యోగసిద్ధికి లక్షణము. ఇందు ఉపాసకుడు వేరు, శక్తి వేరుగా ఉండుటచేత యంత్రాదులు లేనిచో ఆశక్తులను పొందచాలరు. "టెలివిజను-వైర్లెస్" మొదలగు యంత్రములద్వారా సాధింపబడు శక్తులు ఈ శ్రేణికి చెందినవియే-కనుకనే. శ్లో॥ సాధనేహి-నియమః - అన్యజనానాం। యోగినాంతు తపసాఖిల సిద్ధిః॥" సామాన్యులకు సాధనముల (పరికరముల)తో అవసరము కాని, యోగులు సాధనములు లేకయే సర్వకార్యములను సంకల్పముచే తనే నెరవేర్తురు. అని చెప్పబడినది.

## 26. మనోనిగ్రహము.

శ్లో॥ మనఏవ మనుష్యాణాం-కారణం-బంధమోక్షయోః।
బంధాయ-విషయాసక్తం-ముక్త్యై-నిర్విషయం స్మృతం॥"

తా॥ విషయ సుఖములయందు లగ్నమైన మనస్సు జీవుని మోక్షమును పొందనీయక విషయసుఖములయందే ఉండునట్లు చేయును. ఆ మనస్సే విషయ సుఖములనుండి మరల్పబడినచో ముక్తిని కలిగించును. కాన ప్రతిఒక్కరు। బంధమునకుకాని, మోక్షమునకుకాని మనస్సే కారణమని గుర్తించాలి.

## 27. యోగమును -- అభ్యసించు విధము.

శ్లో॥ శుచౌదేశే-ప్రతిష్ఠాప్య-స్థిరమాసన-మాత్మనః।
నాత్యుచ్ఛ్రితం-నాతినీచం-చేలాజిన-కుశోత్తరం।
తత్రైకాగ్రం-మనః-కృత్వా-యత-చిత్తేంద్రియ క్రియః।
ఉపవిశ్యాసనే-యుంజ్యాత్ -యోగ-మాత్మ విశుద్ధయే।
సమం-కాయ-శిరోగ్రీవం-ధారయన్-అచలం స్థిరః।
సంప్రేక్ష్య-నాసికాగ్రం-స్వం; దిశశ్చానవలోకయన్।

ప్రశాంతాత్మా-విగతభీః; బ్రహ్మచర్యవ్రతేస్థితః।
మనస్సంయమ్య-మచ్చిత్తః-యుక్త ఆసీత-మత్పరః।
యుంజన్నేవం-సదాత్మానం; యోగి-విగత కల్మషః।
శాంతిం-నిర్వాణ పరమాం-మత్సంస్థాం అధిగచ్ఛతి॥
యథాదీపో-నివాతస్థః-నేంగతే సోపమాస్మృతా।
యోగినో-యతచిత్తస్య-యుంజతో-యోగమాత్మనః॥
యోగీయుంజీత సతతం ఆత్మానం రహసిస్థితః।
ఏకాకీయత చిత్తాత్మా నిరాశీః అపరిగ్రహః।

గీ. 6-6-11నుండి 19శ్లో

తా॥ "యోగఃచిత్తవృత్తి నిరోధః" యోగమనగా ఇంద్రియ వ్యాపారములనుండి మనస్సును మరల్చి నిగ్రహించుట. ఎవడు మనస్సును నిగ్రహింపతలచెనో అట్టివాడు నిర్జనమైన-పవిత్రమైన ప్రదేశమునందు ఒంటరిగా ఉండి; మిక్కిలి ఎత్తు, మిక్కిలి పల్లము కలిగి ఉండనట్టియు; యోగసాధనకు సహాకరించెడి దర్భలు-కృష్ణాజినము వస్త్రము క్రమముగా పరువబడనదియు; (మృగ-వ్యాఘ్రాది చర్మములతోను,వస్త్రాదులతోను,నిర్మింపబడిన ఆసనములకు; స్ఫటిక-రుద్రాక్ష-పద్మాక్షాదులతోను, నిర్మింపబడిన జపమాలికలకును; వేరు వేరు గుణములుండుటచే ఉచ్చాటన-మారణాది షట్కర్మలకు ఉపకరించెడి ఆసన-జపమాలాదులను వేరువేరుగా చెప్పియుండిరి. కాన; గచ్చుచేయుట చేతకాక; వెండి-బంగారము మొదలగునవి లేక అట్లు చెప్పిరనుట అవివేకము) స్థిరమైన ఆసనము నేర్పరచుకొని దానిపైని శరీరము-శిరస్సు-కంఠము సమముగను, కదలక ఉండునట్లుగను కూర్చుండి, దిక్కులను చూడక; నాసికాగ్రముననే దృష్టిని నిలిపి, ప్రశాంతమైన, భయరహితమైన మనస్సు బ్రహ్మచర్యవ్రతము కలవాడై, విషయములనుండి మనస్సును మరల్చి,"ఆత్మధ్యానమునందే"నిలుపవలెను. ఈవిధమైన అభ్యాసము

వలన ప్రశాంతమైన మనస్సు కలవాడై "యోగి" అని పిలువబడును. ఇట్లు అభ్యసించుట వలన వాయువులేని ప్రదేశము నందలి దీపమువలెనే విషయముల సంపర్కము లేక ఆత్మయందే నిలుపబడిన మనస్సెన్నా చలించక స్థిరముగా నుండును.

## 28. యోగము ఎవనికి సిద్ధించును? సిద్ధింపదు?

శ్లో॥ నాత్యశ్నతస్తు యోగోస్తి-నచైకాంతమనశ్నతః।
నచాతి స్వప్న శీలస్య-జాగ్రతోనైవ చార్జున।
యుక్తాహార విహారస్య యుక్తచేష్టస్య కర్మసు।
యుక్త స్వప్నావ-బోధస్య యోగో భవతి దుఃఖహా॥
గీ. 6-అ, 16-17 శ్లో॥

తా॥ ఎక్కువగా భుజించువానికి, ఏమియు భుజింపక ఉపవాసముండువానికి;ఎక్కువగా నిద్రించువానికి అసలు నిద్రింపని వానికి యోగము. (ధ్యానము) కుదురదు.

మితమైన ఆహార, విహారములు కలవానికి; జప - తపాది కర్మలయందు నియమితమైన ప్రయత్నము కలవానికి; పరిమితము లైన జాగ్రన్నిద్రలు (మేల్కొనుట--నిద్రించుట) కలవానికి సంసార దుఃఖమును పోగొట్టెడియోగము సిద్ధించును.

కాన చిత్తైకాగ్రతద్వారా "బ్రహ్మత్వాన్ని సాధించాలంటే పై నియమములను అనుసరించుట ఎంతయు అవసరము.

కృష్ణా? చంచలమైన మనస్సును నిగ్రహించుట చాల కష్టము, అని అర్జునుడు పలుకగా:-

"శ్లో॥ అభ్యాసేనచ కౌంతేయ వైరాగ్యేణచ గృహ్యతే॥

ఓ అర్జునా? అభ్యాసము వలన కాని; వైరాగ్యము ద్వారా కాని మనస్సును నిగ్రహించుట సులభము. కాన ఆ పద్ధతిని వినుము :-

## 29. మనస్సును నిగ్రహించు విధము.

శ్లో॥ సంకల్ప ప్రభవాన్ కామాన్ త్యక్త్వా - సర్వానశేషతః।

మనసై వేంద్రియ గ్రామం వినియమ్య సమంతతః।
శనైః శనైః ఉపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా।
ఆత్మసంస్థం మనఃకృత్వా నకించిదపి చింతయేత్।
యతో యతో నిశ్చరతి మనః చంచల మస్థిరం।
తతస్తత; నియమ్యైతత్ ఆత్మన్యేవ వశంనయేత్।
ప్రశాంత మనసంహ్యేనం యోగినం సుఖముత్తమం।
ఉపైతి శాంతరజసం బ్రహ్మభూతం అకల్మషం॥ గీ6-అ-24శ్లో॥

తా॥ మనస్సునందు పుట్టిన కోర్కెలను పూర్తిగా విడచి, మనస్సుచేత ఇంద్రియములను విషయములనుండి మరల్చి. ధైర్యముతో కూడిన బుద్ధితో మనస్సును మెల్ల మెల్లగా ఆత్మయందు ఆసక్తి కల దానినిగా మార్చవలెను. మనస్సును "ఆత్మయందే" నిలచునట్లు చేసి ఏ విషయములను చింతింపరాదు. చంచలమును, అస్థిరమును అగు మనస్సు ఏయే విషయముల వైపునకు పరుగిడునో వాటినుండి వెంటనేమరల్చి ఆత్మయందే స్థిరముగా ఉండునట్లు చేయవలెను. ఇట్లు సాధన(అభ్యాసము)చేయుటవలన శాంతచిత్తుడును, రజోగుణసంబంధమైన విక్షేపములు లేనివాడగును; పవిత్రుడును, బ్రహ్మభావమును (బ్రహ్మైక్యమును) పొందినవాడునగు యోగి శ్రేష్ఠమగు సుఖమును (బ్రహ్మానందమును) పొందును.

30. మనోనిగ్రహాదుల యందసమర్థుడేమి చేయవలెను?

శ్లో॥ అథచిత్తం సమాధాతుం నశక్నోషి మయిస్థిరం। అభ్యాస యోగేనతతో మామిచ్ఛాప్తుం ధనంజయ। మదర్థమపి కర్మాణి కుర్వన్ సిద్ధిమవాప్స్యసి। అథైతదప్యశక్తోసి కర్తుం మద్యోగమాశ్రితః। సర్వకర్మ ఫలత్యాగం తతః కురు యతాత్మవాన్॥

తా॥ అర్జునా!నీవు నాయందే మనస్సును నిల్పజాలనిచో

అభ్యాసయోగమున నన్ను పొంద యత్నింపుము. అభ్యాస మొనర్చు టకును సమర్థుడవు కానిచో భగవత్ప్రీతికరములగు కర్మలను చేయుము. అట్లు చేయుటకును సమర్థుడవు కానిచో నన్ను శరణు పొంది మనస్సు నిగ్రహించి నిత్య - నైమిత్తిక - కర్మలను పరమేశ్వరార్పణబుద్ధితో ఆచరించినను కృతార్థుడనగుదువు. అని పలికెను.

శ్లో॥ సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ।
త్వామహం సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచ॥

తా॥ ఓ అర్జునా? నీవు సర్వమును విడచి నన్నే త్రికరణ శుద్ధిగా శరణు పొందినచో నిన్ను అన్ని పాపములనుండియు రక్షింతును. అని కృష్ణభగవానుడు అభయమిచ్చి యుండెను.

## 31. నియముల నతిక్రమించువారి స్థితి.

శ్లో॥ ఏవం ప్రవర్తితం చక్రం నానువర్తయతీహ యః।
అఘాయుః-ఇంద్రియారామః మోఘంపార్థ సజీవతి।
యః- శాస్త్ర విధిముత్సృజ్య వర్తతే కామకారతః।
ననస్సిద్ధి-అవాప్నోతి-నసుఖం-నపరాంగతిం।
తస్మాత్ శాస్త్రం-ప్రమాణంతే-కార్యా కార్యవ్యవస్థితౌ॥
గీ. 16. అ. 23 శ్లో॥

తా॥ ఎవడు ఇంద్రియవశుడై ఈ యాత్రాకైదునందలి విధి - నిషేధములను పాటించడో అట్టివాడు మానవజన్మను కోల్పోయి ఎన్నటికిని ముక్తిని పొందచాలడు. ఎవడు విషయ సుఖములచే మత్తిలి శాస్త్రబోధలను నిర్లక్ష్యమొనర్చినిరంకుశముగా ప్రవర్తించునో అట్టివాడు బ్రహ్మత్వసిద్ధికాని; సుఖమును కాని; కార్యసిద్ధిని కాని పొందనేరడు. కాన కర్తవ్య – అకర్తవ్య నిర్ణయము చేయుటయందు శాస్త్రమే ప్రమాణము. కాన శాస్త్రపద్ధతి ననుసరించుట శ్రేయస్కరము.

## 32. నియములను పాటింపని యాత్రికుని ప్రబోధ.

ఒక యాత్రికుడు మోక్షమార్గదర్శకుడు అయిన "ఉపనిషత్తును" స్వర్గమార్గదర్శకుడు అయిన "వేదములను" గాని అనుసరింపక స్వేచ్ఛగా విహారాన్ని సల్పి మృత్యు సమయమున యమభటుల చేజిక్కి చేయునది ఏమియు లేక విచారముతో తోటి యాత్రికుల నుద్దేశించి:—

శ్లో॥ నధ్యాతం-పదం ఈశ్వరస్య విధివత్ సంసార విచ్ఛిత్తయే।
స్వర్గద్వార-కవాట-పాటనపటుః-ధర్మోపి-నోపార్జితః।
నారీపీన పయోధరోరు యుగళం—స్వప్నేపి—నాలింగితం।
మాతుః—కేవలమేవ యౌవ్వన వనచ్ఛేదే—కుఠారో వయం॥

తా॥ ఓ యాత్రికులారా? నేను యాత్రామార్గదర్శకులైన "ఉపనిషత్తు"ల ననుసరించి పునరావృత్తిలేని "బ్రహ్మపథమును" దేవయానముగుండా పయనించి చేరుటకై తగిన యోగధనాన్ని సంపాదించి యుండలేదు. స్వర్గమార్గదర్శకమైన వేదముల ననుసరించి యజ్ఞాదులద్వారా స్వర్గాది దివ్యభోగముల ననుభవించుటకై తగిన పుణ్యధనాన్ని సయితము సంపాదించి యుండలేదు. "స్త్రీ" ద్వేషినై భుక్తి — ముక్తుల కాకరమైన స్త్రీని సయితము యథావిధిగా చేపట్టలేదు. కేవలము తల్లియొక్క యౌవనమును వనమును ఛేదించుటకు గొడ్డలినైతిని. (నేను పుట్టి తల్లి యౌవ్వనమును చెరచితిని.) ఇప్పుడు యమభటుల చేజిక్కి ఇతికర్తవ్యతా మూఢుడనైతిని. కాన "శ్లో॥ నపునరేతి— గతం చతురం వయః" గడచిన వయస్సు తిరిగి రానేరదు. శ్లో॥ సంప్రాప్తే—సన్నిహితే—కాలే—నహి—నహి—రక్షతి—డుకృఞ్ కరణే" మృత్యువు సమీపించినచో మీ తెలివి ఏమియు రక్షింపజాలదు. అందుచేత మీరైనా యాత్రామార్గదర్శకుల ననుసరించి దేవయానము గుండా పయనించి "బ్రహ్మపథాన్ని" చేరుటకై తగిన కృషి చేయుడు. అని ఉచ్ఛైస్స్వరముతో దిక్కులు పిక్కటిల్లేటట్లు విలపించాడు యాత్రికుడు.

## ౩౩. బ్రహ్మపథప్రాప్తికి - ప్రధాన మార్గములు.

శ్లో॥ ధ్యానేనాత్మని పశ్యంతి - కేచిదాత్మాన - మాత్మనా।
అన్యే-సాంఖ్యేన-యోగేన-కర్మయోగేన చాపరే।
అన్యేత్వేవమజానంతః-శ్రుత్వాన్యేభ్య-ఉపాసతే।
తేపి-చాతి తరంత్యేవ-మృత్యుం శ్రుతిపరాయణాః॥

గీ॥ 13 అ. 24 శ్లో

తా॥ కొందరు ధ్యానముద్వారా మనస్సును నిగ్రహించి తనయందును; మరికొందరు ఆత్మానాత్మ (ప్రకృతి - పురుష) భేద పర్యాలోచన రూపకమైన సాంఖ్య (జ్ఞాన) యోగముద్వారాను; మరికొందరు అష్టాంగయోగము ద్వారాను; "ఆత్మను" తెలుసుకొనుచుండిరి. మరికొందరు పై విధముగా ఆత్మతత్వమును గుర్తింపచాలక గురూపదేశముద్వారా సులభమార్గమున ఉపాసించియు స్వస్థానమైన బ్రహ్మపథమును పొందుచున్నారు. ఈ మార్గము లన్నిటిలోను "భక్తిమార్గమే" సులభమైన దగుటచే దానిని ఆశ్రయించుటయే శ్రేష్ఠము. ఎవరు బ్రహ్మవేత్తలైన గైడరు యొక్క సలహా ననుసరించియు; వేదములు - ఉపనిషత్తులు అను గైడు ననుసరించియు పయనింతురో అట్టివారు సుఖముగా స్వస్థానమును చేరుటకు నాయొక్క సహాయముకూడా ఉండునని "యోగక్షేమంవ హామ్యహం" అని భగవానుడు ప్రతిన పలికెను. కాన పై వాటిలో ఎవరికి ఏది అందుబాటులో ఉండునో దానిని ఆశ్రయించుట యుక్తము.

— సంపూర్ణము —

# సారాంశము

శ్రేష్ఠమైన క్షేత్ర-బీజములను సంపాదించి క్షేత్ర - బీజ సంస్కారములు యథావిధిగాచేసి "ఉత్తర చూచి ఎత్తరగంప" అనినట్లు సకాలంలో విత్తనములు నాటుటవలన పోషక పదార్థములతో కూడిన ఎక్కువ దిగుబడిగల సస్యం లభిస్తుంది. ఎక్కువ దిగుబడి ద్వారా వ్యవసాయదారునకు తుష్టిని; పోషక పదార్థముల సమృద్ధి వలన దానిని సేవించే ప్రజలకు పుష్టిని కలిగిస్తుంది. మరియు; హార మేఖల మొదలగు వృక్షశాస్త్రగ్రంథములయందు, (సంకర) జాతి నిర్మాణమునకై వినోదముగా చెప్పబడిన అంట్లు కట్టుట; (అకాల ఫల-పుష్పాదులకై) దోహద (పైబ్రీడు) మొనర్చుట మొదలగు సంస్కారములచే "ఫలం-తాళీవదాడిమా" అనినట్లు స్వజాతి-గుణ-ధర్మములను వీడి సంకరగుణములు గలదై పైరు వ్యవసాయదారునకు ఆధిని; ప్రజలకు వ్యాధిని కలిగిస్తుంది. అలాగుననే పరపురుష సంపర్క-సగోత్ర-సాపిండ్యాది దోషములు లేక; వివాహాదిక్షేత్ర సంస్కారములచే సక్రమముగా సంస్కరింపబడిన క్షేత్రస్థానీయమైన స్త్రీ యందు; ఉపనయనాది బీజసంస్కారములచే సంస్కరింపబడిన బీజ స్థానీయుడైన పురుషుడు; శాస్త్రోక్తకాలమున, నియమములను పాటించి సంతానమును బడసినచో "శ్లో॥బ్రహ్మవర్చస్వినః పుత్రాః జాయంతేశిష్టసమ్మతాః।రూపసత్వ గుణోపేతాః ధనవంతో యశస్వినః। వర్ష్యాప్తకామాః ధర్మిష్ఠాః జీవంతిచ శతంసమాః" అనినట్లు ఉత్తమ సంతానము కలిగి తల్లి-తండ్రులకు, దేశమునకు, తుష్టిని - పుష్టిని కలిగిస్తుంది. అట్లుగాక—శ్లో॥వ్యభిచారేణ వర్ణానాం అవేద్యా వేదనేనచ। స్వకర్మణాం పరత్యాగాత్ జాయతే వర్ణసంకరః" అనినట్లు వర్ణాంతర-సగోత్ర-సాపిండ్యాది సంబంధముల వలనను; వివాహోప నయనాదులు యథావిధిగా నాల్గురోజులు జరుపక ఒకరోజులోనే ముగించు సంస్కార లోపమొనర్చుట వలనను; మిశ్రజాతి ఏర్పడి వంశమునకు; దేశమునకుకూడా దుఃఖహేతువగుతుంది. కాన వంశమును-దేశమును తరింపచేసి స్వస్థానమును సుఖముగా చేరగల సంతతి కావాలంటే శాస్త్రము ననుసరించుట ఎంతయు ముఖ్యము.

రాణీ నరసింహాచార్యులు వ్రాసిన జీవ వినోదయాత్ర సమాప్తము.

## -: బోధానందాయుర్వేదాశ్రమ గ్రంథమాల :-

—o—

[1] సాంఖ్య కారికలు (కపిలఋషికృత వేదాంత గ్రంథము (ఈశ్వరకృష్ణ విరచితటీక-ఆంధ్రతాత్పర్యము) 2-00

[2] అగదకల్పవల్లి :- జంగమ (పాములు మొ॥ స్థావర (పాషాణము) మొ. విషములు, వాటికి, సులభ చికిత్సలు, "విషస్యవిషమౌషధం" అనుట ఎట్లో మొదలగు విషయములు యిందు వివరించబడినవి 2-00

[3] మసూరికాక్రిమ్యాధి సంస్కరణలు: టీకాలనుగూర్చి ఆయుర్వేద అభిప్రాయము 1-00

[4] పండుగలు : ఇందు పండుగలను ఆచరించుటవలనకలుగు సాంఘిక-ఆధ్యాత్మిక-ఆధిభౌతిక లాభములు "గ్రహణమననేమి ?" సంధ్యావందనమననేమి? అను విషయములు సోదాహరణముగా వివరింపబడినవి 2-00

---

[ప్రపంచ జీవ వినోదయాత్ర ముద్రణకై శ్రీ వేంకటేశ్వరస్వామివారి ద్రవ్య సహాయమేగాక మిగిలిన వ్యయమునకు ద్రవ్యసహాయమొనర్చిన

దాతల పేర్లు:

| | | |
|---|---|---|
| 1. | శ్రీ పోతరాజు రామలింగేశ్వరరావుగారు (ఆడిటర్) | 116-00 |
| 2. | శ్రీ C. నరసింహారావు గారు D. M. O | 116-00 |
| 3. | శ్రీ G. రామచంద్రరావుగారు (హెల్త్ఇనస్పెక్టర్) | 116-00 |
| 4. | శ్రీ దాసరి వెంకటేశ్వర్లు గారు M.A. | 116-00 |
| 5. | శ్రీ హరిఅనంత పద్మనాభశాస్త్రిగారు B.A. B.L (వకీలు) | 116-00 |
| 6. | పేరి సుందరరామయ్యగారు తాతా స్టీల్‌కంపెనీ మేనేజర్ | 116-00 |